
గురువారం
31•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 84
• పేజీలు : 16 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



కృష్ణమ్మ కళ కళ

ఉరుకులు పెడుతున్న భీమా నది
ఉజ్జయిని నుంచి 40 వేల క్యూసెక్కుల విడుదల
తుంగభద్రకు పెరిగిన వరద
జూరాల నుంచి ఎత్తిపోతలకు నీరు

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ ఉరుకలెత్తుతున్నది. ఆల్మట్టి నుంచి పవర్‌హౌస్ ద్వారా 31వేల క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు. భీమా నదిపై నిర్మించిన ఉజ్జయిని ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు 40 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. రెండ్రోజుల్లో ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నదని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో పెరుగడంతో దీనికి అనుబంధంగా ఎత్తిపోతల పథకాలు, కాల్వలకు నీటిని విడుదలచేస్తున్నారు. ఎగువ నుంచి ఉజ్జయిని ప్రాజెక్టులోకి 53వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. కర్ణాటకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకూ ఇన్‌ఫ్లో పెరిగింది. బుధవారం సాయంత్రం వరకు ఎగువ నుంచి 23వేల క్యూసెక్కుల నీరు వస్తున్నది.

దిగువన పండుగే..

మహారాష్ట్రలోని మహాబలేశ్వరం, ముంబై తదితర ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయాలకు వరద మొదలైంది. ఆల్మట్టికి మరో రెండుమూడ్రోజుల్లో దాదాపు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రానున్నదని కర్ణాటక నీటిపారుదల శాఖ అధికారులు చెప్తున్నారు. దీంతో జలాశయం నుంచి నీటిని పవర్‌హౌస్ ద్వారా దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ఈ వరద ఇంకా నారాయణపూర్ ప్రాజెక్టుకు చేరాల్సి ఉంది. ఆల్మట్టి నుంచి బుధవారం ఉదయం వరకు 20 వేల క్యూసెక్కులు ఉండగా సాయంత్రానికి 31వేలకు పెంచారు. ఉజ్జయిని ప్రాజెక్టు నుంచి కూడా స్పిల్‌వే గేట్లను ఎత్తి బుధవారం సాయంత్రం వరకు 40 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.ఈ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 53,461 క్యూసెక్కులు వస్తున్నది. ఉజ్జయిని ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 117.24 టీఎంసీలు కాగా

› మిగతా 11వ పేజీలో

పకడ్బందీగా ప్రక్షాళన

భూ రికార్డులను సరిచేసేందుకు 1193 బృందాలు ఏర్పాటుచేయాలి

ఒక్కో బృందానికి తొమ్మిది గ్రామాలు ■ మూడునెలల్లో కార్యక్రమం పూర్తికావాలి
అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం ■ త్వరలో తహసీల్దార్లతో సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూమి రికార్డుల ప్రక్షాళన పకడ్బందీగా, అత్యంత పారదర్శకంగా జరుగాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్షాళనలో ఏ ఒక్క రైతుకు ఎలాంటి హాని కలుగకూడదని స్పష్టంచేశారు. రికార్డుల ప్రక్షాళన తరువాత రూపొందిన పక్కా రికార్డుల ఆధారంగానే రైతులకు ఏడాదికి రూ.8 వేల పెట్టుబడి ఇస్తామన్నారు. వచ్చే ఏడాదినుంచి ఈ పథకాన్ని అమలుచేయాల్సి ఉన్న నేపథ్యంలో భూమి రికార్డుల ప్రక్షాళనను మూడు నెలల్లో పూర్తి చేయాలని సీఎం అధికారులకు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్దేశించిన గడువులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయడానికి వీలుగా 1193 బృందాలు ఏర్పాటుచేయాలని, ఒక్కో బృందానికి తొమ్మిది గ్రామాలు కేటాయించాలని అన్నారు. ఈ బృందాల ఏర్పాటు బాధ్యతను జిల్లా కలెక్టర్లకు సీఎం అప్పగించారు. లెక్కలన్నీ సవరించిన తరువాత భూముల తుది జాబితాపై గ్రామంలోని రైతులందరి సంతకాలు తీసుకొని వెల్లడించాలన్నారు. రికార్డుల ప్రక్షాళనలో భాగంగా తొలుత ఏ విధమైన చిక్కులు, సమస్యలు లేని సుమారు 95 శాతానికి సంబంధించి వివరాలు ఖరారుచేయాలని అన్నారు. భూమి రికార్డుల సరళీకరణ, ప్రక్షాళనపై సీఎం బుధవారం ఉదయం ప్రగతిభవన్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ఒకప్పుడు ప్రభుత్వ ప్రధాన ఆదాయవనరుగా భూమి శిస్తు ఉండేది. అయితే కాలక్రమేణా రైతుల దగ్గర శిస్తు వసూలుకు బదులు ప్రభుత్వమే ఎకరానికి రూ.8 వేల చొప్పున పెట్టుబడి సమకూరుస్తున్నది. దీంతో భూమికి సంబంధించిన దృక్పథమే పూర్తిగా మారిపోయింది. ప్రపంచవ్యాప్తంగా రైతులను అన్ని దేశాలు గౌరవిస్తున్నాయి. ఆహారరంగంలో స్వావలంబన ఉండాలని ఏ దేశమైనా ఆలోచించడమే దీనికి ప్రధాన కారణం. మనదేశం కూడా అంతే. మన రాష్ట్రం కూడా వ్యవసాయిక ప్రధాన ప్రాంతమే కాకుండా ఇక్కడ సమశీతోష్ణ వాతావరణం ఉండటంవల్ల పంటలు బాగా పండుతాయి. రాబోయే సంవత్సరం నుంచి కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు పుష్కలంగా లభ్యం అవుతాయి. చెరువులు నింపుకొంటాం. దీనిద్వారా పూర్వపు ఏడు జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు ఉపయోగంలోకి వస్తాయి. పంటలు బాగా పండటంతో అన్ని రకాల ప్రజలు, రైతులు బాగుంటారు' అని చెప్పారు.

> మనకున్న 31 మంది జిల్లా కలెక్టర్లకు ఏయే గ్రామాలను, ఏయే టీములకు కేటాయించాలో అధికారం ఉంటుంది. ఇది ప్రధానంగా భూమి రికార్డుల ప్రక్షాళన. ఇందులో భాగంగా రికార్డుల్లో ఉండే చిత్రవిచిత్రమైన చిక్కులు, వివాదాలు తలెత్తే అంశాలన్నీ పోవాలి. బై నంబర్ల గోల్‌మాల్ లేకుండా పోవాలి.
> - సీఎం కేసీఆర్



భూమి రికార్డుల సరళీకరణ, ప్రక్షాళనపై బుధవారం ప్రగతిభవన్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

బై నంబర్ల గోల్‌మాల్ పోవాలి

'పహాణీ, సేత్వారీలాంటి పాతకాలపు పదాలు మన తెలుగు భాషకు సంబంధించినవి కావు. అందుకే తెలుగులో సరళంగా, సులభంగా, సరళీకృతమైన భాషలో ఈ పదాలను

› మిగతా 2వ పేజీలో

రద్దయిన నోట్లన్నీ వాపస్!

పెద్ద నోట్ల రద్దుపై ఇదీ ఆర్బీఐ పద్దు

రద్దయ్యేనాటికి చలామణిలో ఉన్న రూ.500, రూ.1000 నోట్ల విలువ	రూ.15.44 లక్షల కోట్లు
బ్యాంకులలో జమ అయిన రద్దయిన నోట్ల విలువ	రూ.15.28 లక్షల కోట్లు
వెనుకకు రాని నోట్ల విలువ	రూ.16,050 కోట్లు
2016లో నోట్ల ముద్రణ వ్యయం	3421 కోట్లు
2017లో నోట్ల ముద్రణ వ్యయం	7965 కోట్లు

- నోట్లరద్దు సలహా ఇచ్చినవారికి నోబెల్ ఇవ్వాలి: చిదంబరం
- మోదీని భారత్ ఎన్నడూ క్షమించదు: ఏచూరి
- అవగాహన లేకనే విమర్శలు: ఆర్థికమంత్రి జైట్లీ

1.3 శాతం వెయ్యి నోట్లు మాత్రమే రాలేదు
వార్షిక నివేదికలో ఆర్బీఐ వెల్లడి
వెనుకకు వచ్చిన రూ.500 నోట్లపై మౌనం

ముంబై, ఆగస్టు 30:

రద్దు చేసిన పెద్ద నోట్ల లెక్కను ఎట్టకేలకు భారత రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) బయటపెట్టింది. రద్దయిన పెద్ద నోట్లన్నీ దాదాపుగా (99 శాతం) వెనుకకు వచ్చాయని వెల్లడించింది. కేవలం 1.3 శాతం వెయ్యి నోట్లు వెనుకకు రాలేదని బుధవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో స్పష్టంచేసింది. పెద్ద నోట్ల రద్దు నాటికి మొత్తం రూ.15.44 లక్షల కోట్లు విలువచేసే రూ.500, రూ.1000 నోట్లు చలామణిలో ఉండగా, ఇందులో రూ.15.28 లక్షల కోట్ల విలువ చేసే నోట్లు వెనుకకు వచ్చాయి. అంటే.. 99శాతం పెద్ద నోట్లు వెనుకకు వచ్చినట్లు ఆర్బీఐ పేర్కొన్నది. రద్దుచేసిన వాటిలో 685.8 కోట్ల వెయ్యి నోట్లు ఉండగా, నోట్ల రద్దు అనంతరం

› మిగతా 13వ పేజీలో

జీహెచ్ఎంసీ 'డబుల్' ధమాకా!

- గ్రేటర్ పరిధిలో లక్షకు చేరిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల టెండర్లు
- ఇప్పటికే వివిధ దశల్లో 68,296 గృహాలు
- మరో 31,704 ఇండ్లకు బిడ్లు ఆహ్వానించిన బల్దియా
- ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి
- 8,225 కోట్లతో 109 కాలనీలుగా నిర్మాణం

6

ఆధార్ గడువు డిసెంబర్ 31 వరకు

పొడిగింపు

సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్రసర్కారు
పథకాలతో ఆధార్ లంకెపై విచారణ నవంబర్‌కు వాయిదా

5

పగటికలలల కాంగ్రెస్!

అందులో రిజైన్‌లేగానీ జాయినింగ్‌లుండవు ■ అధికారం రాదనే భయంతో కాంగ్రెస్ నేతలు ■ అందుకే అబద్ధాల ప్రచారంతో పబ్బం గడుపుతున్నరు
భూ రికార్డుల ప్రక్షాళనపై కోర్టులకు పోతమంటున్నరు ■ రైతులకు మేలు చేస్తుంటే ఇంత కండ్ల మంట ఎందుకు?
కాంగ్రెస్ నాయకులకు రైతులే తగిన బుద్ధి చెప్తరు ■ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అన్ని వర్గాలు టీఆర్‌ఎస్‌కు దగ్గర కావడాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. ఇక అధికారంలోకి రావడం కల్లేనని తేలడంతో ఆ పార్టీ నాయకులను మానసిక వ్యథ పట్టి పీడిస్తున్నదని ఎద్దేవాచేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. నిరాశా, నిస్పృహలు తారస్థాయికి చేరడంతో మరింత దిగజారిన కాంగ్రెస్ నాయకులు టీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల నమ్మకాన్ని, కార్యకర్తల బలాన్ని కోల్పోయిన కాంగ్రెస్ నాయకులు పగటికలలు కంటున్నారని ఎద్దేవాచేశారు. ఆ పార్టీ మునిగిపోతున్న నావ అని అభివర్ణించిన మంత్రి.. అందులో ఎక్కడానికి ఎవరూ ముందుకు రారన్నారు. 'కాంగ్రెస్‌లో రిటైర్మెంట్లే తప్ప రిక్రూట్‌మెంట్లు ఉండవు. రిజైన్లు తప్ప జాయినింగ్‌లు ఉండవు' అని వ్యాఖ్యానించారు. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్ష హోదా కోల్పోయిన ఆ పార్టీ 2019లో తెలంగాణలో కూడా ప్రతిపక్ష హోదా కోల్పోక తప్పదని అన్నారు. 'కాంగ్రెస్ నాయకులు భ్రమలో

› మిగతా 11వ పేజీలో



మరో మూడు రోజులు

ఓ మోస్తరు వానలు

కొనసాగుతున్న ద్రోణి ప్రభావం

3

జెన్‌కో తాత్కాలిక ఉద్యోగులకు గ్రేడ్లవారీగా

వేతనాల పెంపు

ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపు ■ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీఎస్ జెన్‌కో) పరిధిలో తాజాగా 'అబ్జార్ప్షన్' చేసిన 2914 మంది ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగించాలని నిర్ణయిస్తూ టీఎస్‌జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టు సూచనలను అనుసరిస్తూ.. అబ్జార్ప్షన్ చేసిన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు యథాతథంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల విధానంలోనే పనిచేయనున్నట్టు అందులో పేర్కొన్నారు. కాగా మొత్తం 2914 మంది తాత్కాలిక ఉద్యోగుల్లో ముగ్గురిని వివిధ కారణాలవల్ల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను గ్రేడ్లవారీగా పెంచారు. అలాగే ఆయా ఉద్యోగుల జీతభత్యాలను పెంచుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రతి నెలా చెల్లించే వేతనాలకు ఈపీఎఫ్ 13.15%, ఈఎస్ఐ 4.75% జెన్‌కో జమచేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఉద్యోగి వేతనం నుంచి ఈపీఎఫ్ 12%, ఈఎస్ఐ 1.75% తగ్గిస్తారు. ఈ విధానం ద్వారా ఆర్టిజాన్ గ్రేడ్-1 ఉద్యోగులకు ఏకీకృత (కన్సాలిడేటెడ్) వేతనం రూ.19,508 నిర్ణయించగా తాజాగా పెంచి న ఈపీఎఫ్, ఈఎస్ఐలను కలుపుకొని రూ.20,118 చెల్లిస్తారు. గ్రేడ్-2 ఉద్యోగులకు రూ.16, 634, గ్రేడ్-3 ఉద్యోగులకు రూ.13,984,

పెరిగిన వేతనాలు ఇలా..

గ్రేడ్-1 ఉద్యోగులకు	రూ.20,118
గ్రేడ్-2 ఉద్యోగులకు	రూ.16,634
గ్రేడ్-3 ఉద్యోగులకు	రూ.13,984
గ్రేడ్-4 ఉద్యోగులకు	రూ.12,217

› మిగతా 11వ పేజీలో

భూమి రికార్డుల ప్రక్షాళనపై నేడు కలెక్టర్లతో సీఎం కేసీఆర్ కాన్ఫరెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా భూమి రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంపై గురువారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకల్లా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, అడిషనల్ జిల్లా కలెక్టర్లు అంతా ప్రగతిభవన్‌కు హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ మెమో జారీచేశారు.

నేడు వ్యవసాయ అధికారులకు శిక్షణ

రైతు సదస్సుల నిర్వహణపై అధికారులకు మార్గనిర్దేశం చేయనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ అధికారులకు గురువారం వర్క్‌షాపు నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల వ్యవసాయాధికారి నుంచి జేడీఏ స్థాయి అధికారి వరకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రైతు సదస్సుల నిర్వహణపై అధికారులకు మార్గనిర్దేశం చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి అమలుకానున్న ఎకరానికి ఏటా రూ.8 వేల పెట్టుబడి పథకంలో ప్రధానంగా వ్యవహరించే వ్యవసాయ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎం కేసీఆర్ కీలక సూచనలు చేయనున్నారు. పెట్టుబడి పథకం అమలు చర్యల్లో భాగంగా ఇప్పటికే భూసర్వేను పూర్తిచేసిన రాష్ట్ర ప్రభుత్వం.. రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ ఒకటి నుంచి తొమ్మిది వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటు బాధ్యతలను జిల్లా మంత్రులకు సీఎం కేసీఆర్ అప్పగించారు. గ్రామ రైతు సమన్వయ సమితుల ఏర్పాటు తర్వాత సెప్టెంబర్ 10 నుంచి 14 వరకు మండల రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేయనున్నారు.

'ల్యాండ్ రికార్డ్స్' డైరెక్టర్‌గా వాకాటి కరుణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రాజెక్టు మిషన్ డైరెక్టర్‌గా, 2004 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న వాకాటి కరుణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించినందున ఆమె ఆధ్వర్యంలో భూమి రికార్డులు అప్‌డేట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. సీసీఎల్ఏకు, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కరుణ ఎప్పటికప్పుడు రికార్డుల అప్‌గ్రేడ్‌పై సమాచారం అందజేస్తారు.



భూ రికార్డులపై బుధవారం ప్రగతిభవన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి కే తారక రామారావు, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, కార్యదర్శులు శాంతికుమారి, స్మితా సబర్వాల్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ప్రక్షాళన

మొదటిపేజీ తరువాయి...

మార్చాలి. అదేవిధంగా అనేక రకమయిన లెక్కలు కూడా అనవసరం. పహాణీలో కూడా ఎక్కువ కాలమ్స్ అవసరం లేదు. సులభంగా, కష్టతరం కాకుండా ఉండాలి. భూమి రికార్డుల ప్రక్షాళన ఈ నేపథ్యంలో జరుగుతున్నది. దీనికోసం 1193 బృందాలను ఏర్పాటుచేసి, ఒక్కొక్క బృందానికి తొమ్మిది గ్రామాలు కేటాయించి, మొత్తం భూమి రికార్డుల ప్రక్షాళన, సవరణ చేయటానికి మూడు నెలల వ్యవధి పడుతుంది. మనకున్న 31 మంది జిల్లా కలెక్టర్లకు ఏయే గ్రామాలను, ఏయే టీములకు కేటాయించాలో అధికారం ఉంటుంది. ఇది ప్రధానంగా భూమి రికార్డుల ప్రక్షాళన. ఇందులో భాగంగా రికార్డుల్లో ఉండే చిత్రవిచిత్రమైన చిక్కులు, వివాదాలు తలెత్తే అంశాలన్నీ పోవాలి. రికార్డుల్లో ఉన్న అస్తవ్యస్త లెక్కలు చిక్కులకు, వివాదాలకు దారితీస్తున్నాయి. బై నంబర్ల గోల్‌మాల్ లేకుండా పోవాలి. రైతుకు న్యాయపరమైన చిక్కులు పూర్తిగా పోయి ప్రశాంతంగా వ్యవసాయం చేసుకోవాలి' అని సీఎం చెప్పారు.

కొరియర్ ద్వారా పాసుపుస్తకాలు

'కోట్లాది బ్యాంకు ఖాతాలను పకడ్బందీగా నిర్వహిస్తున్న కోర్ బ్యాంకింగ్ విధానాన్ని భూ రికార్డులకు అనుసరించాలి. రికార్డుల ప్రక్షాళన తరువాత కోర్ బ్యాంకింగ్ తరహాలో ఎప్పటికప్పుడు చోటుచేసుకునే మార్పులకు అనుగుణంగా కంప్యూటర్‌లో నిక్షిప్తంచేయాలి. దీనికోసం వెయ్యిమంది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధికారులను ప్రత్యేకించి రెవెన్యూ శాఖలో నియమించాలి. ఆన్‌లైన్‌లో ఎటువంటి సమాచారమైనా పట్టాదారులకు లభ్యమయ్యేలా రికార్డుల్లో ఉండాలి. భూ ప్రక్షాళన ఒకవైపు జరుగుతుండగా అది పూర్తయ్యేసరికి ఐటీ ఆఫీసర్ల నియామకం, కంప్యూటర్లు, సర్వర్ల కొనుగోలు, కంప్యూటర్ అనుసంధానం పూర్తికావాలి. మ్యుటేషన్ ప్రక్రియ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఎప్పటికప్పుడు జరిగిపోవాలి. రైతులు తమ క్రయవిక్రయాల కోసం రిజిస్ట్రేషన్ ఆఫీసుకు ఒకే ఒక్కసారి వెళ్లే వెసులుబాటు ఉండాలి. ఆ తరువాత వారి పాస్‌పుస్తకాలు కొరియర్ ద్వారా ఇంటికే రావాలి. బ్యాంకుల్లో రైతుల పాస్ పుస్తకాలు కుదువ పెట్టించుకునే విధానం పోవాలి. కంప్యూటర్ ఆధారిత సమాచారం ఆధారంగా రైతులకు రుణాలు మంజూరు చేయాలి' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ఇక నుంచి కలెక్టర్ కోర్టు ఒక్కటే

'ఒక్క కలెక్టర్ కోర్టు మినహా ఇతర రెవెన్యూ కోర్టులన్నీ రద్దు చేయాలి. భూమి సంబంధ వ్యవహారాలు రాజ్యాంగపరంగా రాష్ట్ర పరిధిలో ఉంటాయి కాబట్టి, దానికి సంబంధించిన చర్యలు చేపట్టే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం. కాబట్టి దీనికి అనుగుణంగా న్యాయపరమైన చిక్కులకు ఆస్కారం లేనివిధంగా రికార్డుల ప్రక్షాళన జరుగాలి. భూమి రికార్డుల ప్రక్షాళన, సవరణలో పకడ్బందీగా, త్వరితగతిన పని పూర్తిచేసే తహసీల్దార్, ఆర్డీవో, జిల్లాస్థాయి అధికారులకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు ఇవ్వాలి. గురువారం కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ సంబంధిత అధికారుల సమావేశం తరువాత త్వరలోనే రాష్ట్రంలోని తహసీల్దార్లతో సమావేశం ఏర్పాటుచేయాలి' అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కే తారక రామారావు, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోలీస్ గృహనిర్మాణ సంస్థ చైర్మన్ కోలేటి దామోదర్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, సీఎంవో అధికారులు, భూ రికార్డుల ప్రక్షాళన స్పెషల్ ఆఫీసర్ వాకాటి కరుణ, కలెక్టర్లు రఘునందన్‌రావు, వెంకట్రామ్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



డైట్‌సెట్ కౌన్సెలింగ్ తేదీలో స్వల్ప మార్పు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డైట్‌సెట్-2017 అడ్మిషన్ల కోసం రెండోవిడుత వెబ్ కౌన్సెలింగ్ తేదీలో స్వల్ప మార్పులు చేసినట్టు కో-కన్వీనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన ప్రకారం గురువారం వెబ్ ఆప్షన్లకు తుది గడువుకాగా దానిని శుక్రవారానికి పొడిగించారు. మెరిట్‌లిస్టు ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు సెప్టెంబర్ 4న తేదీన సీట్లు కేటాయిస్తారు. ఫీజు చెల్లింపునకు 5 తేదీ గడువుగా నిర్ణయించారు. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 7న కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

టీజీటీ మెయిన్ పరీక్షకు 78శాతం హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) మెయిన్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్‌లో మూడు కేంద్రాల్లో టీఎస్‌పీఎస్సీ మెయిన్ పరీక్ష నిర్వహించింది. మొత్తం 3,006 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 2,349 మంది (78.14శాతంతో) హాజరయ్యారు.

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. స్వీడన్‌లో జరుగుతున్న వరల్డ్ వాటర్ వీక్- 2017 సదస్సులో మిషన్ భగీరథకు 134 దేశాల నుంచి ప్రశంసలు లభించాయి. స్టాక్‌హోమ్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రం తరఫున జలమండలి ఎండీ దానకిశోర్ హాజరయ్యారు. 'వరల్డ్ బ్యాంక్ ప్యానెల్ చర్చ'లో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయల గురించి ఆయన వివరించారు. జలసంరక్షణ, నీటి సరఫరాలో ఇది మంచి పరిణామమని చర్చలో పాల్గొన్న ఇతర దేశాల నిపుణులు అభివర్ణించారు.

మెడికల్ సీట్ల భర్తీ జీవోలో క్లాజ్ నిలిపివేత

తదుపరి విచారణ 18కి వాయిదా

ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెడికల్ సీట్ల భర్తీ విషయంలో అమల్లో ఉన్న జీవో 550 క్లాజ్ 5 (2) అమలును ఉమ్మడి హైకోర్టు బుధవారం సస్పెండ్‌చేసింది. 2001లో జారీచేసిన జీవో ఆధారంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు నష్టం వాటిల్లడంతో దాఖలైన వ్యాజ్యాలపై విచారణ చేపట్టిన జస్టిస్ వీ రామసుబ్రమణియన్, జస్టిస్ టీ రజనీతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను సెప్టెంబర్ 18కి వాయిదావేసింది. ప్రతిభావంతుడైన రిజర్వ్‌డ్ క్యాటగిరీ చెందిన అభ్యర్థికి జనరల్ కోటాలో కేటాయించిన సీటు ఖాళీ అయితే మళ్లీ రిజర్వ్‌డ్ క్యాటగిరీ అభ్యర్థితోనే భర్తీ చేయాలంటూ 2001లో అప్పటి ప్రభుత్వం జీవో 550 క్లాజ్ 5 (2)లో పేర్కొన్నది. దీనిని నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నిబంధనతో తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు సీట్లు వస్తున్నాయంటూ నివేదించారు. ఈ వాదనలను పరిగణనలోనికి తీసుకున్న ధర్మాసనం యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రమేశ్‌రామ్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం జారీచేసిన తీర్పును పరిగణనలోనికి తీసుకొని మెడికల్ సీట్ల భర్తీ విషయంలో అమల్లో ఉన్న జీవో 550 క్లాజ్ 5(2)ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. నీట్-2017 కన్వీనర్‌కు నోటీసులు జారీచేసింది.



ముహూర్తం

సూర్యోదయం: 6.06 గంటలకు

సూర్యాస్తమయం: 6.27 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, శుక్లపక్షం, నవమి తె. 5.20 వరకు. తదుపరి దశమి. నక్షత్రం: జ్యేష్ఠ తె. 1.55 వరకు తదుపరి మూల. అమృత ఘడియలు: రాత్రి 9.38 నుంచి 11.14 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.49 నుంచి 3.21 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.09 నుంచి 4.48 వరకు, వర్జ్యం: ఉదయం 10.52 నుంచి 12.28 వరకు.

లోకం పోకడ



వీపు చింతపండు అయిపోతున్నది మొర్రో!



మెదక్ జిల్లా సింగూర్ వద్ద మిషన్ భగీరథ పథకం పనులను పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ ఇంజినీరింగ్ అధికారుల బృందం

మిషన్ భగీరథ ఫలితాలు వెలకట్టలేనివి

సురక్షిత తాగునీటితో ఆరోగ్యకర సమాజం

పనులను పరిశీలించిన మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలందరికీ సురక్షిత తాగునీటిని అందించడం వల్ల కలిగే ప్రయోజనాలు వెలకట్టలేనివని మధ్యప్రదేశ్ తాగునీటి శాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఆరోగ్యకరమైన నీటిని అందించడం ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. మధ్యప్రదేశ్ ఇంజినీరింగ్ అధికారుల బృందం మెదక్-సింగూరు సెగ్మెంట్‌లోని మిషన్ భగీరథ పనులను బుధవారం పరిశీలించింది. ఒక ప్రభుత్వ పథకం పనులు ఇంతవేగంగా పూర్తవడాన్ని చూడటం ఇదే తొలిసారని మధ్యప్రదేశ్ అధకారులు కితాబిచ్చారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను ఈ బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన మధ్యప్రదేశ్ అధికారులు మెదక్ జిల్లా పెద్దారెడ్డిపేట వద్ద నిర్మిస్తున్న ఇంటేక్‌వెల్, హెడ్‌వర్క్స్ పనులను, సంగారెడ్డి జిల్లా బుస్సారెడ్డిపేట దగ్గర నిర్మిస్తున్న ఇంటేక్‌వెల్, ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. అత్యంత నాణ్యతతో పనులు చేపడుతున్నారని మధ్యప్రదేశ్ జల నిగమ్ మర్యాదిత్ చీఫ్ జనరల్ మేనేజర్ ఏకే శ్రీవాత్సవ ప్రశంసించారు. షెడ్యూల్ సమయం కంటే ముందుగానే పనులు పూర్తిచేయడం అంత సులభం కాదని, తెలంగాణ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దానిని చేసి చూపించారన్నారు. తాగునీటి కోసం ఖర్చు చేసే ఒక్క రూపాయి కూడా వృథా కాదని, అందరికీ తాగునీరు అందించాలన్న తెలంగాణ సీఎం కేసీఆర్ ఆశయం గొప్పదని జనరల్ మేనేజర్ పీకే రఘువంశి పేర్కొన్నారు. త్వరలో తమ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ విజయ్‌ప్రకాశ్, మెదక్ ఈఈ సురేశ్, సంగారెడ్డి ఈఈ రఘువీర్, ఇతర అధికారులు ఉన్నారు.

చెక్‌డ్యాంలతో నీటి నిల్వకు శ్రీకారం

సీఎం కేసీఆర్ ఆదేశాలతో చకచకా పనులు

రూ.520 కోట్లతో 174 నిర్మాణాలు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వంతెనలతోపాటు చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలతో సర్కారు నీటి నిల్వకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలతో రోడ్లు భవనాలశాఖ యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టింది. రాష్ట్రంలో 174 ప్రాంతాలు చెక్‌డ్యాంల నిర్మాణాలకు అనువైనవిగా గుర్తించిన ఉన్నతస్థాయి అధ్యయన బృందం.. మహారాష్ట్రలో పర్యటించింది. చెక్‌డ్యాంలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించింది. దీంతో రూ.520.6 కోట్లతో 174 చెక్‌డ్యాంల నిర్మాణాలను చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రోడ్లుభవనాల శాఖ పనులు పూర్తిచేసింది.

చెక్‌డ్యాంల ప్రత్యేకతలు

నదులు, వాగులు వంకల వద్ద వర్షపు నీటి సంరక్షణ కోసం చెక్‌డ్యాంలను ఆనకట్టల మాదిరిగా ఉపయోగించుకోవడం సాధారణమే. వంతెనల నిర్మాణాల వద్ద చెక్ డ్యాంల ఏర్పాటు ప్రయోగమే. సీఎం కేసీఆర్ సూచనలతో రోడ్లు భవనాల శాఖ.. చెక్ డ్యాంల రూపకల్పన చేసి అమలుపరుస్తున్నది. వంతెనలకు ఎగువన నీటి నిల్వకు అనుకూలంగా ఉండే ప్రదేశాలను ఎంపిక చేసుకొని చెక్ డ్యాంలను నిర్మించింది. వంతెనలకు రెండుమీటర్ల ఎత్తులో వీటిని నిర్మించడం వల్ల నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. వీటితో భూగర్భజలాలు సైతం పెరుగుతాయి.

వంతెన నిర్మాణవ్యయంలో 15 శాతం నిధులు

చెక్ డ్యాంల నిర్మాణాలకు వంతెన నిర్మించే మొత్తం వ్యయంలో 12 నుంచి 15 శాతం నిధులను వినియోగిస్తారు. ఈ నిధులతో వంతెన నిర్మించే కాంట్రాక్టరే చెక్‌డ్యాంను నిర్మిస్తారు. వీటి కోసం అదనంగా నిధులు కేటాయించాల్సిన అవసరముండదు.

పీవీ సింధుకు సీఎం కేసీఆర్ సత్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, కోచ్ గోపిచంద్‌ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఘనంగా సత్కరించారు. బుధవారం ప్రగతిభవన్‌కు వచ్చి తాను సాధించిన రజత పతకాన్ని ఆమె సీఎం కేసీఆర్‌కు చూపించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి సింధు, కోచ్ గోపిచంద్‌లను సీఎం కేసీఆర్ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో కొద్దిలో ఓడిపోయినా మంచి ప్రతిభ కనబరిచావని పీవీ సింధును కొనియాడారు. 'బెటర్‌లక్ నెక్ట్స్ టైం. ఆల్ ద బెస్ట్' అని ఆమెను సీఎం కేసీఆర్ అభినందించారు. కార్యక్రమంలో మంత్రి కే తారకరామారావు, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ సింధుకు ప్రత్యేక బహుమతులు
మంత్రి కేటీఆర్ ట్వీట్

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో రజత పతకం సాధించిన పీవీ సింధుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక బహుమతులు అందించారని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో తెలిపారు. కరీంనగర్ నుంచి తెప్పించిన వెండి మెమెంటో, చేనేత శాలువా, పోచంపల్లి చీరెలను బహుమతులుగా పీవీ సింధు, కోచ్ గోపిచంద్‌కు అందజేసినట్టు పేర్కొన్నారు.



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన క్రీడాకారిణి పీవీ సింధు, కోచ్ గోపీచంద్‌ను బుధవారం ప్రగతిభవన్‌లో సత్కరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి కే తారకరామారావు, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, సింధు తండ్రి రమణ కూడా ఉన్నారు.



బుధవారం తెలంగాణ భవన్‌లో దేవనార్ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబాగౌడ్‌కు రూ.6 లక్షల చెక్కును అందజేస్తున్న టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్. చిత్రంలో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి, టీఆర్‌ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డి

దేవనార్ అంధుల పాఠశాలకు ఆర్థికసాయం
రూ.6 లక్షల చెక్కును అందజేసిన టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వికలాంగులకు సాయమందించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి కోరారు. టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఏ సాయిబాబాకు టీ న్యూస్ కార్యాలయంలో రూ.6 లక్షల చెక్కును అందజేశారు. రెండున్నర దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న సాయిబాబాను సంతోష్‌కుమార్ అభినందించారు. భవిష్యత్‌లో అన్ని రకాలుగా సాయమందిస్తామని భరోసా ఇచ్చారు. జూలై 24న మంత్రి కే తారకరామారావు జన్మదిన దినోత్సవాన్ని బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారని, ఆ సందర్భంగా విద్యార్థుల పరిస్థితిని చూసిన ఎంపీ బాల్క సుమన్, టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి రూ.6 లక్షల ఆర్థికసాయం ప్రకటించారని వాసుదేవరెడ్డి చెప్పారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును పాఠశాల వ్యవస్థాపకుడు సాయిబాబాకు అందజేశారని తెలిపారు.

మరో మూడురోజులు ఓ మోస్తరు వానలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా కొద్దిరోజులుగా కురుస్తున్న వానలు కొంత తగ్గుముఖం పట్టాయి. గురువారం నుంచి మూడురోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, భారీ వర్ష సూచనలేవీ లేవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా గుజరాత్ వైపు కదులుతున్నందున తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టినట్టు పేర్కొన్నారు. విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటలవరకు రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా చంద్రుగొండలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సత్తుపల్లి, ఖమ్మం అర్బన్, తిమ్మాజిపేటల్లో 4 సెం.మీ.చొప్పున, భద్రాచలం, ముల్కలపల్లి, కొణిజెర్ల, గార్ల, డోర్నకల్, ఘనపురంలలో 3 సెం.మీ. చొప్పున వాన పడింది.



బుధవారం నిజామాబాద్‌లోని నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్ లో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత. చిత్రంలో ఎమ్మెల్సీలు డీ రాజేశ్వర్‌రావు, వీజీ గౌడ్, ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, నగర మేయర్ ఆకుల సుజాత తదితరులు కూడా ఉన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఇందూరు అగ్రగామే లక్ష్యం

ఖమ్మంలో మాదిరిగా నిజామాబాద్‌లోనూ ఐటీ టవర్
జక్రాన్‌పల్లిలో డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి
నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో నిజామాబాద్ జిల్లాను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపడమే తన లక్ష్యమని, ఇందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కమలాపూర్, నిజామాబాద్ మండలం సిర్పూర్, మోపాల్‌తోపాటు నగరంలో బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, పలు కార్యక్రమాలకు ఎంపీ కవిత హాజరయ్యారు. నిజామాబాద్ నగరంలోని నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో నిర్వహించిన నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్, నీలకంఠేశ్వరాలయ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హైదరాబాద్‌కే పరిమితమైన పారిశ్రామికాభివృద్ధిని జిల్లాలకూ విస్తరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఇప్పటికే వరంగల్‌లో రెండు వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి సంకల్పించారని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీటి కొరత లేకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. పరిశ్రమలకు 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గతంలో కరెంటు కోతలకు నిరసనగా ఇందిరాపార్కు వద్ద ధర్నాలు జరిగేవన్నారు. పక్కా ప్రణాళికతో సీఎం కేసీఆర్ విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారన్నారు. ఇప్పుడు రెప్పపాటు కూడా కరెంటు పోయే పరిస్థితి లేదన్నారు. మిషన్ భగీరథ పనులు శరవేగంగా సాగుతున్నాయని, డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీటిని అందిస్తామని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సకల సౌకర్యాలు సమకూర్చుతున్నట్టు చెప్పారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు 24 గంటల వ్యవధిలో సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి, ఇక్కడి నుంచి రాజధాని హైదరాబాద్‌కు, పొరుగు రాష్ట్రాలకు రోడ్డు సౌకర్యం బాగుందన్నారు. ఖమ్మంలో రూ.25 కోట్లతో ఐటీ టవర్ నిర్మిస్తున్నారని, అలాంటిదే నిజామాబాద్‌లోనూ ఏర్పాటు చేస్తామని ఎంపీ కవిత ప్రకటించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఐటీ రంగ నిపుణులు ఎంవోయూ కుదుర్చుకునేందుకు ముందుకు రావాలని, తద్వారా ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని అన్నారు. వ్యవసాయాధారిత జిల్లా అయిన నిజామాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని అభివృద్ధి చేయాలనే ఆలోచన చేసి, లక్కంపల్లిలో పెండింగ్‌లో ఉన్న సెజ్ పనులకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి హరిసిమ్రత్ కౌర్ బాదల్ చేత ప్రారంభించినట్టు చెప్పారు. ఇక్కడి సెజ్‌లో దాదాపు రూ.100 కోట్లతో పతంజలి యూనిట్ ఏర్పాటుకు ఆ సంస్థ సీఈవో బాలకృష్ణ ముందుకు వచ్చారన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం మద్దతు కూడగడుతున్నామని, ఇందులో భాగంగానే ప్రధానిని కలిసినట్టు తెలిపారు. స్పైస్ పార్క్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 42 ఎకరాలు సేకరించిందని చెప్పారు. ఎయిర్‌పోర్టు కోసం నిజామాబాద్ రూరల్‌లో 800 ఎకరాలు గతంలో సేకరించగా, అది ఎయిర్‌పోర్టుకు అనువుగా లేనందున, సదరు భూమిలో డ్రైపోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు డీ రాజేశ్వర్‌రావు, వీజీ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నగర మేయర్ ఆకుల సుజాత, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ మండలం సిర్పూర్‌లో గ్రామస్థులతో సెల్ఫీ దిగుతున్న ఎంపీ కవిత

ఎక్సైజ్ స్టేషన్లకు కంటింజెన్సీ నిధులు
ఏ, బీ, సీ క్యాటగిరీలవారీగా నిధుల విడుదల
త్వరలో సొంత భవనాలు, కొత్తవాహనాలు.. సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సివిల్ పోలీస్‌స్టేషన్ల మాదిరిగానే ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు కూడా కంటింజెన్సీ నిధులను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. విధి నిర్వహణలో ఎదురువుతున్న ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ఎక్సైజ్ ఉన్నతాధికారులతో సమావేశమై నిధుల అంశంపై త్వరగా తేల్చాలని ఆదేశించారు. కాంటింజెన్సీ నిధుల కొరత వల్ల ఎక్సైజ్‌శాఖ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఎక్సైజ్‌శాఖ కాంటింజెన్సీ ఫండ్ కేవలం రూ.6 వేలు మాత్రమే ఉండగా ప్రస్తుతం దానిని గరిష్ఠంగా ఏ క్యాటగిరీ పీఎస్‌లకు రూ.60 వేలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 138 ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది.. అద్దె భవనాలు, కిరాయి వాహనాలతో కష్టాలు ఎదుర్కొనేవారు. త్వరలోనే నూతన వాహనాలు, సొంతభవనాల నిర్మాణం చేపట్టే దిశగా ప్రభుత్వం సాగుతున్నది. పరిధిని, సిబ్బందిని బట్టి ఎక్సైజ్‌స్టేషన్లను మూడు క్యాటగిరీలుగా విభజించారు. ఏ క్యాటగిరీ స్టేషన్లకు రూ.60 వేలు, బీ క్యాటగిరీ పీఎస్‌లకు రూ. 40 వేలు, సీ క్యాటగిరీ వాటికి రూ.30 వేల చొప్పున నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మతో మరోసారి భేటీ అయి తుది నివేదికను తయారుచేసే ప్రయత్నంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 138 ఆబ్కారీ పోలీస్‌స్టేషన్లకు నూతన భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రభుత్వవర్గాలు పేర్కొంటున్నాయి. నూతన వాహనాల కొనుగోలుకు కూడా ఆమోదం లభించే అవకాశాలున్నట్లు సమాచారం. 220 సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులను కూడా భర్తీచేశారు. తాజాగా కంటింజెన్సీ నిధులు ఇవ్వాలని నిర్ణయించడం, నూతన సిబ్బంది నియామకం వంటి ప్రోత్సాహకర చర్యలతో ఎక్సైజ్‌శాఖ రాబడులు అంచనాలకు మించి పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు.


ఆలయ ఉద్యోగులు, అర్చకులకు వేతన వ్యవస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాదాయశాఖ పరిధిలోని అర్చకులు, ఉద్యోగులకు వేతనవ్యవస్థ ఏర్పాటుచేసేందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి చెప్పారు. దేవాదాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బేతె రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరగుప్తా, మైసంగండి వెంకటేశ్వర్లు, అర్చక సంఘం నాయకుడు వేణుగోపాలాచారి, దేవాలయ ఉద్యోగులు, అర్చకులు బుధవారం కేవీ రమణాచారిని కలిసి సమస్యలపై చర్చించారు. దేవాదాయశాఖ సమస్యలను త్వరలో ప్రభుత్వం పరిష్కరించనున్నదని రమణాచారి పేర్కొన్నారు. ఆ తర్వాత దేవాదాయశాఖ ఉద్యోగసంఘం నాయకులు బెవరెజెస్ కార్పొరేషన్ చైర్మన్ జీ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్‌ను కలిశారు. ఈ సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టిలో ఉన్నాయని దేవీప్రసాద్ చెప్పారు. దేవాదాయశాఖ ఉద్యోగులు, అర్చకులకు వేతనాలు ఇచ్చేవిధానంపై అధ్యయనానికి ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం త్వరలో సీఎం కేసీఆర్‌కు నివేదిక అందజేయనున్నని పేర్కొన్నారు.



ఒక మతానికి చెందిన ఒకరో ఇద్దరో, ఇరువై మందో ఉగ్రవాద చర్యలకు పాల్పడినంత మాత్రాన మొత్తం మతాన్ని తప్పు పట్టకూడదు. హిందూ ఉగ్రవాదం, కాషాయ ఉగ్రవాదం అంటూ ఏదీ లేదు. ఉగ్రవాదం ఉగ్రవాదమే, దానిని ఏ మతంతో ముడిపెట్టలేము. మతం పేరిట ఉగ్రవాదానికి పాల్పడుతున్న వారు ఆ మతానికి చెడ్డపేరు తెస్తున్నారు.


రాజీవ్ మెహ్రిషి, హోంశాఖ కార్యదర్శి



న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడానికి మేం ఎంతో నిబ్బరంగా వ్యవహరించాం. మా లక్ష్యం సాధించడంలో విజయవంతం అయ్యాం. రాజీనామా చేయమంటూ ప్రతిపక్షాలు అనవచ్చు. కానీ మేం తీసుకున్న చర్యలు మాకు సంతృప్తికరంగా ఉన్నాయి. మేం సరిగానే చేశాం. ఇప్పుడు హర్యానాలో శాంతి నెలకొన్నది.


మనోహర్ లాల్ ఖట్టర్, హర్యానా ముఖ్యమంత్రి

చరిత్రలో నేడు



1987
మూవీ కెమెరాపై పేటెంట్‌ను పొందిన థామస్ ఎడిసన్.

1962
బ్రిటన్ నుంచి స్వాతంత్య్రం పొందిన ట్రినిడాడ్, టొబాగో.





1978
రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న శ్రీలంక.

ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన వెంటనే, బాధితులను ఆదుకోవడం అమెరికా ప్రజలకు పుట్టుకతో వచ్చిన అలవాటు. ఏ రాజకీయ పక్షం వారయినా, ఏ మతం వారయినా తమ విశ్వాసాలకు అతీతంగా బాధితులకు సేవ చేయడానికి ముందుకు రావడం ప్రశంసనీయం. హూస్టన్ నుంచి బాధితుల వార్తలు వచ్చిన వెంటనే అటు వరద పెరిగినట్టుగానే, డబ్బు, ఆహారం, దుస్తులు మొదలైన రూపాలలో సహాయం కూడా పెరిగిపోయింది. అయితే ఆ సహాయం బాధితులకు చేరుతున్నదా అనేది కూడా గమనించాలె.

ది న్యూయార్క్ టైమ్స్

లాలూప్రసాద్ నిర్వహించిన సభకు యాదవ్, ముస్లిం సామాజిక వర్గాలు పెద్ద ఎత్తున తరలిరావడం ఆయనకు సంతృప్తిని కలిగించి ఉంటుంది. మమతా బెనర్జీ, శరద్ యాదవ్, అఖిలేశ్ యాదవ్ వంటి నాయకులు కూడా వచ్చారు. సోనియా గాంధీ వస్తే బాగుండేది. కానీ ఆ పార్టీ తరఫున గులాం నబీ ఆజాద్ వచ్చారు. డీఎంకే, ఎన్సీపీ, జేడీఎస్, సీపీఐ ప్రతినిధులు కూడా ఈ ప్రదర్శనకు హాజరయ్యారు. అయితే ఇవన్నీ కలిసి కూడా ఎన్డీయేకు ప్రత్యామ్నాయం కాలేవు. కాంగ్రెస్ నాయకత్వ సమస్యను పరిష్కరించుకోలేదు. ప్రతిపక్షాలన్నిటికీ ఆమోదయోగ్యమైన నాయకుడూ లేడు.

ది ట్రిబ్యూన్

ప్రపంచ శాంతికి ముప్పు

ఉత్తర కొరియా దుందుడుకు చర్యలతో ప్రపంచమంతా మూడో ప్రపంచయుద్ధ భయాలు అలుముకుంటున్నాయి. కొంతకాలంగా క్షిపణి పరీక్షలతో ప్రపంచాన్ని వణికిస్తున్న ఉత్తర కొరియా తాజాగా అతి శక్తివంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. ఏకంగా 2,700 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. ఈ బాలిస్టిక్ క్షిపణిని జపాన్ భూభాగం మీదుగా ఆకాశంలో 550 కిలోమీటర్ల ఎత్తులో ప్రయో గించింది. దీంతో ఉత్తర కొరియా తన శక్తిసామర్థ్యాలను ప్రత్యర్థులైన దక్షిణ కొరియా, అమెరికాలకు చాటిచెప్పినట్లయ్యింది. ఉత్తర కొరియా తాజా చర్య లతో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన దుందుడుకు పోకడతో పొరుగుదేశాల సార్వభౌమాధికారాన్ని అపహాస్యం చేస్తున్నాడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మండిపడుతున్నాడు. అలాగే మరిన్ని ఆంక్షలకు ఉత్తరకొరియా సిద్ధంగా ఉండాలని హెచ్చరించాడు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అత్యవసర సమావేశమవ్వాలని జపాన్ అధ్యక్షుడు షింబో అబె విజ్ఞప్తి చేశాడు. ఉత్తర కొరియా దూకుడు మానాలని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జె డిమాండ్ చేస్తున్నాడు. ఇదిలా ఉంటే అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని, దానికి ఆ దేశాలే బాధ్యత వహించాలని చైనా అంటున్నది. పసిఫిక్ మహాసముద్రంలో అమెరికా యుద్ధనౌకలు, సైనిక విన్యాసాల పర్యవసానమే ఖండాంతర క్షిపణి ప్రయోగాలని ఉత్తరకొరియాను చైనా వెనకేసుకొస్తున్నది. ఏదేమైనా పెద్ద దేశాల మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వ్యక్తం చేయటం సహజమే.

తాజా ఉద్రిక్తతలకు ఉత్తరకొరియానే నిందించి లాభం లేదు. దీని వెనుక అగ్రరాజ్య ఆధిపత్య రాజకీయాల కుతంత్రం ఉన్నది. రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఉనికిలోకి వచ్చిన ఉత్తరకొరియాపై అమెరికాకు మొదటి నుంచీ కంటగింపే. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓటమి పాలవటంతో, అప్పటిదాకా జపాన్ ఆక్రమణలో ఉన్న కొరియా ఉత్తరభాగం రష్యా అజమాయిషీలోకి పోగా, దక్షిణ భాగం అమెరికా చేతుల్లోకి వెళ్లింది. దీంతో 1948నుంచి ఉత్తర కొరియా, దక్షిణ కొరియా ఉనికిలోకి వచ్చాయి. ఉత్తరకొరియా రష్యా ప్రభావంతో సోషలిస్టు ఆర్థిక విధానం అవలంబించగా, దక్షిణ కొరియా పెట్టుబడిదారీ ఆర్థికవిధానాన్ని అనుసరించింది. సోవియట్ యూనియన్ ఉనికిలో ఉన్నంత కాలం అమెరికా, రష్యా అగ్రరాజ్యాల ఆధిపత్య పోరంతా ఉత్తర, దక్షిణ కొరియాల పోరుగా సాగింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన కాలంనుంచి ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదిగిన అమెరికా ఆడిందే ఆటగా వ్యవహరించింది. దేశ దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చి ఆయా దేశాలను పాదాక్రాంతం చేసుకున్నది. ఇక మిగిలింది ఉత్తర కొరియా ఒక్కటే. పసిఫిక్ మహా సముద్రంపై అమెరికా తన ఆధిపత్యం చలాయించే వ్యూహాత్మక చర్యల్లో భాగంగా దక్షిణ కొరియాతో జతకట్టి సైనిక విన్యాసాలు చేస్తున్నది. యుద్ధనౌకలను మోహరిస్తున్నది. దీంతో తన భద్రతకే ముప్పుగా వ్యవహరిస్తున్న అమెరికా, దక్షిణ కొరియా చర్యలకు విరుగుడుగా ఉత్తరకొరియా క్షిపణి ప్రయోగాలతో సమాధానం చెబుతున్నది. ఇరాక్, లిబియా, అఫ్ఘానిస్థాన్ లాగా బలికావటానికి సిద్ధంగా లేదని చాటి చెప్పటంలో భాగంగానే ఉత్తర కొరియా తన మిలిటరీ శక్తి ప్రదర్శనకు దిగుతున్నట్లుగా కనిపిస్తున్నది. ఏదేమైనా సోవియట్ యూనియన్ పతనం తర్వాత ఇంతటి ఉద్రిక్తతలు తలెత్తడం ఇదే మొదటి సారి అని చెప్పవచ్చు.

యుద్ధమంటూ జరిగితే ఆ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఎంత తీవ్రంగా ఉంటుందో ఊహకందనిది. అణ్వాయుధాల యుగంలో అంగబలంతో ఏదో ఒక దేశాన్ని లొంగదీసుకోవాలనుకోవడం సరైంది కాదు. ఏ దేశ ప్రయోజనాలైనా సైనిక జోక్యాలతోనే నెరవేరుతాయనుకోవటం కాలం చెల్లిన భావన. ఎంతటి సమస్యలైనా చర్చల ద్వారానే, సామరస్యపూర్వకంగానే పరిష్కరించుకోవచ్చని ఇటీవలే డోక్లామ్ విషయంలో రుజువైంది. ఇదే స్ఫూర్తిగా ఉత్తర, దక్షిణ కొరియాలు ముఖ్యంగా అమెరికా గుర్తిస్తే మంచిది. అమెరికా, చైనా పరస్పరం రెచ్చగొట్టే పనులకు దిగకుండా ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి చేసి ఒప్పించాలి. దీంతో ఉత్తర కొరియా సమస్య కూడా సమసిపోతుంది.

తొంభయవ దశకం నుంచి ఎదురన్నదే లేదన్నట్లుగా వ్యవహరించినా అమెరికాకు ఎక్కడా ఇంతటి ప్రతిఘటన ఎదురుకాలేదన్నది నిజం. చైనా అండతో ఉత్తర కొరియా చేస్తున్నవన్నీ అమెరికా దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో భాగమే కావచ్చు. కానీ ఎక్కడో సుదూర ప్రాంతాన జరుగుతున్న ఉద్రిక్తతలని చెప్పి భారత్‌కు ముప్పేమీ లేదని భావించటానికి లేదు. ఉత్తర కొరియాతో వర్తక, వాణిజ్యాల విషయంలో చైనా తర్వాత ద్వితీయ స్థానంలో భారత్ ఉన్నది. ఆ దేశాల మధ్య జరిగే ఘర్షణల ప్రభావం భారత దేశంపై ఉంటుంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్ కేంద్రంగా సామ్‌సంగ్, ఎల్జీలాంటి ఐటీ దిగ్గజ కంపెనీలు పనిచేస్తున్నాయి. యుద్ధమంటూ జరిగితే ఆ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఎంత తీవ్రంగా ఉంటుందో ఊహకందనిది. అణ్వాయుధాల యుగంలో అంగబలంతో ఏదో ఒక దేశాన్ని లొంగదీసుకోవాలనుకోవడం సరైంది కాదు. ఏ దేశ ప్రయోజనాలైనా సైనిక జోక్యాలతోనే నెరవేరుతాయనుకోవటం కాలం చెల్లిన భావన. ఎంతటి సమస్యలైనా చర్చలద్వారానే, సామరస్యపూర్వకంగానే పరిష్కరించుకోవచ్చని ఇటీవలే డోక్లామ్ విషయంలో రుజువైంది. ఇదే స్ఫూర్తిగా ఉత్తర, దక్షిణ కొరియాలు ముఖ్యంగా అమెరికా గుర్తిస్తే మంచిది. అమెరికా, చైనా పరస్పరం రెచ్చగొట్టే పనులకు దిగకుండా ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి చేసి ఒప్పించాలి. దీంతో ఉత్తర కొరియా సమస్య కూడా సమసిపోతుంది.

జనగళం

ప్రాజెక్టులను అడ్డుకోవద్దు

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా ఎగువ రాష్ట్రాలు కట్టిన ప్రాజెక్టుల వల్ల మన ప్రాజెక్టులకు నీళ్లు రావడం లేదు. ఒకవేళ వచ్చినా గత పాలకులు ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడం వల్ల నీళ్లన్నీ సముద్రం పాలవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా ప్రకారం నీటిని వినియోగించుకోవడానికి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసింది. కాబట్టి ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయవద్దు. ప్రభుత్వాన్ని పనిచేయకుండా ఇరుకున పెట్టాలనే దురుద్దేశంతో మొత్తం ప్రాజెక్టులనే అడ్డుకునే విధంగా వ్యవహరించడం సరికాదు.

- ఎన్. రాజేశ్, పెద్దపల్లి

అద్భుతంగా ఆడారు

శ్రీలంకతో జరిగిన టెస్ట్, వన్డే సిరీస్‌లో భారత జట్టు అద్భుతంగా ఆడింది. జట్టులో యువ ఆటగాళ్లు బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించారు. అలాగే కీలకమైన మ్యాచ్‌లో ధోనీ జట్టుకు అండగా నిలబడి భారత్ సిరీస్ గెలుచుకోవడానికి దోహదపడ్డాడు. మునుముందు కూడా ఇదే ఆట తీరును ప్రదర్శించాలి. ఇంకా మిగిలిన రెండు వన్డేల్లోనూ సమిష్టిగా ఆడాలి.

- జి.రాజశేఖర్, మెదక్

మట్టిని తొలిగించాలె

నగరంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను జీహెచ్ఎంసీ అధికారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. అయితే వర్షాలకు రోడ్ల పైకి వచ్చిన మట్టిని సిబ్బంది ఎప్పటికప్పుడు తీసివేస్తున్నది. కానీ దాన్ని అక్కడి నుంచి తరలించే యంత్రాంగం వేగంగా స్పందించడం లేదు. దీంతో మళ్లీ చిన్న వానపడినా ఆ మట్టి అంతా రోడ్లపైకి చేరుతున్నది. కాబట్టి అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

- బి.వీరమల్లు, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

‘దాదా’ సీపీఎం, నిస్సహాయ సీపీఐ

తెలంగాణను ఆలస్యంగానైనా బలపరచిన సీపీఐకి ఇక్కడ కొంత సానుభూతి ఉంది. సీపీఎంకు భిన్నంగా అందులో ప్రజాస్వామికత కూడా కన్పిస్తుంది. ఈ రెండింటి ఆధారంగా సీపీఐ ఇక్కడ పెరుగుదలకు ప్రయత్నిస్తే ఫలితం ఉండేదేమో. కాని తెలంగాణపై కత్తిగట్టిన సీపీఎం అనే ‘దాదా’ పార్టీకి నిస్సహాయంగా దాసోహమని తనకు తాను నష్టం చేసుకుంటున్నది. సీపీఎంది ‘దాదా’ ధోరణి అని తక్కిన వామపక్షాలు ఎప్పటి నుంచో అంటున్నదే.

మనం రెండు విషయాలను పరిశీలించినట్లయితే ఇటువంటి స్థితి ఎందువల్ల ఏర్పడిందో అర్థమవుతుంది. సీపీఎం ఒక దాదా పార్టీగా ఎందుకు మారిందన్నది వాటిలో మొదటిది. సీపీఐ ఒక నిస్సహాయ పార్టీగా మారటం ఎందుకనేది రెండవది. ఈ రెండు పరిణామాలు తెలంగాణతో మొదలుకాలేదు, ఇక్కడికి పరిమితం కాదు. ఈ రెండింటికి అఖిల భారతస్థాయిలో కొన్ని దశాబ్దాల నేపథ్యం ఉంది. ఆ క్రమంలో సీపీఎం ఒక దాదా పార్టీగా మారింది. అందులో సైద్ధాంతికత కొంత ఉంది. భౌగోళికత కొంత ఉంది. తెచ్చిపెట్టుకున్న తనం కొంతఉంది. ఈ మూడింటికి ఇతర వామపక్షాల లోటుపాట్లు ఉపకరించాయి. వీటన్నింటికి రేఖామాత్రంగానైనా అర్థం చేసుకుంటే గాని సీపీఎం ‘దాదా’ పార్టీగా ఎందుకు మారిందో గ్రహించలేం. ఇదే పద్ధతిలో సీపీఐ కూడా సైద్ధాంతిక, భౌగోళిక, పార్టీ వ్యవహరణా కారణాల వల్ల దశాబ్దాలుగా బలహీనపడింది. ఆ క్రమంలో సీపీఎంకు దాసోహమనటం ఒక అనివార్యతగా మారింది. సీపీఎంను కాదని తెలంగాణ కోరికను బలపరుచటం వంటి కొద్ది సందర్భాలను మినహాయిస్తే, దాసోహత్వం తమకిక అనివార్యమనే నిస్సహాయతకు సీపీఐ నాయకత్వం లోనైపోయిందా అనే సందేహం కలుగుతుంది. ఇదే తీరు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీపీఐ నాయకత్వం తీసుకుంటున్న వైఖరిలో కన్పిస్తున్నది.

ప్రత్యేక రాష్ట్రం విషయంలో సీపీఎంతో విభేదించినట్లే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సీపీఎం వారి కత్తిగట్టుడు వైఖరితో సీపీఐ ఎందువల్ల విభేదించలేకపోయింది? తమ చారిత్రకమైన దాసోహత్వం తిరిగి ముందుకు వచ్చినందు వల్లనా? లేక సీపీఎం వైఖరి సరైనదని నిజంగానే నమ్మినందుకా? లేక రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో గల రాజకీయ పరిస్థితులలో వారికి మార్గాంతరం తోచకనా? కమ్యూనిస్టులలో మంచి పద్ధతి ఒకటుంది. అంతిమంగా ఏ నిర్ణయం తీసుకున్నా, ఒక్కోసారి అతి పెద్ద నాయకులు కిందివారిపై రుద్దేది అయినా, విషయాలపై కూలంకషంగా చర్చ మాత్రం జరుగుతుంది. సీపీఎం వంటి స్టాలినిస్టు పార్టీలలో ఇది కొంత తక్కువైనా. ఆ విధంగా తెలంగాణ సీపీఐకి సంబంధించి పైన ప్రస్తావించిన తరహా ప్రశ్నలపై అంతర్గత చర్చలు ఏమైనా జరిగినదీ లేనిదీ మనకు తెలియదు. అదెట్లున్నా, అటువంటి చర్చ జరిగి కింది కార్యకర్తలకు కూడా అటువంటి ప్రశ్నలపై తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించినట్లయితే అది ఆ పార్టీకి ఉపయోగకరం కావచ్చు. దానిని బట్టి నిర్ణయాలు తీసుకుంటారా లేదా అనేది వేరే విషయం. నిర్ణయాలు ఇంకా అనేక పరిగణనలపైన ఆధారపడి ఉంటాయి. కాని అటువంటి చర్చ వల్ల కనీసం కార్యకర్తల ఆలోచనలు తెలుస్తాయి.

సీపీఎం ఒక దాదా పార్టీగా ఎందుకు మారిందో ఇప్పుడు చూద్దాం. సిద్ధాంతం ఏదైనా, విషయం ఏదైనా సర్వసాధారణంగా ఎవరు రాడికల్ వైఖరి తీసుకుంటే వారిది పైచేయి అవుతుంటుంది. దీనిపై చర్చలోకంటూ వెళ్లనక్కర లేదు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు సీపీఎంది, తిరిగి ఆ పార్టీ చీలినప్పుడు నక్సలైట్లది పై చేయి అయిన పరిస్థితులను గుర్తుచేసుకుంటే ఇది తెలుస్తుంది. నక్సలైట్లు అనేక గ్రూపులు కాగా వారిలో మావోయిస్టు పార్టీది పై చేయి అయింది. పార్లమెంటరీ కమ్యూనిస్టులకు సంబంధించి సీపీఎం ఒక దాదా పార్టీగా మారటానికి ఆరంభం ఆ విధంగా జరిగింది. ఆ తర్వాత కూడా వారు సీపీఐకి భిన్నంగా కాంగ్రెస్‌ను తీవ్రంగా వ్యతిరేకించటం, తాము ‘బూర్జువా’ పార్టీలు అనే కాంగ్రెసేతర మధ్యేమార్గ పార్టీలతోనూ దూరం పాటించటం బెంగాల్ తదితర రాష్ట్రాలలోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో, ఇతర ఫ్రంట్ సంస్థల ద్వారా మిలిటెంట్ ఉద్యమాలు సాగించటం మొదలైన కారణాలు దానినొక దాదా పార్టీగా మార్చాయి. లెఫ్ట్ నాయకత్వాన ఏర్పడే డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వాలతో తప్ప, డెమోక్రటిక్ పార్టీలు ఏర్పాటు చేసే ఫ్రంట్లకు మద్దతు ఇవ్వటం మినహా ఆ ప్రభుత్వాలలో చేరబోమని, వాటిలో అగ్రస్థానం లభించినా అంగీకరించబోమని (జ్యోతిబసు ఉదంతం) ప్రకటించటం వంటివి ఇందుకు దోహదం చేశాయి.

సీపీఎంను దాదా పార్టీగా మార్చిన అంశాలలో ఈ విధమైన సైద్ధాంతికమైనవి, వ్యవహరణా పరమనవి ప్రధానం కాగా, భౌగోళికమైనది రెండవది. ఆ పార్టీలో బెంగాల్ గ్రూపు అసలైన దాదా. బెంగాలీలే గల త్రిపుర గ్రూపు దానికి పొడిగింపు. సీపీఎం కేరళలోనూ బలంగానే ఉన్నా, రెండు వర్గాల మధ్య పై చేయి ఎల్లప్పుడూ బెంగాలీ దాదాలదే. ఇక ఇక్కడ జాగ్రత్తగా గమనించవలసిన విషయం ఒకటుంది. సీపీఎంకు బెంగాలీ పార్టీ అని, బెంగాలీ భద్రలోక్ పార్టీ అని రెండు మారు పేర్లున్నాయి. వీటిలో భద్రలోక్ అన్నది కీలకమైన పదం. బెంగాల్ ప్రాంతం భారతదేశంలో బ్రిటిష్ వలస పాలనా కాలంలో సంస్కరణవాదానికి ఆధునికతకు, జాతీయవాదానికి మొదటి అడుగులు వేసింది. అట్లా అడుగులు వేసిన భూస్వామ్య వర్గాలు, ఉన్నత తరగతులవారు, విద్యావంతులు, మేధావులు, వీరినుంచి వచ్చిన సామాజిక సంస్కర్తలు, సాహిత్యపరులు, కళాకారులు భద్రలోక్‌గా మారారు. వీరిలో అప్పటి పరిస్థితులలో మతవాదం, జాతీయవాదం ప్రవేశించాయి. సెక్యులర్ జాతీయవాద ధోరణి కూడా మరొకవైపు సమాంతరంగా వ్యాపించింది. వీరందరి నుంచి బెంగాలీ విప్లవకారుల వర్గాలు తయారయ్యాయి. ఈ విషయాన్ని కూడా పొడిగించకుండా చెప్పుకోవలసింది ఏమంటే, ఇటువంటి భద్రలోక్ తరగతికి, రాడికలిజం లేదా దాదాతనానికి, బెంగాల్ వారసత్వం సీపీఎంకు వచ్చింది. కావటానికి కమ్యూనిస్టులే అయినా, ఈ విధమైన ‘బెంగాలీ-భద్రలోక్-దాదా’ మూసలో తయారైన పార్టీ ఇది. ఆ విధంగా వారిది భద్రలోక్ మార్క్సిజం అయింది. తమ ఆధిపత్యం సాగాలంటే, తెచ్చిపెట్టుకుని చూపే దాదాతనం కొంత కూడా ఎవరికైనా అవసరమే గనుక అటువంటి వీధి దాదా లక్షణాలూ వచ్చాయి.

బెంగాల్‌లోని వామపక్ష ఐక్య సంఘటనలో సీపీఎం ఒక ‘బిగ్ బ్రదర్’ వలె వ్యవహరిస్తున్నదని తక్కిన వామపక్షాలు ఎన్నిసార్లు బహిరంగ విమర్శలు చేశాయో లెక్కలేదు. వారు ఆ మాట అన్నప్పుడల్లా ఏ విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటూ అన్నారో పరిశీలించినట్లయితే, సీపీఎం దాదాగిరీ ఎటువంటిదో స్పష్టంగా అర్థమవుతుంది. ఉమ్మడి రాజకీయ వ్యవహరణ విషయంలో, ఐక్య సంఘటన ప్రభుత్వ పరిపాలన విషయంలో కూడా బెంగాల్ సీపీఎం నాయకత్వపు ఏకపక్ష ధోరణికి, దాదాగిరీకి, తక్కిన వామపక్షాలకు తాము చెప్పింది చేయటం తప్ప దిక్కులేదని అహంకరించటానికి ఎన్ని ఉదాహరణలైనా ఉన్నాయి. అయితే, సీపీఎం తీరు పట్ల అవమానంతో ఎంత బాధపడినా, వారు ‘బిగ్ బ్రదర్’ వలె వ్యవహరిస్తున్నారని ఆక్షేపించటం మినహా మరేమీ చేయలేని స్థితిలో సీపీఐ, ఇతర వామపక్షాలు ఉండిపోయాయి. అందుకు ఒక ప్రధాన కారణం ‘వామపక్ష ఐక్యత’ను నిలబెట్టుకోవాలనే భావన. రెండవది, ‘బిగ్ బ్రదర్’ను భరిస్తే తప్ప రెండో-నాలుగో సీట్లు దక్కవన్న భయం. సీపీఎం ప్రాబల్యం లేని ఇతర రాష్ట్రాలలో సీపీఐ వారు ఆ భయం నుంచి విముక్తి చెంది, సీపీఎం ఒకరితో పొత్తు పెట్టుకోగా తాము మరొకరితో పెట్టుకోవటాన్ని బట్టి, బెంగాల్‌లో సీపీఎం దాదాగిరీతో తాము ఎంత విసుగెత్తారో, వామపక్ష ఐక్యత అన్నది తమను సీపీఎం గెలిపించగల రాష్ట్రాలకే ఎట్లా పరిమితమో అర్థమవుతుంది.

ఉభయ కమ్యూనిస్టుల విలీనానికి సీపీఐ తహతహలాడుతుండగా, సీపీఎం నాయకత్వం చూపుతున్న ధోరణిని బట్టి అర్థమయ్యేదేమిటి? కనుక, తమ అవగాహన మేరకు తాము స్వతంత్రంగా వ్యవహరిస్తూ బలపడటం వామపక్ష ఐక్యతకు కూడా దోహదం చేయగలదు తప్ప, దాదాగిరీని నిస్సహాయంగా ఆమోదించటం వల్ల కాదు. తెలంగాణ విషయానికి వస్తే, కత్తిగట్టిన సీపీ ఎం చర్యల వల్ల సీపీఐ ఎందుకు నష్టపోవాలి? సీట్ల కోసం బెంగాల్‌కు బయట స్వతంత్రించి పొత్తుపెట్టుకునేవారు, తాము బలపరిచిన తెలంగాణ కోసం స్వతంత్రించలేరా?

ముఖ్యంగా సీపీఐ వారు గుర్తించవలసినవి కొన్నున్నాయి. వామపక్షాలకు కమ్యూనిస్టు ఐక్యత ఎంత ముఖ్యమో, స్వంత అవగాహన ప్రకారం సొంత నిర్ణయాలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. (కనుకనే సీపీఐ స్వతంత్రించి తెలంగాణను బలపరిచింది.) అట్లా జరిగిన సందర్భాలు ఉన్నాయి కూడా. పోతే, వామపక్ష ఐక్యత పేరిట దాదా పార్టీ నియంతృత్వాన్ని శిరసావహించటం తమకు, తాము ఉద్ధరిస్తామనే సమాజానికి కూడా నష్టం జరుగవచ్చు ఒక్కోసారి. అందువల్ల విచక్షణాయుత నిర్ణయాలు చేయాలి. వామపక్ష ఐక్యతను భంగపరచుకోవటం సులభం కాదన్నది నిజమే. అదే సమయంలో ఆ పేరిట స్వతంత్రాన్ని కోల్పోయి అణిగి ఉండటం కూడా సరికాదు. ఉభయ కమ్యూనిస్టుల విలీనానికి సీపీఐ తహతహలాడుతుండగా, సీపీఎం నాయకత్వం చూపుతున్న ధోరణిని బట్టి అర్థమయ్యేదేమిటి? కనుక, తమ అవగాహన మేరకు తాము స్వతంత్రంగా వ్యవహరిస్తూ బలపడటం వామపక్ష ఐక్యతకు కూడా దోహదం చేయగలదు తప్ప, దాదాగిరీని నిస్సహాయంగా ఆమోదించటం వల్ల కాదు. తెలంగాణ విషయానికి వస్తే, కత్తిగట్టిన సీపీఎం చర్యల వల్ల సీపీఐ ఎందుకు నష్టపోవాలి? సీట్ల కోసం బెంగాల్‌కు బయట స్వతంత్రించి పొత్తుపెట్టుకునేవారు, తాము బలపరిచిన తెలంగాణ కోసం స్వతంత్రించలేరా?

చెరువుల పరిరక్షణపై దృష్టి

తెలంగాణం



తోట నాగరాజు

‘గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి’ అన్న మహాత్మాగాంధీ మాటలను పరిశీలిస్తే గ్రామాలు అభివృద్ధి చెందకుండా రాష్ట్రాలు గాని, దేశం గాని అభివృద్ధి చెందలేవని అర్థమవుతుంది. గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా ద్వితీయ లేదా తృతీయరంగం ద్వారా దేశం వృద్ధిని సాధించినా అది అత్యధిక అసమానతలతో కూడి ఉంటుంది. కాబట్టి అటువంటి అభివృద్ధిని ఎవ్వరూ స్వాగతించరు. కాబట్టి గ్రామాభివృద్ధి అనేది భారతదేశ సమగ్రాభివృద్ధికి తప్పనిసరి.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయాభివృద్ధికి చొరవ తీసుకున్న పథకాల్లో మిషన్ కాకతీయ ఒక బృహత్తర కార్యక్రమం. వ్యవసాయరంగం ఇప్పటికీ రుతుపవనాల మీదే ఆధారపడి ఉన్నది. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం తెలంగాణ గ్రామీణ వ్యవసాయాభివృద్ధికి ఒక సంజీవని లాంటిది. అయితే చెరువుల ద్వారా గ్రామీణ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుచడం అనేది కొత్తదేమీ కాదు. ఇది కాకతీయుల కాలంనాటి నుంచే ప్రసిద్ధి చెందింది. అయితే స్వాతంత్ర్యానంతరం వచ్చిన పాలకుల నిర్లక్ష్యం వల్ల వేలాది చెరువులు రూపురేఖలనే కోల్పోయాయి. వందలు, వేల చెరువులు దురాక్రమణకు గురై తమ ఉనికిని కూడా కోల్పోయాయి. కాబట్టి చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంతో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధిని త్వరితగతిన సాధించేందుకు వీలుపడుతుంది.

తెలంగాణ 31జిల్లాలతో 115 లక్షల హెక్టార్ల పరిధిలో విస్తరించి ఉన్నప్పటికీ నికరంగా 49 లక్షల హెక్టార్ల భూమి మాత్రమే సాగుచేయబడుతున్నది. ఇప్పటికీ 56 శాతం ప్రజలు వ్యవసాయరంగం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. 2014-15 వానాకాలం వ్యవసాయ గణాంకాల ప్రకారం మొత్తం సాగుభూమిలో 82 శాతం బోరు బావుల కింద, 10 శాతం సాగు నీటి కాలువల కింద, 5.6 శాతం చెరువుల కింద సాగుచేయబడుతున్నది. రాష్ట్ర వ్యవసాయరంగం అధిక మొత్తంలో భూగర్భ, జల వనరుల మీదే ఆధారపడి ఉన్నది. దీనివల్ల కాలక్రమేణా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో వ్యవసాయరంగంతో పాటు తాగునీటి కష్టాలు పెరుగడం కన్పిస్తున్నది. కాబట్టి భూగర్భ జలవనరుల లభ్యతను పెంచాలి. సాగునీటి కాలువల ద్వారా భూగర్భ జలాలు పెంచుకునే వీలున్నప్పటికీ తెలంగాణలో నిరంతరం ప్రవహించే నదులు లేకపోవటంతో అది సాధ్యపడదు. అలాగే గడిచిన రెండు దశాబ్దాలను పరిగణనలోకి తీసుకున్నట్లయితే సగటు వర్షపాతాల్లో చాలా హెచ్చుతగ్గులున్నాయి. కాబట్టి ప్రాంతీయంగానే కురిసే వర్షాలతో నీటిని నిల్వ చేయాలి. కాబట్టి చెరువుల పునరుద్ధరణ రాష్ట్ర గ్రామీణ వ్యవసాయాభివృద్ధికి తప్పసరైనది.



కొద్దిపాటి వర్షాలతోటే చెరువులు నిండుతాయి. వాటిలో చేపలను, రొయ్యలను పెంచడం ద్వారా దాదాపు 3.07 లక్షల మంది మత్స్య కార్మికులకు ప్రత్యక్షంగా ఉపాధి దొరుకుతుంది. 3.20 లక్షల టన్నుల చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేయడం ద్వారా వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని సృష్టించవచ్చు. అలాగే చెరువుల్లోని నీటితో చెరువు కింద, చుట్టుపక్కల బోరుబావుల్లో వేసవిలో కూడా నీటి లభ్యత ఉంటుంది.

అలాగే చెరువుల్లో పేరుకుపోయిన ఒండ్రు మట్టిని పంట పొలాలకు ఎరువుగా వాడితే దిగుబడి పెరుగడమే కాకుండా సాగువ్యయం కూడా తగ్గుతుంది. చెరువుల్లో నీరుండటం వల్ల పశుగ్రాసం, తాగునీరు లభ్యమవుతుంది. పశు సంపదను పెంచడం ద్వారా రైతులు, రైతు కూలీలు తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చు.

చెరువుల పునరుద్ధరణ జరుగుతున్నప్పటికీ ఎక్కడా కూడా వాటి పరిరక్షణ, నిర్వహణ గురించి పెద్దగా చర్చించిన దాఖలాలు లేవు. గత అనుభవాల దృష్ట్యా వ్యవసాయాభివృద్ధిలో, చెరువుల పరిరక్షణ వాటి నిర్వహణ చాలా ముఖ్యమైంది. దీనికి తక్షణం ‘చెరువుల పరిరక్షణ సమితి’ ఏర్పాటు చేయాలి. చెరువుల పరిరక్షణ సమితిలో మండల న్యాయాధికారి లేదా తహశీల్దార్ అధ్యక్షుడిగా, రైతుల తరఫున ఇద్దరు సభ్యులు (ఒకరు చెరువుకు అతి సమీపంలో ఉన్న రైతుల తరఫున మరొకరిని దూరంగా ఉన్న రైతుల తరఫున), మత్స్య కార్మికుల తరఫున ఒక సభ్యుడు, అలాగే గ్రామ సర్పంచిని (గ్రామ ప్రథమ పౌరునిగా, గ్రామప్రజల తాగునీటి సలహాదారుడిగా) నియమిస్తే సమస్యలను సామరస్యపూర్వకంగా అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించుకునే వీలుంటుంది. అలాగే ఈ సమితికి చెరువు నిర్వహణ బాధ్యతలను కూడా అప్పగించాలి. తద్వారా చెరువుల వల్ల కలిగే ప్రతిఫలాలను భవిష్యత్తు తరాలకు అందించవచ్చు.

మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించబడుతున్న చెరువుల సంరక్షణకు గ్రామమే పూనుకోవాలి. దీనికిగాను సబ్బండవర్గాలు ఏక తాటిపై నడువాలి. జలసిరులను పంచే చెరువులకు జలకళ తేవాలి. ఈ విధంగా రాష్ట్రంలో త్వరితగతిన గ్రామీణాభివృద్ధి సాధించడమే కాకుండా అసమానతలు లేని సర్వతోముఖాభివృద్ధిని కలిగిన బంగారు తెలంగాణను అతి తొందరలోనే చూడవచ్చు.

బంగారు తెలంగాణ సాధనకు ప్రభుత్వం ఇంకా అనేక రంగాలను అభివృద్ధి పరుచాలి. భవిష్యత్తులో చెరువుల నిర్వహణకు కావాల్సిన ఆర్థిక వనరుల కోసం పూర్తిగా ప్రభు త్వం మీదనే ఆధారపడటం సరికాదు. చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చెరువు అభివృద్ధి నిధులను సృష్టించుకోవాలి. ఇందుకుగాను ప్రభు త్వం చొరవ తీసుకొని కొంత మూలధనాన్ని చేకూర్చాలి.

మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించబడుతున్న చెరువుల సంరక్షణకు గ్రామమే పూనుకోవాలి. దీనికి గాను సబ్బండ వర్గాలు ఏక తాటిపై నడువాలి. జలసిరులను పంచే చెరువులకు జలకళ తేవాలి. ఈ విధంగా రాష్ట్రంలో త్వరితగతిన గ్రామీణాభివృద్ధి సాధించడమే కాకుండా అసమానతలు లేని సర్వతోముఖాభివృద్ధిని కలిగిన బంగారు తెలంగాణను అతి తొందరలోనే చూడవచ్చు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆపరేషన్ థియేటర్లో వైద్యుల కొట్లాట

- శస్త్రచికిత్స చేస్తూ తిట్టుకున్న వైద్యులు
- గర్భిణికి కడుపుకోత.. శిశువు మృతి
- జోధ్‌పూర్‌లో దారుణం



ఆపరేషన్ థియేటర్‌లో గొడవపడుతున్న వైద్యులు

జోధ్‌పూర్, ఆగస్టు 30: గర్భిణికి శస్త్రచికిత్స చేస్తూ ఆపరేషన్ థియేటర్లో ఇద్దరు వైద్యులు గొడవకు దిగారు. ఒకరినొకరు తిట్టుకున్నారు. ఫలితంగా పసిబిడ్డ పుట్టీపుట్టగానే కన్ను మూసింది. ఈ ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. డాక్టర్ల కొట్లాటకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జోధ్‌పూర్‌లోని ఉమైద్ దవాఖానలో మంగళవారం ఓ నిండు గర్భిణి ప్రసవం కోసం వచ్చింది. అప్పటికే కడుపులోని బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గుండె సరిగా కొట్టుకోకపోవడంతో సర్జన్లు అశోక్ నైన్వాల్, ఎంఎల్ తక్.. ఆమెకు సర్జరీ చేయాలనుకున్నారు. అన్నీ సిద్ధం చేసి గర్భిణిని ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఆమె ఉదయం ఏం ఆహారం తీసుకుందన్న విషయమై ఇద్దరు వైద్యుల మధ్య గొడవ మొదలైంది. ఓవైపు గర్భిణి టేబుల్‌పై ఉండగానే, వైద్యులు వాగ్వాదానికి దిగారు. 'నీ హద్దుల్లో నువ్వు ఉండు' అని డాక్టర్ అశోక్ నైన్వాల్ అంటే, 'ఇందుకు నువ్వు తగిన మూల్యం చెల్లిస్తావ్ చూడు' అని డాక్టర్ తక్ బెదిరించారు. అక్కడే ఉన్న మరో వైద్యుడు, నర్సు వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా, వారు వినలేదు. ఇద్దరు గొడవపడుతూ.. ఆఖరికి ఆ తల్లికి కడుపుకోత మిగిల్చారు. పుట్టిన కొద్దిసేపటికే ఆ శిశువు మృతి చెందింది. ఈ దృశ్యాన్ని ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న మరో నర్సు వీడియో తీయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన నేపథ్యంలో గొడవకు దిగిన ఇద్దరు వైద్యుల్ని విధుల నుంచి తొలగించినట్టు ఉమైద్ దవాఖాన సూపరింటెండెంట్ అమిలాల్ భట్ తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిన రాజస్థాన్ హైకోర్టు వారంరోజుల్లో నివేదిక సమర్పించాలని పేర్కొన్నది. జోధ్‌పూర్ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనిపై విచారణకు ఆదేశించామని రాజస్థాన్ ఆరోగ్యశాఖ మంత్రి కాళీచరణ్ సరాఫ్ వెల్లడించారు.

వచ్చే నెలలో భూమి అంతం?!

- దూసుకొస్తున్న 'నిబిరు' గ్రహం
- కుట్ర సిద్ధాంతకర్తల జోస్యం
- గాలివార్తేనంటున్న శాస్త్రవేత్తలు



న్యూయార్క్, ఆగస్టు 30: భూమి అంతం గురించి కొన్నేండ్లు చెప్తూ వస్తున్న కుట్ర సిద్ధాంతకర్తలు (కాన్స్పిరసీ థియరిస్ట్స్) ఇప్పుడు ఆ గడియ వచ్చిందని అంటున్నారు. మరో నెలరోజుల్లో భూమి అంతం తప్పదని, నిబిరు అనే అగోచరమైన గ్రహంవచ్చి ఢీకొంటుందని హెచ్చరిస్తున్నారు. 'సెప్టెంబర్‌లో భూప్రళయం తప్పదు. ఈ లోగా తీరని కోరికలేవైనా ఉంటే తీర్చుకోండి' అని క్రిస్టియన్ న్యూమరాలజిస్ట్ పేరున్న డేవిడ్ మీడ్ సూచిస్తున్నారు. వచ్చే నెల 20-23 తేదీల మధ్య భూప్రళయం తప్పదని మీడ్ జోస్యం చెప్తున్నారు. ఈ మూడు రోజుల వ్యవధిలో నిబిరు గ్రహం ఢీకొంటుందని, దాంతో భూమి బద్దలై సమస్త జీవులు అంతరిస్తాయని ఆయన అభిప్రాయపడుతున్నారు. బైబిల్ కచటభాగాలలోనూ, గిజా పిరమిడ్ లోనూ దీనికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలున్నాయని మీడ్ తెలిపారు. సెప్టెంబర్ రెండో వారం నుంచి నిబిరు గ్రహం ఆకాశంలో ప్రపంచం మొత్తానికి కనిపిస్తుందని, ప్రజలంతా స్పష్టంగా దానిని చూడవచ్చని తెలిపారు.

ఏమిటీ నిబిరు..?

నిబిరు అనేది ఓ ఊహాజనిత గ్రహం. సౌర కుటుంబానికి అంచున ఈ గ్రహం ఉన్నట్లు భావిస్తున్నారు. దీన్ని ప్లానెట్ ఎక్స్‌గా పిలుస్తారు. 2016 జనవరిలో తొలిసారిగా నిబిరు గ్రహం గురించి చర్చ జరిగింది. ఇప్పుడు భూ కక్ష్యలోకి నిబిరు ప్రవేశించనుందని కాన్స్పిరసీ థియరిస్ట్‌లు భావిస్తున్నారు. ఈ వాదనలను శాస్త్రవేత్తలు కొట్టిపారేస్తున్నారు. నిబిరు అనే గ్రహమేదీ లేదని, అది వచ్చి ఢీకొనడమనేది గాలివార్తలేనని నాసా శాస్త్రవేత్తలు గతంలోనే తేల్చేశారు.

నేడు పీఎస్‌ఎల్‌వీ-సీ39 ప్రయోగం

- 29 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్ శాటిలైట్ ప్రయోగానికి అంతా సిద్ధం



బెంగళూరు, ఆగస్టు 30: ఇస్రో మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. గగనతల ప్రయోగాలలో ఇప్పటికే అగ్రదేశాల సరసన చేరిన భారత్ గురువారం సాయంత్రం పీఎస్‌ఎల్‌వీ-సీ39 అంతరిక్ష వాహకనౌకను ప్రయోగించనుంది. సరిగ్గా సాయంత్రం ఏడుగంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. దీనికి సంబంధించి 29 గంటల కౌంట్‌డౌన్ బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు మొదలైంది. వాతావరణం అనుకూలంగా ఉంటేనే ఇబ్బందులు తలెత్తవని మొదట భావించినప్పటికీ అనుకున్న సమయానికి రాకెట్‌ను ప్రయోగించేందుకు మిషన్ రెడీనెస్ రివ్యూకమిటీ, లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. శ్రీహరికోట లోని సతీశ్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ప్రయోగించనున్న ఈ పీఎస్‌ఎల్‌వీ సీ-39 అంతరిక్ష వాహక నౌక ద్వారా.. 1425 కిలోల బరువున్న ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. పీఎస్‌ఎల్‌వీ-సీ39 ఉపగ్రహ ప్రయోగానికి ఎక్స్‌ఎల్ తరహా ఇంజన్లను వినియోగిస్తున్నారు. ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం ఉపగ్రహ శ్రేణిలో ఇది ఎనిమిదవది. ఇప్పటికే ఏడు ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపించింది. 2013 జూలై 1న పీఎస్‌ఎల్‌వీ ద్వారా నావిగేషన్ వ్యవస్థ కోసం ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1ఏ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపారు. మూడు అణుగడియారాల్లో సాంకేతిక లోపం తలెత్తి అవి పనిచేయడం మానేయడంతో సేవలకు అవాంతరం ఏర్పడింది. దీనిస్థానంలో ప్రస్తుతం ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని పంపుతున్నారు. జీపీఎస్ తరహాలో ఇస్రో ఈ ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. సముద్ర నావలకు, ప్రకృతి విపత్తులకు, పర్వతారోహకులకు, రైల్వే, ఎయిర్‌పోర్టుకు, వాహనాల ట్రాకింగ్‌కు నావిగేషన్ సేవలను అందించనున్నాయి. తదుపరి నావిగేషన్ శాటిలైట్ ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1ఐని 2018 ఏప్రిల్‌లో ప్రయోగిస్తారు.

సైన్యంలో భారీ సంస్కరణలు

- అధికారులు సహా 57 వేల మంది పునర్నియామకం
- ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల్లో ఓబీసీ క్రీమీలేయర్ అమలు
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు



న్యూఢిల్లీ, ఆగస్టు 30: భారత సైన్యంలో భారీ సంస్కరణల అమలుకు రంగం సిద్ధమైంది. అందుబాటులో ఉన్న వనరుల సేవలను మెరుగ్గా వినియోగించుకోవాలన్న లక్ష్యంతోపాటు సైన్యాన్ని యుద్ధానికి సన్నద్ధం చేసేందుకు తొలిదశలో సుమారు 57 వేల మంది అధికారులు, ఇతర ర్యాంకుల్లో పనిచేసిన సిబ్బందిని ప్రభుత్వం పునర్నియమించనున్నది. ఇది దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సైన్యంలో చేపట్టే అతి పెద్ద సంస్కరణ అని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. బుధవారం కేంద్ర క్యాబినెట్ భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. డోక్లాంలో ఉద్రిక్తత నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్న మీడియా ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఏ ఒక్క ఘటనతో సంబంధం లేదంటూనే డోక్లాం అంశానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గతేడాది మే నెలలో రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డీబీ శేకాట్కర్ సారథ్యంలో నియమించిన కమిటీ గత డిసెంబర్‌లో నివేదిక అందజేసింది. సైన్యంలో సంస్థాగత మార్పుల కోసం 99 సిఫారసులు చేస్తే, అన్ని వర్గాలతో సంప్రదించాక 65 సిఫారసులను ఆమోదించామని కేంద్ర మంత్రి జైట్లీ తెలిపారు. ఈ సంస్కరణల ప్రక్రియ 2019 డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తిచేస్తామన్నారు. 31 వేల మంది పౌరులను నూతన ఫార్మాట్లలో నియమిస్తామని చెప్పారు.

పీఎస్‌యూ, బ్యాంకుల్లో దిగువ స్థాయి సిబ్బంది కుటుంబానికి క్రీమీలేయర్ వర్తింపు

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో జరిగే ఉద్యోగ నియామకాల్లో ఓబీసీ క్రీమీలేయర్ పరిధిని విస్తరించాలని నిర్ణయించామని జైట్లీ తెలిపారు. ఆయా వర్గాల్లో ఇప్పటికే సామాజికంగా అభివృద్ధి చెందిన వర్గాలు/ సెక్షన్లను మినహాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి 27 శాతం ఓబీసీ రిజర్వేషన్ల అమలులో క్రీమీలేయర్ విధానం అమలుకు డీవోపీటీ ఆదేశాలు జారీచేసిన 23 ఏండ్ల తర్వాత అమలులోకి వచ్చినట్లయింది. వివిధ శాఖల్లో ఏ, బీ గ్రూప్ పోస్టులకు ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల్లో సమానమైన హోదాగల అధికారుల నియామకంలో ఓబీసీ క్రీమీలేయర్ పరిధిని అమలు చేస్తారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో బోర్డు స్థాయి ఎగ్జిక్యూటివ్, మేనేజ్ పోస్టులను, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ వన్ స్కేల్ నుంచి పై స్థాయి పోస్టులను 'ఏ' గ్రూప్ పోస్టులుగా పరిగణిస్తారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల్లో దిగువశ్రేణుల్లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలకు మాత్రం ఓబీసీ రిజర్వేషన్లు వర్తిస్తాయని మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. క్రీమీలేయర్ వార్షికాదాయం పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచారు. ఇక జెబూ జాతి పశు ఉత్పత్తిపై బ్రెజిల్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పారిశ్రామిక పరిశోధన, నూతన ఆవిష్కరణల కోసం 40 మిలియన్ల డాలర్ల నిధి ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయెల్‌తో చేసుకున్న ఒప్పందాన్నీ క్యాబినెట్ ఆమోదించింది. ఆఫ్ఘనిస్థాన్, భూటాన్, మయన్మార్, గునియా, అల్బేనియా, ఈక్వెడార్ ఎన్నికల సంఘాలతో సహకారంపై కేంద్ర ఎన్నికల సంఘం ఒప్పందం చేసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

తప్పించుకునేందుకు గుర్మీత్ కుట్ర!

- కోర్టు ప్రాంగణంలోనే పోలీసు వాహనాన్ని అడ్డుకున్న డేరా గార్డులు
- భద్రతా సిబ్బందిపై దాడికి యత్నం
- పోలీసుల అప్రమత్తతో కుట్ర విఫలం



పంచ్‌కుల: లైంగిక దాడి కేసుల్లో 20 ఏండ్ల జైలు శిక్షపడిన డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాంరహీంసింగ్ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అంతకుముందే కుట్ర చేశాడు. కుట్ర అమలుకు ఆయన అనుచరులు విఫలయత్నం చేసి, అరెస్టయ్యారు. హర్యానా పోలీసులు కేసు నమోదు చేయడంతో ఈ కుట్ర సంగతి బయటపడింది. ఇద్దరు మహిళలపై లైంగిక దాడి కేసుల్లో తమ అధినేతకు వ్యతిరేకంగా వస్తే ఆయనను తప్పించాలని డేరా గార్డులు బయలు దేరారు. వారు ఊహించినట్లే గుర్మీత్‌ను కోర్టు దోషిగా తేల్చింది. గుర్మీత్‌ను ఒక స్కార్పియో కారులో ఎక్కించి, ఆయనకు రెండు పక్కలా పోలీసు అధికారులే సెక్యూరిటీగా కూర్చుని జైలుకు బయలు దేరారు. అప్పుడే కుట్ర అమలుకు గుర్మీత్ అనుచరులు ఆయనను తీసుకువెళ్తున్న సార్పియో కారు కోర్టు ప్రాంగణంలోని పోలీసు బారియర్‌ను చేరుకునే లోగా తెల్లటి ఎండేవర్ కారులో (డేరా వాహనాల్లో ఇదొకటి) అడ్డుకున్నారు. మా పితాజీ(గుర్మీత్)ని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. అడ్డుపడిన పోలీసు అధికారులపై నుంచి కారును నడిపించాలని తమ డేరా డ్రైవర్‌తో చెప్పారు. దీంతో ప్రమాదం ముంచుకొస్తున్న సంగతి గ్రహించిన పోలీసులు మరింత మంది అక్కడికి చేరుకుని డేరా గార్డులను చుట్టుముట్టి నిర్బంధించారు. పట్టుబడిన ఏడుగురు డేరా గార్డుల్లో ఐదుగురు హర్యానా పోలీసు సిబ్బంది కావడం విశేషం. డేరా గార్డుల వద్ద ఆటోమేటిక్ తుపాకులూ ఉన్నాయి. గుర్మీత్ ఇలా తప్పించుకునే కుట్ర చేశాడని హర్యానా ఐజీ కేకే రావు తెలిపారు. తనను దోషి అని జడ్జి ప్రకటించగానే గుర్మీత్ ఎర్రటి బ్యాగు తెమ్మని కోరడంతో కుట్ర అమలుకు సంకేతం ఇచ్చాడు.

గుర్మీత్ వారసుడిగా జస్మీత్ ఇన్సాన్!

- కుమారుడికి డేరా బాధ్యతలు

న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా బాధ్యతలను ఇకపై గుర్మీత్‌సింగ్ కుమారుడు జస్మీత్ ఇన్సాన్(33) నిర్వహించనున్నారు. జస్మీత్ డేరా కార్యనిర్వాహక మేనేజర్‌గా వ్యవహరిస్తారని సిర్సాలోని డేరా కేంద్రం బుధవారం ప్రకటించింది. రేప్ కేసుల్లో 20 ఏండ్ల శిక్షపడిన గుర్మీత్‌కు వారసుడిగా జస్మీత్‌ను 45 మంది సభ్యుల డేరా కోర్ కమిటీ సోమవారం ఎంపిక చేసింది. 2007లో తనపై సీబీఐ రేప్ కేసులు పెట్టినపుడే గుర్మీత్ తన వారసునిగా జస్మీత్‌ను నిర్ణయించినట్లు తెలిసింది. జస్మీత్ డేరా నిర్వహణ చూస్తారని, డేరా అధిపతిగా గుర్మీత్ సింగే కొనసాగుతారని గుర్మీత్ కోడలు హసన్ ప్రీత్ తెలిపారు. గురువారం గుర్మీత్ తల్లి, భార్య ఇతర కుటుంబీకులు జైల్లో ఉన్న గుర్మీత్‌ను కలుసుకొని జస్మీత్ నియామకానికి ఆయన ఆమోదం తీసుకుంటారని తెలిసింది. గ్రాడ్యుయేట్ అయిన 33 ఏండ్ల జస్మీత్ వ్యాపారం చేస్తున్నారు. పంజాబ్ కాంగ్రెస్ నేత హర్మిందర్ సింగ్ జస్సీ కుమార్తెను ఆయన వివాహం చేసుకున్నారు.

చిన్నారుల మృత్యుఘోష

- గోరఖ్‌పూర్‌లో 72 గంటల్లో 61 మంది మృతి
- 24 గంటల్లో 19 మంది కన్నుమూత
- ఆగస్టులో 296 మంది పిల్లలు మృతి
- వర్షాలు, వరదలతో పరిస్థితి విషమం




గోరఖ్‌పూర్ బీఆర్‌డీ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గోరఖ్‌పూర్, ఆగస్టు 30: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బాబా రాఘవ్‌దాస్ (బీఆర్డీ) వైద్యకళాశాల దవాఖానలో చిన్నారుల మృత్యుఘోష ఆగడం లేదు. గంటల వ్యవధిలో పదుల సంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. గడిచిన 72 గంటల్లో 61 మంది మరణిస్తే వారిలో అత్యధికులు నవజాత శిశువులే కావడం గమనార్హం. 24 గంటల్లో 19 మంది మృత్యువాతపడ్డారు. వారిలో నలుగురు మెదడువాపుతో, మిగతా వారు నియోనెటల్ ఐసీయూలో చికిత్స పొందుతూ మరణించారు. మూడు వారాల క్రితం ఆక్సిజన్ కొరతతోపాటు వివిధ కారణాలతో 70 మంది నవజాత శిశువులు మరణించడంతో ఈ దవాఖాన వార్తల్లో పతాక శీర్షికలకెక్కిన సంగతి తెలిసిందే. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు ప్రకటించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంత జిల్లాలు, పొరుగున ఉన్న బీహార్‌తోపాటు నేపాల్ నుంచి భారీగా చిన్నారులు ఈ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. నెలలు నిండకముందే జననం, తక్కువ బరువు, కామెర్లు, న్యూమోనియా, అంటువ్యాధులు, మెదడువాపు వ్యాధులతో పరిస్థితి మరింత విషమించిన తర్వాత తమ దవాఖానలో చేరుస్తారని బీఆర్డీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పీకే సింగ్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరదలు పోటెత్తడం వల్ల పరిస్థితి విషమించిందని మెదడువాపు వ్యాధి వార్డు డాక్టర్ ఒకరు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి సోమవారం వరకు నవజాత శిశువుల వార్డు, మెదడువాపు వార్డుల్లో కనీసం 1256 మంది బాలలు మరణించారని దవాఖాన వర్కింగ్ ప్రిన్సిపాల్ పీకే సింగ్ అన్నారు. ఈ నెలలో మొత్తం 296 మంది బాలలు మరణించారు. వారిలో 213 మంది నియో నాటల్ ఐసీయూ వార్డులో, మెదడువాపు వార్డులో 83 మంది చిన్నారులు ఉన్నారు. ఈ నెల ప్రారంభంలో 70 మందికి పైగా బాలల మృతి చెందిన కేసులో కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్‌మిశ్రా, ఆయన భార్య డాక్టర్ పూర్ణిమా శుక్లాలను మంగళవారం కాన్పూర్‌కు చెందిన యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి రాజీవ్‌మిశ్రా దంపతులతోపాటు డాక్టర్ కఫీల్‌అహ్మద్, పుష్పా సేల్స్‌కు చెందిన ఉదయ్‌ప్రతాప్ శర్మ సహా తొమ్మిది మందిపై కేసు నమోదైంది.

జీఎస్టీపై ఉన్న ఆందోళనలేవీ నిరూపితం కాలేదు

- సీఎస్‌ల వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ



వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌లతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: జీఎస్టీపై అంతకుముందు నెలకొన్న ఆందోళనలు, భయాలేవీ నిరూపితం కాలేదని, దీంతోపాటు వ్యవహారాలన్నీ సవ్యంగా సాగిపోతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారంనాటి వీడియోకాన్ఫరెన్స్‌లో పేర్కొన్నారు. జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్లను పెంచే చర్యలను వేగవంతం చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి నెలరోజుల వ్యవధిలో భారీ పెరుగుదల చూపాలని కోరారు. గత 20 ప్రగతి సమావేశాల్లో రూ.8.79 లక్షల కోట్ల విలువైన 183 ప్రాజెక్టులపై సమీక్ష జరిగిందని పేర్కొంది. బుధవారం నాటి 21వ ప్రగతి సమావేశంలో రూ.56 వేల కోట్ల విలువైన రైల్వే, రోడ్లు, విద్యుత్, ఆయల్ పైప్‌లైన్స్, ఆరోగ్య రంగాలపై సమీక్ష జరిపినట్టు వెల్లడించింది. తెలంగాణ సహా 16 రాష్ర్టాల్లో విస్తరించిన తొమ్మిది భారీ మౌలికవసతుల ప్రాజెక్టులు ఇందులో ఉన్నట్లు తెలిపింది.

డిసెంబర్ 31 వరకు ఆధార్ గడువు

సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్రసర్కారు

పథకాలతో ఆధార్ లంకెపై విచారణ నవంబర్‌కు వాయిదా



న్యూఢిల్లీ, ఆగస్టు 30: వివిధ సాంఘిక సంక్షేమ పథకాలకు ఆధార్ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. దాంతో ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు నవంబర్ మొదటివారానికి వాయిదా వేసింది. సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. గడువు సమీపిస్తున్నందున ఈ వ్యవహారాన్ని త్వరగా తేల్చాలని పిటిషనర్ల తరపు న్యాయవాది శ్యాందివాన్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ప్రభుత్వం తరపున సమాధానమిస్తూ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగిస్తామని ఇదివరకే చెప్పామని గుర్తు చేశారు. దీంతో ధర్మాసనం కేసు విచారణను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. దివాన్ తన వాదనల సందర్భంగా తొమ్మిదిమంది సభ్యుల విస్తృత ధర్మాసనంలోని న్యాయమూర్తి ఆర్‌ఎఫ్ నారిమన్ విడిగా ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ఆధార్‌కు సంబంధించిన వ్యవహారాలను ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి పంపాలని న్యాయమూర్తి నారిమన్ సూచించారని దివాన్ వివరించారు. దీనిపై అటార్నీ జనరల్ వేణుగోపాల్ స్పందిస్తూ పరిశీలనాంశం ప్రాముఖ్యత దృష్ట్యా ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి పంపాలని విజ్ఞప్తి చేశారు.

పాన్‌తో ఆధార్ లింకుపై నేడు నిర్ణయం

సంక్షేమ పథకాలకు ఆధార్ లంకె గడువును పొడిగించిన కేంద్ర ప్రభుత్వం ఆదాయపన్ను పాన్ నంబరుకు ఆధార్‌ను జోడించడంపై గురువారం నిర్ణయం తీసుకుంటుందని అధికారవర్గాలుతెలిపాయి. పథకాల తరహాలో దీనిని కూడా డిసెంబరు చివరినాటికి పొడిగించే విషయమై ఆర్థికశాఖ తన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని ఆ వర్గాలు వివరించాయి. పాన్‌కు ఆధార్ జతపరిచే గడువు కూడా గురువారమే ముగియనున్నది. ఆదాయంపన్ను చట్టంలోని 139 ఏఏ నిబంధన ప్రకారం జూలై 1 నాటికి ఆధార్ కలిగినవారందరూ తప్పనిసరిగా పాన్‌కు ఆధార్ సంఖ్యను జతచేయాలని సూచిస్తున్నది. ఆధార్ రాజ్యాంగ విరుద్ధం అని కోర్టు నిర్ణయిస్తే తప్ప అందరూ తప్పనిసరిగా ఆగస్టు 31 లోగా ఆధార్‌ను జతచేయాలని గతనెల 31న ఐటీశాఖ ప్రకటించింది.

ఎన్డీయేకు ఎంపీ రాజుశెట్టి గుడ్‌బై

పుణె, ఆగస్టు 30: బీజేపీ సారథ్యంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వైదొలుగుతున్నట్లు మహారాష్ట్రలోని స్వాభిమాని శెట్కారీ సంఘటన్ (ఎస్ఎస్ఎస్) అధినేత రాజుశెట్టి తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీల అమలులో ఎన్డీయే విఫలమైందని ఆయన బుధవారం ఆరోపించారు.పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తామన్న హామీతోనే 2014లో కేంద్రంలోని ఎన్డీయే, మహారాష్ట్రలోని మహా కూటమికి మద్దతునిచ్చామని, గత మూడేండ్లు ఆ హామీ అమలు దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

హ్యూస్టన్ విలవిల



భారీ వరదతో హ్యూస్టన్ నగరంలో మునిగిపోయిన ఒక రోడ్డు

- అమెరికాలో కొనసాగుతున్న హార్వే హరికేన్ విలయం
- 30కి చేరిన మృతుల సంఖ్య
- భారతీయ విద్యార్థి నిఖిల్ భాటియా దుర్మరణం

హ్యూస్టన్: అమెరికాలో హార్వే హరికేన్ ప్రభావం ఐదో రోజూ కొనసాగింది. టెక్సాస్, లూసియానా రాష్ర్టాలు చిగురుటాకుల్లా వణికిపోతున్నాయి. వరదలు ముంచెత్తుతుండడంతో హ్యూస్టన్ నగరం విలవిలలాడుతున్నది. వేల మంది నిర్వాసితులవుతున్నారు. మరోవైపు సహాయ చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. హరికేన్ మృతుల సంఖ్య 30కి చేరిందని, అందులో ఓ భారతీయ విద్యార్థి ఉన్నారని అధికారులు తెలిపారు. శనివారం టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్‌లోని బ్రయాన్ సరస్సులో నిఖిల్ భాటియా (24), షాలినీ సింగ్ (25) మునిగిపోతుండగా అధికారులు రక్షించి దవాఖానకు తరలించారు. నిఖిల్ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. షాలిని పరిస్థితి విషమంగా ఉన్నది. మరోవైపు బుధవారం లూసియానాలో హార్వే హరికేన్ మరోసారి తీరం దాటింది. టెక్సాస్‌లోనే అత్యధిక జనాభా కల హ్యూస్టన్ నగరం ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నది. సహాయ బృందాలు 3,500 మందిని కాపాడాయి. నేరగాళ్లు రెచ్చిపోతూ వాహనాలను దొంగిలించడంతోపాటు, దుకాణాలను లూటీ చేస్తున్నారు. దీంతో రాత్రుళ్లు కర్ఫ్యూ విధిస్తున్నట్టు హ్యూస్టన్ మేయర్ సిల్వెస్టర్ టర్నర్ ప్రకటించారు.చార్లెస్ సరస్సు ప్రమాదకర స్థాయికి చేరిందని హెచ్చరించారు. హార్వే హరికేన్ అమెరికాలోనే అత్యంత వినాశకర తుఫాన్లలో ఒకటని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ అన్నారు. టెక్సాస్‌లో వరద బాధితులను ఆదుకోవడంలో ఎన్నారైలు ముందుంటున్నారు. దాదాపు 100 మంది ఎన్నారై వలంటీర్లు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఇండో-అమెరికన్ చాంబర్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్, మద్రాస్ పోవిలియన్ రెస్టారెంట్ కలిపి 500 మందికి ఆహారం అందిస్తున్నాయి. వరదలతో హ్యూస్టన్ యూనివర్సిటీలో దాదాపు 200 మంది భారతీయ విద్యార్థులు చిక్కుకున్నారు. వారికి ఎన్నారైలు ఆహారం సరఫరా చేస్తున్నారు.

ముంబైలో వానలకు

15 మంది బలి

- వరద తగ్గుముఖం పట్టడంతో తేరుకుంటున్న జనం
- పాక్షికంగా నడిచిన సబర్బన్ రైళ్లు



ట్రాక్‌లపైకి నీళ్లు రావడంతో మధ్యలోనే నిలిచిపోయిన లోకల్ రైళ్లు

ముంబై: మూడురోజులుగా ముంబైని అతలాకుతలం చేసిన వానలు బుధవారం తగ్గుముఖం పట్టాయి. మంగళవారం రాత్రి ఇండ్లు కూలి చనిపోయిన ముగ్గురితో కలిపి వర్షాలధాటికి మొత్తం 15 మంది మృతిచెందినట్టు అధికారులు తెలిపారు. మరో 12 మందివరకు గాయపడినట్టు చెప్పారు. అయితే పలు ప్రాంతాలకు ఇంకా అధిక వర్షం ముప్పు పొంచిఉన్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ముంబైలోని 65లక్షల మంది ఆధారపడ్డ సబర్బన్ రైలు సేవలను పాక్షికంగా పునరుద్ధరించారు. పశ్చిమ, మధ్య, నౌకాశ్రయ మార్గాల్లో పలు రైళ్లు నడువడంతో రాత్రంతా స్టేషన్లలోనే ఉండిపోయిన వందల మంది ఇండ్లకు చేరుకోగలిగారు. సబర్బన్ రైళ్ల రాకపోకల్లో అంతరాయంతో ముంబై 'డబ్బావాలాలు' వివిధ రైళ్ల ప్రయాణికులకు అందించే దాదాపు రెండు లక్షల టిఫిన్ల డెలివరీని బుధవారం రద్దు చేసుకున్నారు. థాణేలో ముగ్గురు, దహిసర్, సంతానగర్, ఎల్ఫిన్‌స్టెన్, ఘట్కోపర్, మద్‌జెట్టి, విక్రోలిలో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రైళ్ల నుంచి జారిపడి, ఇతర రైలు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందినట్టు రైల్వే పోలీసులు ప్రకటించారు. థాణేలో మరో 14 ఏండ్ల బాలుడు కాలువలో పడి అదృశ్యమైనట్టు అధికారులు తెలిపారు. వర్షాల్లో చిక్కుకున్న నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు నౌకాదళం ముందుకొచ్చింది. సామాజిక వంటశాలలతోపాటు ఆహార కౌంటర్ల ద్వారా తినుబండారాలు పంపిణీ చేసినట్టు నేవీ అధికార ప్రతినిధి తెలిపారు. చర్చ్‌గేట్, బైకలా, పరేల్, సీఎస్టీ, వర్లీ, టార్డీ, సెంట్రల్ ముంబై, దాదర్, మంఖుర్డ్, చెంబూర్, మలాడ్, ఘట్కోపర్ ప్రాంతాల్లో ఫుడ్ కౌంటర్లను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ముంబైలో మంగళవారం 331.4 మిమీ వర్షం పడినట్టు శాంటాక్రుజ్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. 2005 జూలై 26న అత్యధికంగా 944 మిమీ వర్షం పడిందని, ఆ తర్వాత రెండో అధిక వర్షపాతం మంగళవారమే నమోదైందని తెలిపింది. 1997 ఆగస్టు 23న 346.2 మిమీ వర్షంతో ఒకేరోజు ఎక్కువ వర్షం కురిసినట్టు రికార్డు నమోదైంది.



నిరాశ్రయులైన ప్రజలకు బ్రెడ్ సరఫరా చేస్తున్న నౌకాదళ సిబ్బంది

పాయింట్లు పడుతున్నా బేఖాతర్!

- ట్రాఫిక్ ఉల్లంఘనలు షరా మామూలే
- నగరంలో హెల్మెట్‌లేని కేసులు 39 వేలు, సీటు బెల్టు లేనివి 5,900

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రమాదాలు జరుగకుండా ప్రజల ప్రాణాలను రక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాయింట్ల విధానాన్ని ప్రవేశపెట్టినా వాహనదారుల సహకారం కరువవుతున్నది. పాయింట్ల విధానంతో ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగవని భావించినప్పటికీ నగరంలో వాహనదారులు తమ బాధ్యతను మరిచి రెచ్చిపోతున్నారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించకపోవడమే కాకుండా తప్పతాగి నగర రోడ్లపై దూసుకుపోతున్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడ వద్దని చౌరస్తాల్లో మైకులు పెట్టి చెవుల్లో జోరిగల్లా మెత్తుకున్నా.. నగరవాసులు తమ పద్ధతి మార్చుకోవడం లేదు. చాలామంది నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. మరికొందరైతే ఏకంగా రివర్స్ డైవర్షన్‌లో వాహనాలు నడుపుతూ అడ్డంగా దొరికిపోతున్నారు.

ఉల్లంఘన పాయింట్ల అంశాలు	సంఖ్య
హెల్మెట్ లేకుండా	39,000
సీటుబెల్టు లేకుండా	5,900
డ్రంకెన్ డ్రైవింగ్	700
సెల్‌ఫోన్ డ్రైవింగ్	850
ఆపోజిట్ డైరెక్షన్	600

ఈ నెల 1న పాయింట్ల విధానం ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు సుమారు 50 వేల మంది నిబంధనలు ఉల్లంఘించారు. హెల్మెట్, సీటు బెల్టులు పెట్టుకోకుండా వాహనాలు నడుపవద్దని చెప్తున్నా నగరంలో ఇప్పటివరకు 39 వేల మంది హెల్మెట్ లేకుండా, 5,900 మంది సీటు బెల్టు పెట్టుకోకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఇక మద్యం తాగి తనిఖీల్లో పట్టుబడ్డవారి సంఖ్య 700, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడిన వారి సంఖ్య 850, ఆపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డవారు 600 మంది ఉన్నట్టు రవాణాశాఖ అధికారులు తెలిపారు.

రైల్వే కేసులో మంత్రులకు ఊరట

- 2011నాటి మౌలాలి కేసులను కొట్టేసిన కోర్టు
- న్యాయం గెలిచిందన్న హోంమంత్రి నాయిని

బన్సీలాల్‌పేట్: తెలంగాణ ఉద్యమంలో రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసులను బుధవారం రైల్వే న్యాయమూర్తి కొట్టేశారు. దీంతో ఈ కేసులో ఉన్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు, ఎక్సైజ్‌శాఖ మంత్రి టీ పద్మారావుతోపాటు మరో 11 మందికి ఊరట లభించింది. కేసు కొట్టేసిన అనంతరం సికింద్రాబాద్‌లోని రైల్వే కోర్టు వద్ద హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మీడియాతో మాట్లాడారు. 2011లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారన్నారు. అదే సమయంలో మౌలాలి రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారని ఆర్పీఎఫ్ పోలీసులు 14 మందిపై కుట్ర పూరితంగా అభియోగాలు మోపారన్నారు. దీంతో తాము అనేక సార్లు కోర్టుకు హాజరయ్యామన్నారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి తమపై పెట్టిన కేసులను కొట్టి వేశారని తెలిపారు. మొదటి నుంచి తమకు న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉన్నదని, ఈ రోజు జడ్జి ఇచ్చిన తీర్పు తమకు ఎంతో ఆనందం కలిగించిందని, ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ న్యాయం జరిగిందన్నారు. అదే విధంగా ఉద్యమ సమయంలో ఆదిలాబాద్ జిల్లాలో రైళ్లను ఆపామంటూ ఖాజీపేటలోని రైల్వే కోర్టు నుంచి మంత్రి కేటీఆర్‌కు, తనకు సమన్లు అందాయని, వచ్చే నెల 27న తాము అక్కడి కోర్టులో హాజరవుతామని వివరించారు. మౌలాలి రైల్వే కేసు నుంచి ముగ్గురు మంత్రులతోపాటు బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీ వేణుగోపాల్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇంచార్జి భేతి సుభాష్‌రెడ్డి, నాయకులు బద్దం పరశురాంరెడ్డి, ఆర్ నర్సింహాచారి, బేతాల బాల్‌రాజు, డీ లక్ష్మీనారాయణ, ఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, పోచయ్యాయాదవ్, సుబ్బారావు, వింద్యారాణి విముక్తి పొందారు.



రైల్వే కోర్టు వద్ద మంత్రులు కేటీఆర్, పద్మారావు, నాయిని మాటామంతి

ఎగ్జిబిషన్ సొసైటీ లీజు రద్దు కాలేదు

అది గిట్టనివారి ప్రచారం: ఆర్థిక మంత్రి ఈటల



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎగ్జిబిషన్ సొసైటీకి సంబంధించిన భూమి లీజును రద్దు చేసినట్టు జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని ఆర్థికశాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆ భూమిని ఎగ్జిబిషన్ సొసైటీకి 99 ఏండ్లు లీజుకు ఇవ్వడానికి అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, తెలంగాణ సంస్థలు, వ్యక్తులకు అండగా నిలుస్తున్నారన్నారు. అందులో భాగంగానే నుమాయిష్‌కు సీఎం మద్దతుగా నిలిచారన్నారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ 76 ఏండ్ల కిందట ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతి ఏడాది నాంపల్లిలో నిర్వహిస్తున్న నుమాయిష్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ 18 విద్యా సంస్థలను నిర్వహిస్తున్నదని అందులో వనితా మహా విద్యాలయ, కస్తూర్బా గాంధీ మహిళా కళాశాల, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీ వంటి విద్యాసంస్థలు 50 ఏండ్లు పూర్తి చేసుకున్నాయని గుర్తుచేశారు. తెలంగాణలో పేద విద్యార్థులకు విద్యను అందించడానికి, ప్రత్యేకంగా బాలికలకు విద్యను అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మొదటి ఏడాది నుమాయిష్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 'మీరు అడుక్కునేలా ఉండకూడదు.. మీకే ఈ భూమిని 99 ఏండ్లపాటు లీజు ఇస్తా' అని ప్రకటించారని మంత్రి గుర్తుచేశారు. సీఎం ప్రజల కోసం పనిచేసే సంస్థలను పెంచే ప్రయత్నం చేస్తారే తప్ప, తుంచే ప్రయత్నం చేయరని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎగ్జిబిషన్ సొసైటీకి లీజును పెంచే పనిలో ప్రభుత్వశాఖలు నిమగ్నమయ్యాయని పేర్కొన్నారు. కొంత మంది గిట్టనివారు లీజుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.



క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌కు నగరాభివృద్ధిపై వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

ఎంపీలతో మంత్రి కేటీఆర్ సమీక్ష

నేడు మల్కాజిగిరి అభివృద్ధిపై ప్రథమ సమావేశం

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలుపై పురపాలకశాఖ మంత్రి కే తారక రామారావు ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వచ్చే లోక్‌సభస్థానాల వారీగా సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదట మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై బేగంపేటలోని మెట్రో రైలు భవనంలో గురువారం సమీక్షించనున్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి కే తారకరామారావును మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులతో నియోజకవర్గాలవారీగా అభివృద్ధి కార్యక్రమాల అమలు, చేపట్టాల్సిన నూతన పనుల విషయంలో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తామన్నారు. ఈ సమీక్షలో నగర పరిధిలోని రాజ్యసభ సభ్యులతోపాటు స్థానిక లోక్‌సభ సభ్యులు, శాసనసభ, శాసనమండలి సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొంటారు. త్వరలో సికింద్రాబాద్, చేవెళ్ల, హైదరాబాద్ నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహిస్తామని మంత్రి చెప్పారు.



కూకట్‌పల్లికి చెందిన టీఆర్‌ఎస్ యువజన విభాగం గ్రేటర్ నాయకుడు పాటిమీది జగన్‌మోహన్‌రావు సోదరుడు విజయ్‌మోహన్‌రావు రెండు రోజుల కిందట ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం కూకట్‌పల్లిలోని జగన్‌మోహన్‌రావు కుటుంబసభ్యులను మంత్రి కేటీఆర్ పరామర్శించారు.
– కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ



ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా ఆవరణలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యాన మహోత్సవం–2017ను బుధవారం శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు కూడా ఈ ప్రదర్శనను సందర్శించారు.

జీహెచ్‌ఎంసీ డబుల్ ధమాకా

- గ్రేటర్‌లో లక్షకు చేరిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల టెండర్లు
- ఇప్పటికే వివిధ దశల్లో 68,296 గృహాలు
- మరో 31,704 ఇండ్లకు బిడ్లు ఆహ్వానించిన బల్దియా
- ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి
- రూ.8,225 కోట్లతో 109 కాలనీలుగా నిర్మాణం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

జీహెచ్‌ఎంసీ సరికొత్త చరిత్ర సృష్టించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిరుపేదలకు లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి ఇవ్వాలన్న ప్రభుత్వ స్వప్నాన్ని సాకారం చేసే దిశగా గొప్ప అడుగు వేసింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తూ లక్ష ఇండ్ల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. నగరంలోని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడంతోపాటు, హైదరాబాద్‌ను మురికివాడల రహిత నగరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం కనీవినీ ఎరుగని రీతిలో రూ.8,225 కోట్లతో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 109 కాలనీలుగా వీటిని నిర్మించేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంచేశారు. వచ్చే ఏడాది చివరినాటికి ఇండ్లను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే 68,296 ఇండ్లకు టెండర్లు పిలిచారు. వాటిలో 88 ప్రాంతాల్లో 59,520 ఇండ్లకు టెండర్లు ఖరారు కాగా, 40 ప్రాంతాల్లో 27,734 ఇండ్ల నిర్మాణం కొనసాగుతున్నది. మిగతా 31,704 ఇండ్లకు తాజాగా టెండర్లు ఆహ్వానించారు. వీటికి రూ.2,725 కోట్లు వ్యయం చేయనున్నారు. దీంతో లక్ష ఇండ్లకు టెండర్లు పిలువాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని జీహెచ్‌ఎంసీ పూర్తి చేసింది. ఇంత తక్కువ వ్యవధిలో లక్ష ఇండ్లకు టెండర్లు ఆహ్వానించడం రికార్డని అధికారులు చెప్తున్నారు. స్థలాల లభ్యత ఆధారంగా మూడు, ఐదు, తొమ్మిది అంతస్తులుగా నిర్మిస్తున్నారు.



రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మల్లాపూర్‌లో 15 ఎకరాల విస్తీర్ణంలో 2,700 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

శరవేగంగా నిర్మాణాలు

గ్రేటర్ పరిధిలో 109 ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తుండగా, అందులో 33 కాలనీల్లో ప్రస్తుతమున్న బస్తీలను ఖాళీచేయించి వాటి స్థానంలో డబుల్ ఇండ్లు (ఇన్‌సీటూ కాలనీలు) నిర్మిస్తుండడం మరో రికార్డు. గతంలో రాజీవ్ ఆవాస్ యోజనలో భాగంగా శేరిలింగంపల్లిలోని కేశవనగర్ బస్తీలో సుమారు 300 ఇండ్లను ఖాళీచేయించి కొత్త కాలనీ నిర్మించాలని ప్రతిపాదించినా, అది ఆచరణకు నోచుకోలేదు. ఇప్పుడు ఏకంగా 33 బస్తీల స్థానంలో కాలనీలు వెలుస్తున్నాయి. మిగిలిన 76 కాలనీలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కాలనీల్లో నాచారంలోని సంఘం చెరువు తండాలో నిర్మిస్తున్న 176 యూనిట్ల కాలనీని ఈ ఏడాది దీపావళిలోగా పూర్తిచేసి గృహప్రవేశానికి సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతోపాటు ఎరుకల నాంచారమ్మ నగర్ (288), సయ్యద్‌సాబ్ కా బాడా(48) కాలనీలు కలిపి మొత్తం మూడు కాలనీల్లో 336 యూనిట్లను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటి నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నది.

స్వచ్ఛందంగా ఖాళీ చేస్తున్న 33 బస్తీలు

33 బస్తీలను ఖాళీ చేయడానికి స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు రావడం గమనార్హం. స్థానికులను ఒప్పించడంలో పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు, అందరికీ డబుల్ ఇండ్లు నిర్మించి ఇస్తామని భరోసా కల్పించడంతో బస్తీవాసులు ఖాళీ చేసేందుకు ముందుకొచ్చారు. మంత్రి పర్యవేక్షణలో మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు బస్తీవాసులను ఒప్పించేందుకు పలు దఫాలుగా చర్చించారు. బస్తీల్లో కొందరికి 30 గజాల స్థలమే ఉండగా, మరికొందరికి 150 గజాల వరకూ ఉన్నది. దీంతో ఎక్కువ స్థలం ఉన్నవారు డబుల్ బెడ్‌రూం ఇండ్లను వ్యతిరేకించారు. అలాంటి వారికి మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు భరోసా కల్పించడంతో అంగీకరించారు. ఇప్పటివరకు ఐడీహెచ్ కాలనీ మాత్రమే ఇన్‌సీటూ కాలనీగా ఉన్నది. ఇప్పుడు మరో 33 ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తుండడం విశేషం. చిన్న చిన్న సందులతో, అరకొర మౌలిక సదుపాయాలతో కాలం వెళ్లదీసే బస్తీవాసులకు సువిశాలమైన రోడ్లు, మౌలిక సదుపాయాలతోపాటు దాదాపు 560 చదరపు అడుగుల వైశాల్యంతో డబుల్ ఇండ్లు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా స్థలాలను ఖరారు చేయడంలో కమిషనర్ జనార్దన్‌రెడ్డితోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు కీలక భూమిక పోషించారు. సిటీ సమన్వయ సమావేశాల సందర్భంగా ఈ అంశాన్ని ప్రధాన ఎజెండాగా చేపట్టి లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేశారు.

ప్రాజెక్టు విశేషాలు

నిర్మించనున్న ఇండ్లు	: లక్ష
వ్యయం: రూ.8,225 కోట్లు	
మొత్తం కాలనీలు	:109
ఇన్‌సీటూ కాలనీలు	: 33
ఖాళీ స్థలాల్లో నిర్మించేవి	: 76

జిల్లాల వారీగా ఇండ్లు, వ్యయం వివరాలు

జిల్లా	ఇండ్లు	వ్యయం(రూ.కోట్లల్లో)
హైదరాబాద్	9,098	739.74
రంగారెడ్డి	24,058	2,073.45
మేడ్చల్	38,624	2,972.81
సంగారెడ్డి	28,220	2,439.44
మొత్తం	1,00,000	8,225.44

ఐడీహెచ్‌తో మొదలైన ప్రస్థానం

నగరంలో డబుల్ ఇండ్ల గృహప్రవేశాలు బోయిగూడలోని ఐడీహెచ్ కాలనీతో ప్రారంభమయ్యాయి. బస్తీలను ఖాళీ చేయించి వాటి స్థానంలో ఇన్‌సీటూ కాలనీలను నిర్మించడం సైతం ఇక్కడే మొదలైంది. ఇక్కడ ప్రభుత్వం 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు బెడ్‌రూంలు, రెండు టాయిలెట్లు, కిచెన్, హాలుతో సువిశాల గృహాన్ని పూర్తి ఉచితంగా నిర్మించి ఇచ్చింది. 396 కుటుంబాలకు ఒకేసారి ఇండ్లు అప్పగించి యావత్ దేశం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. కాలనీని సందర్శించిన రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఈ ఇండ్లు ఢిల్లీలో ఐఏఎస్ అధికారుల క్వార్టర్ల మాదిరిగానే ఉన్నాయని ప్రశంసించారు. రాష్ట్రంతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు కాలనీని సందర్శించి ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రధానమంత్రి నియోజకవర్గమైన వారణాసితోపాటు ఉత్తరాదికి చెందిన మీడియా హైదరాబాద్‌ను సందర్శించి ఇక్కడ చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం గురించి, ఐడీహెచ్ కాలనీలోని ఇండ్ల గురించి ప్రత్యేక కథనాలు ప్రచురించింది. మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తోపాటు కేరళలో సైతం డబుల్ బెడ్‌రూం ఇండ్లను చేపట్టారు.

దారి తప్పుతున్న ఆన్‌లైన్ స్నేహాలు

- కాపురాలు కూల్చేస్తామంటూ మహిళలకు బెదిరింపులు
- షీ టీమ్స్‌ను ఆశ్రయిస్తున్న బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రేరణ (పేరు మార్చాం) ఇటీవలే ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించింది. ఆమెకు శశాంక్ (పేరు మార్చాం) అనే వ్యక్తి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించగా ఓకే చెప్పింది. తర్వాత వారిద్దరూ చాటింగ్ చేసుకొనేవారు. కొన్నాళ్లకు శశాంక్ ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. డబ్బు ఇవ్వాలని, లేకుంటే తన వద్ద ఉన్న ఫొటోలను ఆమె భర్తకు చూపిస్తానంటూ వేధించాడు. భర్తకు తెలిస్తే పరువుపోతుందనే బాధతో ప్రేరణ రూ.లక్ష వరకు సమర్పించుకుంది. అయినా తనను కలువాలని శశాంక్ వేధించడంతో ఆమె మానసికంగా కృంగిపోయింది. ఆమె బాధను చూసిన భర్త ఏం జరిగిందని ఆరా తీయడంతో జరిగిన విషయాన్ని వివరించింది. దంపతులు వెంటనే షీ టీమ్స్‌ను ఆశ్రయించారు. పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఇలా కొందరు దుండగులు ముందుగా స్నేహం నటించి.. కొన్నాళ్ల తర్వా కాపురాలు కూల్చేస్తామని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ డబ్బు వసూలు చేస్తున్నారు. కొందరు యువకులు యువతులతో స్నేహం నటించి ఫొటోలు దిగుతున్నారు. యువతులకు పెండ్లి నిశ్చయం అయిన తర్వాత ఫొటోలను చూపించి బెదిరిస్తున్నారు. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల షీటీమ్స్‌కు ఇలాంటి ఫిర్యాదులు పెరుగు తున్నాయి. పోలీసులు వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలుస్తూ నిందితులపై చర్యలు తీసుకుంటున్నారు. నిందితులు మైనర్లయితే వారి కుటుంబ సభ్యులతోపాటు కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మార్పు తేవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే చాలామంది బాధితులు తమ పరువు పోతుందని, కోర్టుల చుట్టూ తిరుగాల్సి వస్తుందనే భయంతో ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడంలేదు. దీంతో నిందితులు కఠిన శిక్షల నుంచి తప్పించుకుంటున్నారు. కాబట్టి బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరుతున్నారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి



సోషల్ మీడియాలో అనవసర పరిచయాలు, వద్దు. వేధింపులు, బ్లాక్ మెయిలింగ్‌కు మహిళలు భయపడొద్దు. మీ కోసం షీటీమ్స్ ఉన్నాయని గుర్తుంచుకోండి. మేం అన్ని వేళల్లో అండగా ఉంటాం. మీరు తప్పు చేయనప్పుడు పరువు పోతుందనే భయం వద్దు. బ్లాక్‌మెయిలర్లు మీతోపాటు మరింత మందిని వేధిస్తున్నారని గుర్తించాలి. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే వారికి కఠిన శిక్షలు పడుతాయి.
– కవిత, షీ టీమ్స్ ఏసీపీ

మేమెంతో.. మాకంత వాటా కావాలి

- బీసీ విద్యార్థి సభ్యత్వ నమోదులో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల
- నవంబర్ 12న విద్యార్థి సంఘం మహాగర్జన



బీసీ విద్యార్థి సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఓయూ, తెలుగు వర్సిటీ వీసీలు

ఉస్మానియా యూనివర్సిటీ: 'మేమెంతో మాకంత వాటా' అనే నినాదంతో నవంబర్ 12న హైదరాబాద్‌లో లక్షల మంది విద్యార్థులతో బీసీ విద్యార్థి మహాగర్జన నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీనివాస్‌గౌడ్, ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం, తెలుగు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సం దర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ విద్యార్థుల హక్కుల కోసం ఒక వైపు పోరాడుతూనే బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ విద్యార్థి సంఘం ముందుకు సాగుతున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల మంది విద్యార్థులను సభ్యులుగా చేర్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సామాజిక న్యాయం, మేమెంతో మాకంత వాటా నినాదంతో బీసీ ఉద్యమాన్ని నిర్మించడంలో భాగంగానే ఈ సభ్యత్వ నమోదును చేపట్టామన్నారు. వచ్చేనెల 12న అన్ని జిల్లాల్లో బీసీ విద్యార్థుల చైతన్య సదస్సులను నిర్వహించనున్నట్టు ప్రకటించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో నూతనంగా 119 గురుకుల పాఠశాలలను ప్రారంభించిందని, మెస్ చార్జీలను గణనీయంగా పెంచిందని గుర్తుచేశారు. పూలే ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ పేరుతో విదేశాలకు ఉన్నత విద్యకోసం వెళ్లే విద్యార్థులు ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా ఎదుగాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ జనాభాలో సగమున్న బీసీలు అవకాశాల్లోనూ సగం రాబట్టడం కోసం విద్యార్థులే ముందుండి పోరాడాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు మసన చెన్నప్ప, సిద్ధాగౌడ్, కృష్ణారావు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్, కేంద్రకమిటీ అధ్యక్షుడు టీ విక్రంగౌడ్, ప్రధాన కార్యదర్శి జాజుల లింగం, నాయకులు గండిచెరువు వెంకన్న, కనకల శ్యాం, మహేశ్‌యాదవ్, బడేసాబ్, భాస్కర్, దుర్గయ్యగౌడ్, సతీశ్, దినేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, కిరణ్, ఇంద్రం, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్‌కు..

ఏడాది జైలు శిక్ష

- అక్రమ సంపాదన రూ.46.48 లక్షలు నాలుగు నెలల్లో డిపాజిట్ చేయాలి
- లేని పక్షంలో ఆస్తులు జప్తు చేయాలని కోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్న కేసులో ఏపీలోని అనంతపురంలో ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్‌గా పనిచేసిన బీ యోగేశ్వర్‌రావుకు ఏసీబీ కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధించింది. అక్రమ ఆస్తులు రూ.46,48,268 నాలుగు నెలల్లో ప్రభుత్వానికి డిపాజిట్ చేయాలని, లేని పక్షంలో అక్రమాస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ అశోక్ కుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బీ యోగేశ్వర్‌రావు 1973లో రామచంద్రాపురంలోని బీహెచ్‌ఈఎల్‌లో ఇంజినీర్‌గా చేరాడు. తర్వాత ఏపీ ప్రభుత్వ సర్వీసుల్లో చేరి, 1980లో ఫ్యాక్టరీస్‌శాఖలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్‌గా నియమితులయ్యారు. తర్వాత డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్‌గా వరంగల్, హైదరాబాద్, అనంతపురంలో పనిచేశారు. 2002లో అనంతపురంలో ఉండగా ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ గుర్తించింది. అధికారులు యోగేశ్వర్‌రావు ఇంటితోపాటు బంధువుల ఇండ్లల్లో కూడా సోదాలు జరిపి రూ.46,48,268 విలువ చేసే అక్రమాస్తులు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. విచారణ పూర్తి చేసి ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక కోర్టు, నేరం రుజువు కావడంతో యోగేశ్వర్‌రావుకు ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నది. ఆదాయానికి మించి ఆస్తుల విలువను పరిగణనలోకి తీసుకొని తీర్పు వెల్లడైన నాలుగు నెలల్లోపు రూ.46,48,268 డిపాజిట్ చేయాలని, లేని పక్షంలో ఆస్తులు జప్తు చేసి, విక్రయించాలని న్యాయస్థానం ఆదేశించింది.

లాటరీ పేరుతో మోసం.. కేరళ వాసి అరెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాటరీ పేరుతో రూ.11 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐడీ అడిషనల్ డీజీ గోవింద్‌సింగ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాధితుడికి కొన్నాళ్ల కిందట ఫోన్‌కాల్ వచ్చింది. మీకు లాటరీలో రూ.25 లక్షలు వచ్చాయి.. రూ.25 వేలు డిపాజిట్ చేయాలని నమ్మించాడు. దీంతో బాధితుడు రూ.25 వేలు జమచేశాడు. ఆ అపరిచితుడు తర్వాత ఫోన్ చేసి మీ లాటరీ మొత్తం రూ.కోటికి పెరిగింది.. మరికొంత డిపాజిట్ చేయాలని కోరాడు. ఇలా విడుతల వారీగా మూడు నెలల్లో 34 బ్యాంకు ఖాతాల్లో రూ.11 లక్షలు జమ చేయించుకున్నాడు. తర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వారు కేసును హైదరాబాద్ సీఐడీ సైబర్ క్రైంకు బదిలీ చేశారు. నిందితుడు వాడిన ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతాల అడ్రస్‌ల ఆధారంగా కేరళకు చెందిన హంజా ఓతుక్కుం పురత్‌గా గుర్తించారు. ఖతార్‌లో ఉంటున్న అతడు ఇటీవల భారత్‌కు వచ్చి మంగళవారం చెన్నై నుంచి మలేషియా వెళ్తుండగా ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని సీఐడీ పోలీసులకు అప్పగించారు. అతడికి సహకరించిన వ్యక్తిని గతంలోనే అరెస్ట్ చేశారు. ఫోన్ నంబర్ ముందు '+92' ఉంటే అప్రమత్తంగా ఉండాలని, అవి పాకిస్థాన్ నుంచి వస్తున్నాయన్నారు. కొందరు లాటరీ పేరుతో మోసం చేస్తున్నారని చెప్పారు.



చాక్లెట్ తినండి.. షుగర్‌ను తరమండి!

తీపి తింటే మధుమేహం వస్తుందేమోనని భయమా? కొన్ని ప్రాథమిక లక్షణాలు చూస్తే ఇది షుగర్ వ్యాధే అని ఆందోళన కలుగుతున్నదా? అయితే చాక్లెట్లు తినమని సూచిస్తున్నారు అమెరికా శాస్త్రవేత్తలు.

చాక్లెట్లు తినేవాళ్లు వాటిని ఏ మాత్రం ఆపకండి అంటున్నారు పరిశోధకులు. తయారు చేసేందుకు వాడే కోకాలో డయాబెటీస్‌ను తగ్గించే గుణాలు ఉన్నాయని చెప్తున్నారు. అమెరికన్ ప్రొఫెసర్ జెఫెరీ టెస్సెమ్ నేతృత్వంలో ఈ పరిశోధన జరిగింది. చాక్లెట్లు-క్యాన్సర్ ప్రభావం అనే అంశంపై ఆ బృందం పరిశోధన చేసింది. చాక్లెట్లకు ఉపయోగించే కోకాలోని ఎపికటెచిన్ మోనోమెర్స్ అనే సమ్మేళనం అధిక మోతాదులో ఇన్సులిన్ విడుదల కావడానికి దోహదం చేస్తుందట. ఇన్సులిన్ ఉత్పత్తి చేసే బీటా కణాల వైఫల్యం కారణంగా.. డయాబెటీస్ బారిన పడిన వ్యక్తి శరీరం తగిన మోతాదులో ఇన్సులిన్ ఉత్పత్తి చేయదని చెప్తున్నారు. ఎపికటెచిన్ మోనోమెర్స్ కారణంగా బీటా కణాలు బలంగా మారుతున్నాయనీ.. వాటివల్ల ఇన్సులిన్ స్రవించే సామర్థ్యం పెరుగుతున్నట్లు పరిశోధనలో తేలింది.

జనధాన్యాగారం!

ఒకేలా ఆలోచించే, పనిచేసే వ్యక్తులు ఈ ప్రపంచంలో బోలెడుమంది ఉంటారు. వారంతా ఒక్కటైతే, ఒక్క చోటికి చేరితే ఒకరికొకరు సాయం చేసుకుంటూ చేరాలనుకున్న గమ్యాన్ని వేగంగా చేరుకోవచ్చు.

బెంగళూరుకు చెందిన కనకాపుర గ్రామ మహిళలు గత తొమ్మిదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. అందులో నాగరత్న అనే ఆవిడ పండించిన పంట నుంచే విత్తనాలు రూపొందిస్తూ విత్తన వ్యాపారుల మీద ఆధార పడకుండా వ్యవసాయం చేస్తున్నది. తనలాగే చుట్టుపక్కల గ్రామాల్లో కొంతమంది మహిళా రైతులు కూడా చేస్తున్నారని తెలుసుకుని వారిని కలిసింది. వీరి శ్రమకు, ఆలోచనకు గ్రీన్ ఫౌండేషన్, మైండ్ ట్రీ అనే సంస్థలు తోడయ్యాయి. ఆ రెండు సంస్థల సహకారంతో ఆన్‌లైన్‌లో వారు ఉత్పత్తి చేసిన విత్తనాలు అమ్మకానికి పెట్టారు. జనధాన్య అనే పేరుతో వెబ్‌సైట్ పెట్టి అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. నేరుగా రైతులు, కొనుగోలుదారులతో సంబంధం ఉండేలా క్రియేట్ చేశారు. దీంతో వారు సంవత్సరానికి 90 వేల రూపాయల లాభం గడిస్తున్నారు. ఇప్పుడు జనధాన్య గ్రూప్‌లో 2750 మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
గురువారం 31 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM





ఆడవాళ్లను హోమ్ మినిస్టర్స్ అంటుంటాం కానీ!
వాళ్లలో చాలామంది ఫైనాన్స్ మినిస్టర్స్ కూడా ఉంటారు..
సంపాదించేది సారే అయినా..
ఖర్చులు లెక్కలు చూసేది మాత్రం మేడమే!
ఆయన సంపాదించే దాంట్లో కొంత దాచిపెడుతూనే..
తమకూ ఎంతో కొంత సంపాదన ఉండాలనుకుంటారు..
కుటుంబ ఆర్థిక అవసరాలకు ఆసరాగా మారాలనుకుంటారు..
అందుకు తగిన ఆదాయ మార్గాలను ఎప్పటికప్పుడు అన్వేషిస్తుంటారు..
అనువైన, సులువైన వ్యాపారాలను ప్రారంభించాలనుకుంటారు..
అలాంటి మగువల కోసమే ఈ వారం రస్‌గుల్లా.. మనీమ్యాటర్స్.

మనీ మ్యాటర్స్
for women

రస్‌గుల్లాతో కాసుల గలగల

ఒకప్పుడు గృహిణిగా ఉండి.. తర్వాత వ్యాపారవేత్తలుగా మారిన మహిళామణులు దేశంలో చాలామందే ఉన్నారు. అలాంటి కోవకే చెందుతుంది కోల్‌కతాకు చెందిన స్వాతి సరాఫ్. కోట్లకు పడుగలెత్తకపోయినా ఆర్థికంగా తనకూ, కుటుంబానికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకోగలిగింది. సంప్రదాయ స్వీట్ల తయారీలో కొత్త ట్రెండ్‌ను సృష్టించి విజయం సాధించింది. తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచింది. రస్‌గుల్లా.. దీని పేరు వింటేనే నోరూరిపోతుంది. తిన్నాకొద్దీ తినాలనిపించే ఈ బెంగాలీ స్వీటుకు ఫ్యాన్ ఫాలోయింగ్ విపరీతం. ఆ ఫ్యాన్ ఫాలోయింగ్‌నే తన ఆర్థిక వనరుగా మార్చుకున్నది స్వాతి. పిల్లలతో, భర్తతో కలిసి ఎప్పుడు బయటికి వెళ్లినా ఈ రస్‌గుల్లాను తప్పక ఆరగించేదామె. ఎంతిష్టమంటే రస్‌గుల్లాను చూస్తే చాలు ఆమె గుండె జారి గల్లంతయ్యేటంత. అంతలా ఆకట్టుకున్న రస్‌గుల్లాను.. తానే తయారు చేసి విక్రయిస్తే ఎలా ఉంటుందని ఆలోచన చేసిందామె. అలా ఆలోచన వచ్చిందే తడువు.. చిన్నగా వ్యాపారాన్ని ప్రారంభించింది.

చిన్నగా మొదలెట్టి: ఈ వ్యాపారాన్ని మొదలు పెట్టేందుకు పెద్ద పెట్టుబడితో పని లేదు. రస్‌గుల్లా చేయడం తెలిస్తే చాలు. ఇంటి పట్టునే చిన్నగా ప్రారంభించవచ్చు. అమ్మకాలను బట్టి విస్తరించుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో తయారు చేయాల్సి వస్తే చిన్న గదిని కిరాయికి తీసుకోవాల్సి ఉంటుంది. ఇల్లు పెద్దగా ఉంటే మాత్రం, ఒక చిన్న గదిని కేటాయించుకోవచ్చు. అదనంగా అద్దె చెల్లించాల్సిన భారం తగ్గుతుంది.

రొటీన్‌కు భిన్నంగా : రస్‌గుల్లా అంటే చాలామందిలో రొటీన్ అనే ఫీలింగ్ కలుగొచ్చు. నిజం చెప్పాలంటే ఈ మధ్య వీటిపై క్రేజ్ కూడా తగ్గింది. ఒకప్పుడైతే చిన్న, పెద్ద తేడా లేకుండా రస్‌గుల్లాను అందరూ ఇష్టంగా తినేవారు. కానీ షుగర్ లాంటి వ్యాధులు ఇబ్బంది పెడుతుండడంతో.. చాలామంది రస్‌గుల్లాకు దూరంగా ఉంటున్నారు. దీనిలోని అతి తియ్యదనానికి భయపడుతున్నారు. అయ్యో! మరి వ్యాపారం ఎలా సాగుతుందని భయపడాల్సిన పన్లేదు. ఎందుకంటే ఆ సమస్యను అధిగమించగడానికి, సంప్రదాయ స్వీటుకు పూర్వ వైభవం తీసుకురావడానికి స్వాతి మంచి ప్లానే వేసింది. రొటీన్‌కు భిన్నంగా ముందుకు సాగి.. సూపర్ సక్సెస్ అయ్యింది. మీరూ అలా చేస్తే తప్పక విజయం సాధించొచ్చు.

తియ్యదనం కొత్తది: టేస్టీటేస్టీ రస్‌గుల్లాపై ఆసక్తి తగ్గిపోవడాన్ని గమనించిన స్వాతి.. దాన్నే తన వ్యాపారానికి అనువుగా మలుచుకున్నది. రస్‌గుల్లా తయారీలో మార్పులు చేసింది. మధుమేహానికి కారణమవుతున్న చక్కెర వాడకాన్ని తగ్గించి హెల్దీ రస్‌గుల్లా కాన్సెప్టును ముందుకు తీసుకొచ్చింది. రొటీన్ రస్‌గుల్లాను పక్కన పెట్టి.. తన బ్రాండ్ రస్‌గుల్లాను మార్కెట్‌కు పరిచయం చేసింది.

ఎన్నో వెరైటీలు: ఉత్పత్తులు ఏవైనా.. వాటిలో వెరైటీస్ ఉంటేనే మజా ఉంటుంది. వినియోగదారులనూ ఆకట్టుకోవచ్చు. మరి ఇది స్వీట్ మ్యాటర్. ఆ వెరైటీల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉండాలి. అప్పుడే రస్‌గుల్లాకు డిమాండ్ పెరుగుతుంది. వ్యాపారమూ వృద్ధి చెందుతుంది. ఆ విషయంలో స్వాతి ఒక అడుగు ముందే ఉందని చెప్పాలి. పాతకాలపు రస్‌గుల్లాకు ఫుల్‌స్టాప్ పెట్టేసి.. తన స్టైల్లో వాటిని మరింత టేస్టీగా తయారు చేయడం మొదలెట్టింది. కాకరకాయ, లవంగాలు, జీలకర్ర.. ఇలా వెరైటీ ఇంగ్రిడియంట్స్‌తో రస్‌గుల్లాను తయారు చేసి అందరితో శభాష్ అనిపించుకున్నది. వీటిని అమ్మేందుకు చిన్న ఔట్‌లెట్‌నూ ప్రారంభించింది. అది విజయవంతం కావడంతో ఇతర చోట్ల బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నది.

సులువైన వ్యాపారం: హైదరాబాద్‌లో అన్ని రకాల స్వీట్లకూ ఆదరణ ఉంటుంది. కాబట్టి రస్‌గుల్లా తయారీని ఇక్కడి మహిళలు కూడా వ్యాపారంగా మార్చుకోవచ్చు. రస్‌గుల్లా తయారు చేయడం తెలిసిన వారికి ఇది మరింత సులభమైన వ్యాపారం. ఇంట్లోనే ఈజీగా తయారు చేయవచ్చు. విభిన్న రుచుల్లో రస్‌గుల్లాను తయారు చేయగలిగితే వ్యాపారంలో విజయం సాధించవచ్చు. ఈ వ్యాపారంలో స్వాతికి కుటుంబసభ్యుల సహకారం అదనపు బలం. అందుకే ఆమె ఈ వ్యాపారంలో విజయం సాధించగలిగింది. అయితే అందరికీ అలాంటి పరిస్థితులు ఉంటాయని చెప్పలేం కాబట్టి. హెల్పర్‌ను నియమించుకోవాల్సి రావొచ్చు. అలా మరొకరికి ఉపాధినీ కల్పించే వీలు కలుగుతుంది.

మరింత విస్తరిస్తా..

కోల్‌కతా స్పెషల్‌గా ప్రసిద్ధికెక్కిన రస్‌గుల్లాకు ఆదరణ తగ్గిపోవడం నన్ను ఆలోచింపజేసింది. అందుకే రస్‌గుల్లా తయారీలో మార్పులు తేవాలనుకున్నా. రకరకాల ఫ్లేవర్స్‌లో రస్‌గుల్లాను తయారు చేసి విక్రయించడం మొదలుపెట్టా. కొద్దికాలంలోనే వ్యాపారం బాగా పుంజుకున్నది. ఇప్పుడు మరిన్ని బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నా.

\- స్వాతి సరాఫ్



మీరూ ప్రారంభించొచ్చు..

స్థిర వ్యయాలు..

- హోమ్‌మేడ్ అయినప్పటికీ, ఎక్కువ సంఖ్యలో తయారు చేయాలంటే కార్ఖానా ఏర్పాటుకు ఒక గది అవసరం.
- రూమ్‌కు అడ్వాన్స్ : రూ. 25,000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- గ్యాస్ పొయ్యిలు, ఇతర సామాగ్రి : రూ. 25,000
- ప్రాథమిక + ప్రారంభ వ్యయాలు : రూ. 50,000
- మొత్తం : రూ. 1,00,000

నెలవారీ ఖర్చు

- ఒక్కరోజులో 200 రస్‌గుల్లాలను తయారు చేయగలరనుకుందాం.
- ఒక రస్‌గుల్లా తయారికి అయ్యే ఖర్చు రూ. 5
- నెలకు 25 రోజులు పనిచేస్తే 5,000 రస్‌గుల్లాలను తయారు చేయవచ్చు.
- అంటే నెలకు 5000x 5= రూ. 25,000
- కరెంట్, ఫోన్, ఇతర బిల్లులు: రూ. 5,000
- రూమ్ రెంటు: రూ. 5000(ఏరియాను బట్టి మారొచ్చు)
- మొత్తం : రూ. 35,000
- పెట్టుబడి : రూ. 1,35,000

ఏడాది అమ్మితే వచ్చేది..

- రోజుకు 200 రస్‌గుల్లాలను అమ్మగలిగితే..
- ఏడాదికి 300 రోజులు పనిదినాలుగా లెక్కేస్తే..
- 200x 300 = 60,000 రస్‌గుల్లాలను అమ్మవచ్చు.
- సగటున ఒక్కో రస్‌గుల్లాను రూ.15కి అమ్ముదామనుకుందాం.
- 60,000 x 15= రూ. 9,00,000 ఆదాయం వస్తుంది.

ఏడాదికి అయ్యే ఖర్చు..

- నెలవారీ ఉత్పాదక వ్యయాన్ని ఏడాదికి లెక్కగడితే..
- 35,000 x 12 = రూ. 4,20,000
- ప్రారంభ వ్యయాలు రూ. 1,35,000
- మొత్తం ఏడాదికి అయ్యే ఖర్చు : రూ. 5,55,000

లాభం అంచనా..

- ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం రూ. 9,00,000
- సంవత్సరంలో అయిన ఖర్చు : రూ. 5,55,000
- తీసేస్తే వచ్చే లాభం : రూ.3,45,000
- అంటే నెలకు వచ్చే లాభం : సుమారుగా రూ. 29,000

గమనిక :
ఈ లెక్కలు కేవలం అంచనా ప్రకారం వేసినవే. మరిన్ని వెరైటీస్‌ను తయారు చేయగలిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

బిట్స్ కార్నర్

గౌరీ.. సాహసనారీ!



డేరా బాబా అరెస్టుతో హర్యానా అంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాబా అనుచరులంతా వీధుల్లోకొచ్చి హింసకు పాల్పడుతున్నారు. పోలీసులు కూడా దాదాపు చేతులెత్తేసిన పరిస్థితి. అప్పుడొచ్చింది ఓ వీర వనిత. ఒక్కరాత్రిలో ఆందోళనలు సద్దుమణిగేలా చేసింది.

గౌరీ పరాషర్ జోషి.. హర్యానాలోని పంచకుల్ పట్టణ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్. డేరాబాబా అనుచరులు చేస్తున్న హింసాత్మక ఆందోళనలను ఒంటిచేత్తో అణిచివేసింది. ఒకవైపు నుంచి రాళ్లు, కర్రలు మీద పడుతున్నా లెక్కచేయకుండా పరిస్థితిని చక్కదిద్దింది. సాయంత్రం మొదలుకొని తెల్లవారుజాము మూడింటి వరకు ఇంటికెళ్లకుండా పరిస్థితిని చక్కదిద్దింది. ఈమె 2009 ఐఏఎస్ బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకుంది. గత సంవత్సరం నుంచి పంచకుల డిప్యూటీ కమీషనర్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త అజిత్ బాలాజీ కూడా చండీఘర్ డిప్యూటీ కమీషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. డేరాబాబా అల్లర్ల విషయంలో గౌరీ చూపించిన సాహసం ఇదే మొదటిసారి కాదు. ఎన్నో అల్లర్లు, ఆందోళనలను ఒంటిచేత్తో, తెలివిగా సద్దుమణిచిన ఘనత గౌరికి ఉంది. డేరాబాబా అల్లర్ల సమయంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆమె పదకొండు నెలల చిన్నారిని ఇంట్లో వదిలేసి డ్యూటీకి వెళ్లింది. కర్తవ్యం పట్ల గౌరీ చూపించిన విధేయత, వివేకం, ధైర్యసాహసాలు అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నాయి.

నల్లని వలయాలు తగ్గడానికి..



చర్మం తెల్లగా ఉన్నా.. కళ్ల కింద నల్లటి వలయాలు చాలామంది ఇబ్బందిని తెచ్చిపెడుతాయి. నిద్రలేమి కారణంగా ఈ నల్లని వలయాలు ఏర్పడుతాయి. మరి అవి తగ్గాలంటే నిద్రతో పాటు, ఆముదంతో కొన్ని రకాల నూనెలను మిక్స్ చేస్తే వలయాలు మాయమవుతాయి.

- కొబ్బరి నూనె, ఆముదం కలిపి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రోజుకు రెండుసార్లు అప్లయి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- కళ్ల కింద నల్లని వలయాలను తగ్గించుకోవడానికి ఆముదం, ఆవనూనె బాగా సహాయపడుతాయి. ఈ రెండింటిని కలిపి కళ్ల కింద రాసి మృదువుగా రాయాలి.
- ఆముదం, బాదం నూనె రెండింటిని కలిపి ఒక డబ్బాలో నిల్వ చేసుకోవాలి. రోజుకు కనీసం ఒకసారైనా ఈ నూనెతో కళ్ల కింద నల్లని వలయాల దగ్గర మసాజ్ చేయాలి.
- ఫేస్ క్రీమ్‌లో కొద్దిగా ఆముదం కలిపి డార్క్ సర్కిల్స్ ఉన్న ప్రాంతాల్లో రాయాలి. ఒక టీస్పూన్ క్రీమ్‌లో, పది చుక్కల ఆముదం కలిపితే చాలు. ఈ మిశ్రమాన్ని కళ్ల కింద అప్లై చేస్తే ఫలితం ఉంటుంది.
- ఆముదం, పచ్చిపాలు రెండూ కలిపి డార్క్ సర్కిల్స్ ఉన్న చోట రాయాలి. లేకపోతే ఈ మిశ్రమంలో దూది ముంచి కళ్ల మీద పెట్టుకున్న సరిపోతుంది. ఈ కాటన్ బాల్స్ తీసేసి నీటితో కడిగేయాల్సి ఉంటుంది.

మెంతులు చేసే మేలు!

రుచికి చేదుగా ఉన్నా.. మెంతులు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. క్రీస్తుపూర్వం నాటి ధన్వంతర నిఘంటువులో కూడా మెంతుల వల్ల లాభాల గురించి ప్రస్తావించారు.



- మెంతులు రక్తపోటు, వాతాన్ని తగ్గిస్తాయి.
- నోటికి రుచి కల్గించి జీర్ణశక్తిని పెంచుతాయి.
- శరీరంలో ఏర్పడిన గడ్డలకు మెంతులు మెత్తగా దంచి పట్టీ కడితే కరిగిపోతాయి.
- మెంతులలో లైసిన్ అనే అమైనో ఆమ్లం పుష్కలంగా లభిస్తుంది.
- శరీరానికి కావల్సిన ఫాస్ఫరిక్ ఆమ్లం, రెసిన్ అనే తైలం మెంతుల్లో ఆరుశాతం లభిస్తాయి.
- 86 శాతం తేమగా ఉండే మెంతులు ఆరోగ్య ప్రదాయిని.
- టీస్పూన్ మెంతుల్లో 49 కేలరీల శక్తి లభిస్తుంది.



అడుగండి చెబుతా

ఈ ఎముక నొప్పి ఎందుకు?

నా వయసు 45 సంవత్సరాలు. గత నెల రోజులుగా కాళ్ల ఎముకల్లో రాత్రివేళల్లో నొప్పి ఎక్కువగా వస్తున్నది. డాక్టర్‌ను సంప్రదించి యాంటిబయాటిక్ మందులు తీసుకున్నాను. అయినా ఎటువంటి ఫలితం లేదు. నా సమస్యకు పరిష్కారం సూచించగలరు.

మురళీధర్ రెడ్డి, హుజురాబాద్

మీరు చెప్పిన వివరాలను బట్టి, రాత్రి సమయాల్లో ఎముక నొప్పి రావడం అనే లక్షణాలను బట్టి ఎముక క్యాన్సర్‌గా అనుమానించాల్సి ఉంటుంది. మామూలుగా ఎముక క్యాన్సర్లలో నొప్పితో గాని, నొప్పి లేకుండా గాని కణతులను గుర్తిస్తారు. మృదుకణజాలాన్ని క్యాన్సర్ సోకినప్పుడు కణితి నొప్పిగా ఉండకపోవచ్చు. గట్టిగా ఉంటే ఎముక కణజాలంలో క్యాన్సర్ ఉంటే మాత్రం నొప్పి, వాపు ముందుగా కనిపిస్తాయి.
చాలా సందర్భాల్లో ఎముకల్లో నొప్పి అనగానే మసాజ్ చేయిస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. మసాజ్ చెయ్యడం వల్ల రక్త సరఫరా పెరిగి క్యాన్సర్ కణాలు మరింత త్వరగా ఇతర భాగాలకు వ్యాప్తి చెందుతాయి. వాపు, నొప్పి కనిపించినపుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మీరు ముందుగా మీకు దగ్గరలో ఉన్న ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్‌ను కలిసి మీ సమస్యను నిర్ధారించుకోవడం అత్యవసరం అని గుర్తించండి.



డాక్టర్ ప్రవీణ్ మారెడ్డి
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం. మా అడ్రస్:
నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా (హెల్త్‌డెస్క్)
#8-2-3\1\7\8\9,
క్రిష్ణాపురం, రోడ్ నెం.10,
బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
health@ntdaily.news



పాతూరులో నయా రైతు బజార్

సిద్దిపేట జిల్లాలో జాతీయ రహదారి పక్కన సకల హంగులతో తొలి రైతు బజారు ఏర్పాటు

మంత్రి హరీశ్ చొరవతో తీరిన రైతు కష్టాలు.. తాజా కూరగాయలతో విక్రయాల జోరు

నెలకు సరాసరి కోటిన్నర మార్కెటింగ్

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ఇది పాతూరు కొత్త కథ! ఒకప్పుడు వానలకు తడిసి, ఎండకు ఎండి.. చలిని తట్టుకుని జాతీయ రహదారి పక్కన కూరగాయలు పెట్టుకుని అమ్ముకున్న రైతులు.. ఇప్పుడు అధునాతన హంగులతో ఏర్పాటుచేసిన ఆధునిక రైతుబజారులో దర్జాగా కూరగాయలు విక్రయిస్తున్నారు.

ఏరోజుకారోజు తాజా కూరగాయలు అమ్మే మార్కెట్ కావడంతో ఆ రహదారి మీదుగా వెళ్లేవారు సైతం వాహనాలు నిలిపి.. సంచి నిండా కూరగాయలు తీసుకుని వెళుతున్నారు! చక్కటి పార్కు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన వందకు పైగా స్టాళ్లతో కూడిన ఆ రైతు బజారు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజవర్గంలో రాజీవ్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న పాతూరు వద్ద ఉన్నది! రైతులు పడుతున్న కష్టాలను చూసి.. మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక చొరవ చేయడంతో గత నెల 26న ఏర్పాటైన ఈ అధునాతన రైతు బజారు.. నెలకు కోటిన్నర టర్నోవర్‌తో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది!

70 లక్షలతో నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై కూరగాయలు విక్రయించే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట అన్ని సౌకర్యాలతో రైతుబజార్లు నిర్మించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్–కరీంనగర్ రాజీవ్ రహదారిపై సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహించే గజ్వేల్ నియోజకవర్గంలోని పాతూరు వద్ద అధునాతన రైతు బజారు ఏర్పాటైంది. రైతులకు, కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా టాయిలెట్లు, క్యాంటీన్, గార్డెన్, పార్కింగ్, లాన్, రోడ్డు, పాత్‌వే నిర్మాణాలతో పాటు చిన్న పిల్లలు ఆడుకునే విధంగా ఆటస్థలం కూడా ఏర్పాటుచేశారు. రాత్రిపూట ఇబ్బంది లేకుండా మార్కెట్‌ను విద్యుత్ వెలుగులతో నింపారు. రాష్ట్రంలో ఈ తరహా రైతు బజార్లలో ఇదే మొదటిది.



సిద్దిపేట జిల్లాలోని పాతూరు రైతుబజార్‌లో తాజా కూరగాయల విక్రయాలు



మంచి సౌలత్ ఉంది

రైతుబజారులో మంచి సౌలత్‌లు ఉన్నాయి. ఇన్నాళ్లు రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునే వాళ్లం. ఇవాళ సీఎం సార్, మంత్రి హరీశ్‌రావు సార్‌లు మంచి సౌలత్‌లతోని దీన్ని నిర్మించిన్రు. మాకందరికీ సంతోషంగా ఉంది.

– శివలక్ష్మి (పాతూరు)



పొద్దుగాలనే వస్తాం

పొద్దుగాలనే రైతుబజారుకు వస్తాం. మా తోట్ల పండించిన కాయగూరలు తీసుకువచ్చి అమ్ముతాం. నేను ఇక్కడ కూరగాయలు అమ్మితే మా వాళ్లంతా అప్పటికప్పుడు కూరగాయలు తెంపుకొచ్చి, ఇక్కడ ఇచ్చిపోతారు.

– శివలక్ష్మి (పాతూరు)



సకల సౌకర్యాలతో పాతూరు రైతుబజారు

పాతూరు రైతుబజారును అన్ని వసతులతో నిర్మించారు. రోజురోజుకు వినియోగదారుల తాకిడి పెరుగుతున్నది. ప్రతి నెల ఇక్కడ సుమారు కోటిన్నర వరకు వ్యాపారం జరుగుతుంది.

– బీవీ రాహుల్
కార్యదర్శి, గజ్వేల్ మార్కెట్ కమిటీ



పాతూరు రైతుబజార్‌లో ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు (ఫైల్)



రైతుబజార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీరు



పిల్లలకు ఆటస్థలం

పదేండ్ల కష్టాలకు తెర

పాతూరు, పరిసర గ్రామాల రైతులు గత పదేండ్లుగా తాజా కూరగాయలు తీసుకువచ్చి రాజీవ్ రహదారి పక్కన పెట్టుకొని అమ్ముకునేవారు. మార్కెటింగ్ శాఖలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన మంత్రి హరీశ్‌రావు పాతూరు రైతుల కష్టాలను స్వయంగా చూశారు. వారితో మాట్లాడారు. విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. 'గడ' అభివృద్ధి నిధుల నుంచి రూ.30 లక్షలు, మార్కెటింగ్ శాఖద్వారా రూ.40 లక్షలు.. మొత్తం రూ.70 లక్షలతో పాతూరు రైతుబజారును ఎకరం నుంచి ఎకరంన్నర విస్తీర్ణంలో సకల సౌకర్యాలతో నిర్మించి, రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా నిలిపారు.

తాజా కూరగాయలు రెడీ

పాతూరు గ్రామంతోపాటు గజ్వేల్, ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, లింగరాజపేట, పాములపర్తి గ్రామాల రైతులు తాజా కూరగాయలు తీసుకొని ఉదయం ఏడు గంటలకే రైతుబజారుకు చేరుకుంటారు. రాత్రి 8 గంటల వరకు కూరగాయలు అమ్ముతారు. మహిళా రైతులంతా ఉదయం వచ్చి కూరగాయలు అమ్ముతుండగా వారి కుటుంబీకులు పొలాలకు వెళ్లి కూరగాయలు తెంపుకొని అప్పటికప్పుడు తీసుకువచ్చి రైతుబజారులో పెడుతుంటారు. రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి సిద్దిపేట, కరీంనగర్, మంచిర్యాల తదితర ప్రాంతాలకు వెళ్లే వారంతా ఇక్కడి రైతుబజారు వద్ద ఆగి.. తాజా కూరగాయలను కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వచ్చి వెళ్లేటప్పుడు ఏమాత్రం సమయం దొరికినా మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు రైతుబజారును సందర్శించి ఇంకేమైన సమస్యలు ఉన్నాయా? ఇంకేమైనా వసతులు కల్పించాలా? అని అడుగుతూ సమస్యలుంటే అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీజీవో అధ్యక్షురాలు మమత తదితరులు

సీపీఎస్‌ను రద్దు చేయాలి

తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ర్యాలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీజీవో, టీఎన్జీవో తదితర ఉద్యోగ సంఘాల జేఏసీ సారథ్యంలో నాంపల్లిలో గృహకల్ప నుంచి హైదరాబాద్ కలెక్టరేట్ వరకు ర్యాలీలు నిర్వహించారు. సీపీఎస్ కారణంగా రాష్ట్రంలో 1.25 లక్షల మంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గుండవరపు దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ శుక్రవారం సామూహిక సెలవు తీసుకోవాలని రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అసోసియేషన్ అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ సూచించారు. అదేరోజు తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ సారథ్యంలో అన్నిజిల్లా, మండలకేంద్రాల్లో భోజన విరామ ప్రదర్శనలు నిర్వహించాలని, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలుపాలని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, టీజీవో అధ్యక్షురాలు మమత కోరారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సామూహిక సెలవులకు పలు సంఘాల మద్దతు

సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న నిర్వహించనున్న సామూహిక సెలవు ఉద్యమానికి పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు పీ సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ కాలేజీ గెజిటెడ్ టీచర్ల సంఘం, టీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్, ఎస్టీయూటీఎస్ వంటి ఉపాధ్యాయ సంఘాలు కూడా వేర్వేరు ప్రకటనల్లో తమ మద్దతు తెలిపాయి. కాగా, సీపీఎస్ విధానం రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం జలసౌధలో భోజన విరామ ధర్నా చేపట్టనున్నట్టు ఇంజినీర్ జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఏఈఈ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

తహసీల్దార్లే సబ్ రిజిస్ట్రార్లు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లకు సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు కూడా అప్పగించనున్నది. మండల కార్యాలయాల్లో తహసీల్దార్లే ఇక నుంచి భూముల క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ చేసి, మ్యుటేషన్ చేయాల్సి ఉంటుంది. నూతన సంవత్సర కానుకగా రాష్ట్రవ్యాప్తంగా భూముల క్రయవిక్రయాలు చేసుకునే వారికి ఈ మేరకు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అంతా ఒక్కచోటనే పనులుపూర్తయ్యే విధానాన్ని ప్రభుత్వం అమలుచేయనున్నది. ఇందుకోసం మండల కార్యాలయాలను అభివృద్ధి చేస్తున్నారు. రికార్డులన్నీ కంప్యూటరైజ్ చేస్తారు. ఎక్కడా రికార్డుల ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు. ఇందుకోసం వెయ్యిమంది ఐటీ అధికారులను ప్రత్యేకంగా నియమించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందుగా ప్రతి ఏటా ఎన్ని భూములు రిజిస్ట్రేషన్ అవుతున్నాయన్నది కూడా సీఎం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున లక్ష వరకు భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నాయని గుర్తించారు. సగటున ఒక మండలంలో రోజుకు ఐదారుకన్నా ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరుగడం లేదు. ఈ క్రమంలో దీని కోసం మండల స్థాయిలో ప్రత్యేకంగా ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావించినట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇవి ఎక్కువగా పాత తాలుకా కేంద్రాలలో ఉన్నాయి. ఇవి కాక కొన్ని కొత్త సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కూడా ఏర్పాటయ్యాయి. ఈ కార్యాలయాలను ఇలాగే కొనసాగిస్తూ, మిగిలిన మండల కేంద్రాలలో తహసీల్దార్లకు భూములు రిజిస్ట్రేషన్ చేసే అధికారాలు అప్పగించనున్నట్టు తెలిసింది.

వర్సిటీల బలోపేతంపై దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని రకాల విశ్వవిద్యాలయాల బలోపేతంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి దృష్టి సారించింది. వర్సిటీల్లో అకడమిక్, ప్రవేశాల విధానంపై త్వరలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి భావిస్తున్నారు. వర్సిటీలవారీగా ఉన్న డిగ్రీ కళాశాలలతోపాటు పీజీ కాలేజీలు, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్ కాలేజీలకు ప్రతి ఏడాది ఇవ్వాల్సిన అఫిలియేషన్ ప్రక్రియను బలోపేతం చేయాలని యోచిస్తున్నారు. కొన్ని ప్రైవేటు వృత్తివిద్యా కాలేజీలు నిబంధనల ప్రకారం కొనసాగడంలేదని గుర్తించి, కాలేజీ భవన నిర్మాణాలు, అర్హులైన అధ్యాపకుల విషయంలో రాజీపడొద్దని నిర్ణయించారు. పలు వర్సిటీల్లోని డిగ్రీ, పీజీ కాలేజీల్లో మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షల్లో 30 శాతం ఫలితాలు కూడా నమోదు కావడంలేదు. కాకతీయ వర్సిటీలో 27 శాతమే ఉత్తీర్ణత నమోదైంది. వర్సిటీలవారీగా కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఎలాంటి విధానాలను అవలంబించాలనే అంశాలపై కొత్త కమిటీ అధ్యయనం చేయనున్నది. కాలేజీలవారీగా ఉన్న విద్యార్థుల వివరాల సేకరణ, గత ఐదేండ్లుగా నుంచి వర్సిటీలు, కళాశాలల్లో నమోదైన ప్రవేశాల సంఖ్య, ఉత్తీర్ణత శాతం వివరాలను సేకరించనున్నది. యూనివర్సిటీల వ్యవహారాలను పర్యవేక్షించడం కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వీ వెంకటరమణకు ప్రస్తుతం ఆ బాధ్యతలను అప్పగించారు.

సర్వహంగులతో మీడియా అకాడమీ


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ బహుళ అంతస్తుల భవన నిర్మాణం సర్వహంగులతో ని ర్మాణంకానున్నది. ఇందుకు అవసరమైన 15 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదలచేసిం ది. తెలంగాణ మీడియా అకాడమీ భవనం ఐదు అంతస్తులతో నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. పాత ప్రెస్ అకాడమీ స్థలంలోని వెయ్యి గజాల స్థలంలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విశాలమైన గదులతో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నారు. జర్నలిస్టులకు కావాల్సిన అన్ని హంగులతో భవనాన్ని డిజైన్ చేశారు. భవన డిజైన్‌కు తెలంగాణ దక్కన్ ఆర్కిటెక్చర్ పలు మా ర్పుచేర్పులు చేసి ఖరారుచేసింది. మార్పులతో కూడిన డిజైన్‌ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనుమతి కోసం సిద్ధంచేశారు. సీఎం ఆలోచనల మేరకే డిజైన్‌ను రూపొందించినట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే భవనం నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని రోడ్లు భవనాలశాఖ అధికారులు తెలిపారు.

విశాలమైన ఆడిటోరియం

తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో విశాలమైన ఆడిటోరియం నిర్మించనున్నారు. సెంట్రల్ ఏసీతో 350 మంది కూర్చొనేలా ఏర్పాటు చేస్తున్నారు. జర్నలిస్టుల సమావేశాలు, శిక్షణా తరగతులు నిర్వహించుకునేలా నిర్మాణం ఉంటుంది. జర్నలిస్టులకు కావాల్సిన సమాచారం కోసం లైబ్రరీ, ప్రత్యేక వసతి ఏర్పాట్లకు సంబంధించి నిర్మాణాలు కూడా చేపట్టనున్నారు. విశాలమైన పార్కింగ్ సౌకర్యంతోపాటు అకాడమీ ముందుభాగంలో కొంతభాగం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులకు వృత్తిపరమైన శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అనుగుణం గా కంప్యూటర్లతో ఆడియో, వీడియోతో ట్రైనింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవనంలోని విశాలమైన హాళ్లలో జర్నలిజానికి చెందిన ప్రముఖులు సురవరం ప్రతాప్‌రెడ్డి, ఒద్దిరాజు సోదరులు, కృష్ణసాయి ముదిరాజ్, నర్సింహారావు తదితరుల ఫొటోలను ఏర్పాటు చేయనున్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట

జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారు. మృతిచెందిన ఒక్కో జర్నలిస్టు కుటుంబానికి రూ.లక్ష చొప్పున 100 కుటుంబాలకు సాయం అందజేశారు. జనహిత అనే కార్యక్రమంతో సీఎం కేసీఆర్ చేతులమీదుగా 74 మంది జర్నలిస్టు కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కు లు అందించగా, 26 మందికి తెలంగాణ మీడియా అకాడమీ ద్వారా అందజేశారు. జర్నలిస్టులకు ఏడువేల హెల్త్‌కార్డులు ఇచ్చేందుకు సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో మొత్తం 16 వేల మంది జర్నలిస్టులకు ప్రభుత్వం అక్రెడిటేషన్ కార్డులు అందజేసింది. సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.1.78 కోట్లు బాధిత జర్నలిస్టు కుటుంబాలకు అందజేశారు.



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ బహుళ అంతస్తుల భవనం నమూనా



సీఎం కేసీఆర్ చొరవతోనే భవన నిర్మాణం: అల్లం నారాయణ

సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ మీడి యా కొత్త భవనం నిర్మాణానికి అంకురార్పణ జరుగుతున్నదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. 2015లో నిర్వహించిన మొదటి ప్రెస్ అకాడమీ పాలకమండలి సమావేశానికి సీఎం కేసీఆర్ హాజరైన సందర్భంగా.. అకాడమీకి అన్ని హంగులతో కూడిన బహుళఅంతస్తుల భవనం అవసరమని అభిప్రాయపడ్డారని అల్లం నారాయణ తెలిపారు. ఇరుకుగా ఉన్న ప్రెస్ అకాడమీ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలనే ఆయన చొరవమేరకు భవన నిర్మాణానికి రూ.15 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మీడియా అకాడమీ భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల జర్నలిస్ట్ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.

సొరియాసిస్‌కు ఆయుర్వేదమే పరిష్కారం

సలహా



ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం వల్ల పీల్చే గాలి, తీసుకునే ఆహారం ఏవీ ఆరోగ్యకరంగా ఉండడం లేదు. ఈ కాలుష్యం శరీర అంతర్భాగాలతో పాటు ఈ కలుషితాలు చర్మాన్ని కూడా రోగగ్రస్తం చేయకుండా వదిలిపెట్టవు. చర్మం మీద అక్కడక్కడ మచ్చలు ఏర్పడి విపరీతమైన దురద, మంటతో పాటు చేపపొలుసుల్లా చర్మం రాలిపోతుంది. దీన్ని సొరియాసిస్ అని అంటారు.

వ్యాధి మూలాలకు వైద్యం


రోజూ తీసుకునే కలుషిత ఆహార పానీయాల వల్ల శరీరంలో ఎన్నో రకాల వ్యర్థపదార్థాలు పేరుకుపోతాయి. వీటి వల్ల పలురకాల చర్మరోగాలతో పాటు సొరియాసిస్ వచ్చే అవకాశాలు కూడా ఎక్కువే. ఆయుర్వేదంలో ఈ సమస్యకు మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఎన్ని రకాల మందులు వాడినా శాశ్వత పరిష్కారం లభించని సొరియాసిస్ వంటి వ్యాధులకు ఆయుర్వేదం మంచి పరిష్కారాన్ని సూచిస్తుంది. ఈ వ్యాధి తగ్గిపోతుందనే ఆశ పెద్దగా ఉండదు. బాధ కాస్త ఉపశమిస్తే చాలు అని అనుకుంటారు. అలాంటి వారికి స్టెరాయిడ్స్ ఒక్కటే మార్గంగా కనిపిస్తాయి. కానీ ఆయుర్వేదంలో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న అవగాహన లేకపోవడం వల్లే ఇలా లక్షణాలు తగ్గించే చికిత్సలు చేయించుకుంటారు.

ఆయుర్వేద వైద్య విధానం మిగతా అన్ని వైద్య విధానాల కంటే చాలా భిన్నమైంది. వ్యాధికి మూలమైన అసలు కారణాలను పరిశీలించి, వాటిని సమూలంగా తొలిగించేందుకు కావాల్సిన వైద్యం ఇది. సొరియాసిస్ సమస్య చర్మం మీదే కనిపించినప్పటికీ అది ధాతువులను దెబ్బతీసేంత శక్తి కలిగి ఉంటుందని కూడా కొందరు అనుకుంటారు. నిజానికి సొరియాసిస్‌కు సప్త ధాతవులనే కాదు, సమస్త శరీర వ్యవస్థలనూ ధ్వంసం చేసే తత్వం ఉంటుంది. అలా ధాతువులు క్షీణిస్తూ వెళ్లే కొద్దీ శరీరంలో వాతం కూడా పెరిగిపోతుంది. దీంతో పిత్త, కఫాల్లోనూ తేడా వస్తుంది. చికిత్సలో ఒక్క వాతాన్ని సరిచేస్తే మిగిలిన పిత్త, కఫాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. అందుకే ఆయుర్వేదం వాత నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుంది.

ఆయుర్వేదమే మార్గం

పై పూతల వైద్యం ఎన్ని సంవత్సరాలు తీసుకున్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. వీటితో సొరియాసిస్‌ను ఏమాత్రం అదుపు చెయ్యడం కుదురదు. సొరియాసిస్‌కు కారణమైన విషపదార్థాలను ముందు పంచకర్మ చికిత్సల ద్వారా తొలిగించాలి. ఆ తర్వాత ధాతువుల్ని నివారించే ఔషధాలు కూడా ఇవ్వాలి. వమనం, విరేచన కర్మల ద్వారా శరీరంలోని మలినాలను తొలగిస్తే వాతం అప్పుడు నియంత్రణలోకి వస్తుంది. వాతం నియంత్రణలోకి రాగానే మిగతా పిత్త, కఫాలు కూడా అదుపులోకి వస్తాయి. అప్పుడే సొరియాసిస్ సమూలంగా తొలిగిపోతుంది. ఆయుర్వేదం ఎటువంటి సమస్యలకైనా పరిష్కారాన్ని సూచిస్తుంది. సొరియాసిస్‌ను సమూలంగా తగ్గించే ఒకే ఒక మార్గం ఆయుర్వేదం మాత్రమే.

డా. ఎన్. రామకృష్ణారెడ్డి
ఆర్‌కే ఆయుర్వేదిక్ అండ్ సొరియాసిస్ రీసెర్చ్ సెంటర్
హైదరాబాద్, హన్మకొండ
8886 922 245
8886 922 247



కీళ్ల నొప్పులకు జానువస్తి చికిత్స

ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడేవాళ్లలో ఎక్కువ మంది వయసు పైబడిన వాళ్లే ఉంటారు. మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ బొత్తిగా లేకపోవడం వంటివే ప్రధాన కారణంగా ఉంటున్నాయి. మోకాళ్ల నొప్పి కాస్త ఎక్కువగా అనిపిస్తే బామ్‌లు రాసుకుంటూ, పెయిన్ కిల్లర్లు వేసుకుంటూ తాత్కాలిక ఉపశమనాలతో సమాధాన పడుతారు. కొద్ది గంటలు అయిపోగానే నొప్పి మళ్లీ మొదలవుతుంది. ఎవరైనా కీళ్లనొప్పుల సమస్యను సమూలంగా తొలిగించుకోవాలంటే మాత్రం ఆయుర్వేదాన్ని ఆశ్రయించడమే మంచిది.

సంధివాతం అంటే..?

శరీరంలోని సమస్త కదలికలకు అవసరమైన వాతం అందరి శరీరంలోనూ సహజంగానే ఉంటుంది. అయితే ఈ వాతం ప్రకోపితమైనప్పుడు అంటే దాని సమతుల్యత కోల్పోయినప్పుడు మొదలయ్యేదే సంధివాతం లేదా ఆస్టియో ఆర్థరైటిస్. దీన్నే వాతం దూషితం కావడంగా పరిగణిస్తారు. సాధారణంగా కఫాన్ని వాతం దూషితం చేసినప్పుడే సంధివాతం మొదలవుతుంది. ఇలాంటప్పుడు కీళ్లు బిగుసుకుపోవడం, కదిలినప్పుడు శబ్దాలు రావడం, ముట్టుకున్నప్పుడు ఆ భాగం వేడిగా అనిపించడం, ఎరుపుదనం కలిగివుండడం, నిలబడినప్పుడు, కూర్చున్నప్పుడు నొప్పి అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటిని దూషిత లక్షణాలంటారు. కొంతమందిలో చాలాసేపు కూర్చున్న తరువాత గాని, పడుకొని లేచినప్పుడు గాని, వెంటనే లేచి నడువలేని పరిస్థితి ఏర్పడుతుంది. అయితే కాసేపు నడిచాక బిగుసుకుపోయిన భాగాలు సడలిపోయి, నడకలో కొంత సౌకర్యం ఏర్పడుతుంది. సంధివాతంలో ఇది ఒక ముఖ్య లక్షణంగా ఉంటుంది.

కీళ్లు.. రకాలు

కీళ్లను చల, స్థిర సంధులని రెండు భాగాలుగా విడదీయవచ్చు. కదిలే కీళ్లను చల సంధులనీ, కదలని కీళ్లను స్థిర సంధులనీ అంటారు. ఈ కదిలే చల సంధుల్లోనే కీళ్ల వాతం వస్తుంది. చల సంధుల్లోనే కీళ్ల వాతం రావడానికి శరీర భాగాలన్నింటినీ ఆవరించుకొని, కొన్ని పొరలు (మెంబ్రేన్‌లు) దెబ్బతినడమే కారణం. మొత్తంగా అష్టాధర కలలు (ఎనిమిది పొరలు) ఉంటాయి. వాటిలో శ్లేష్మధరా కల అనే ఒక పొర ఉంటుంది. దీన్నే సైనోవియల్ మెంబ్రేన్ అంటారు. ఈ సైనోవియల్ ఫ్లూయిడ్ కీళ్లు కదలడానికి తోడ్పడుతూ ఉంటుంది. కదిలే కీళ్లు సహజంగా శ్లేష్మం, సిరలు, కండరాలతో కూడుకొని ఉంటాయి. ఈ శ్లేష్మధరా కల వాత ప్రకోపంతో దూషింపబడినప్పుడు అది తన సహజస్థితిని కోల్పోతుంది. దీనివల్ల శరీరంలో ఆమం అంటే వ్యర్థ విష పదార్థాలు ఏర్పడుతాయి. ఫలితంగా కొన్ని సమస్యలు తలెత్తుతాయి. అందులో భాగంగా మోకాళ్ల నొప్పులు మొదలవుతాయి.

ఆహార, విహార లోపాలు..

ఆహార విషయాల్లో సరైన ఆహారం తీసుకోవడం, తీసుకున్న ఆహారం జీర్ణం కాకముందే మళ్లీ తినడం, పొడి ఆహారాన్ని తీసుకోవడం వంటి కారణాల వల్ల మనం తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణం కాకుండా, ఆమం అనే ఒక విషపదార్థం శరీరంలో ఏర్పడుతుంది. సరైన వేళకు నిద్రించకపోవడం, ఉదయం ఎక్కువ సమయం పడుకునే ఉండడం, రాత్రివేళ ఎక్కువ సమయం మేల్కొని ఉండడం, ఎక్కువ గంటలు కదులకుండా పనిచేసే వృత్తిలో ఉండడం, ఇటువంటి విహార కారణాల వల్ల మోకాళ్లలోని వాతం దూషించబడుతుంది. ఈ దూషిత వాతమే మోకాళ్ల నొప్పులకు కారణమవుతుంది.

ఆయుర్వేద చికిత్స

సలహా

సంధివాతం (కీళ్లనొప్పులు) ఏ కారణంగా మొదలైనా, వాత హర చికిత్సలు చేయడం ద్వారా ఆ సమస్యను తొలిగించవచ్చు. అయితే, అరిగిపోయిన కార్టిలేజ్ తిరిగి వృద్ధి చేయడం ద్వారా మాత్రమే ఈ సమస్య శాశ్వతంగా తొలిగిపోతుంది. అందుకుగాను ఆయుర్వేదంలో కొన్ని ప్రత్యేకమైన ఔషధయుక్త తైలాలతో చేసే జానువస్తి చికిత్స ఉంటుంది. దీనివల్ల మోకాళ్లలో అరిగిపోయిన భాగాలన్నీ తిరిగి వృద్ధి చెందుతాయి. తైలాలు, కొన్ని రకాల మాత్రల ద్వారా అరిగిపోయిన కార్టిలేజ్‌ను తిరిగి ఉద్ధరించే పూర్తి అవకాశం ఏర్పడుతుంది. వాస్తవానికి కార్టిలేజ్‌ను పునరుద్ధరించే శక్తి ఆయుర్వేద తైలాలకు మాత్రమే ఉంది. జానువస్తి చికిత్సలు ఎవరైనా చేయవచ్చు. కానీ ఆ సమయంలో కీళ్లలోకి పంపించే తైలం పాత్రే ఇక్కడ కీలకం. ఆ తైలం ఎంతో ప్రత్యేకమైనది. ప్రత్యేక తైలాలు, ప్రత్యేకమైన ఔషధాలతో మోకాళ్ల నొప్పులు సమూలంగా తొలిగిపోతాయి. ఆయుర్వేద వైద్యుల్ని సూచించిన చికిత్సలన్నీ క్రమం తప్పకుండా తీసుకుంటే, తిరిగి యుక్త వయసులోకి ప్రవేశించినంత ఆనందం, ఉత్సాహం కలుగుతాయి.

డా॥ టి.ఎల్. శ్రీనివాస్
సహజ ఆయుర్వేదిక్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్
9160 994 455
9160 994 456
హైదరాబాద్, హన్మకొండ, రాజమండ్రి, నెల్లూరు, విజయవాడ, అనంతపురం, జోగిపేట



దేశంలో భూకంప పరిశోధనా కార్యక్రమం

భూకంప పర్యవేక్షణ

- దేశంలో భూకంపాల పర్యవేక్షణకు భారత వాతావరణ విభాగం ప్రభుత్వానికి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తున్నది. ఈ విభాగం 1898లో కలకత్తాలో మొదటి భూకంప అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. భూకంపాలను త్వరితంగా లెక్కగట్టి వాటి సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర విభాగాలకు తెలియజేసి వాటి ద్వారా సమర్థవంతమైన రీతిలో సహాయ పునరావాస చర్యలను చేపట్టేందుకు కృషి చేయడం ఈ విభాగం ముఖ్య విధి.

భూకంప కార్యక్రమ కేంద్రం

- దేశంలోని భూకంపచర్యలను పర్యవేక్షించేందుకు భారత వాతావరణ విభాగాన్ని నెలకొల్పారు. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. ఇది సుదూర కేంద్రాల నుంచి VSAT మొదలైన సాధనాల ద్వారా తరంగరూపంలో సమాచారాన్ని సంగ్రహించి, విశ్లేషించి భూకంప సమాచారాన్ని వివిధ కేంద్ర, రాష్ట్ర విభాగాలకు పంపిస్తుంది.

నేషనల్ సిస్మాలాజికల్ నెట్‌వర్క్

- భారత వాతావరణ విభాగం దేశవ్యాప్తంగా నేషనల్ సిస్మాలాజికల్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తుంది. ఈ నెట్‌వర్క్‌లో దేశవ్యాప్తంగా 55 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటిలోని నాలుగు కేంద్రాలు భాక్రా మేనేజ్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై అధ్యయనం చేస్తున్నాయి. ఈ 55 అధ్యయన కేంద్రాలు అత్యాధునికమైన బ్రాడ్‌బ్యాండ్ సెన్సర్లు, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్, కాల అనుసంధానిత సౌకర్యాలు కలిగి సుదూర ప్రాంతాల నుంచి సమాచారాన్ని పొంది విశ్లేషించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో భూ కదలికల అధ్యయనం కోసం భారత వాతావరణ విభాగం 16 స్టేషన్ల ఆధారిత డిజిటల్ భూ కదలికల టెలిమెట్రో వ్యవస్థను నిర్వహిస్తుంది.

జాతీయ భూకంప పరిశోధనా బులెటిన్

- భూకంప పరిశోధనా విభాగం ప్రతి నెలా భూకంప ప్రాంతాలకు సంబంధించిన, విశ్లేషించిన సమాచారాన్ని ఒక బులెటిన్ రూపంలో వెలువరిస్తుంది.
- భారత్ అంతర్జాతీయ భూకంప పరిశోధనా కేంద్రం యూకేలో సభ్య దేశం.
- ఇందులో భాగంగా భారత భూకంప పరిశోధన విభాగం ప్రచురించే బులెటిన్ భూకంప పరిశోధన కేంద్రం కిందికి వస్తుంది.
- ఈ రకమైన వ్యవస్థ ద్వారా మొత్తం భౌగోళికంగా అందుబాటులో ఉన్న భూకంప, భూకదలిక సమాచారాన్ని పొంది మన దేశానికి ఉపయోగపడే విశ్లేషణను జరుపుతున్నది.



నేషనల్ సిస్మాలాజికల్ డేటాబేస్ కేంద్రం

- ఇది న్యూఢిల్లీలో ఉన్నది. అన్ని నెట్‌వర్క్ స్టేషన్ల నుంచి పొందిన సమాచారాన్ని జాతీయం చేయడం, విశ్లేషించడం, ఒక పద్ధతిలో నిక్షేపపర్చడం దీని విధి. ఈ సమాచారాన్ని వివిధ వ్యవస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు పొంది వినియోగిస్తున్నాయి. తద్వారా భూకంప సమయంలో చేయాల్సిన కార్యక్రమాలను రూపొందించుకుంటాయి.
- భారత వాతావరణ విభాగం, భూకంప పరిశోధనా విభాగం రష్యా, మెక్సికో, ఐస్‌లాండ్ తదితర దేశాలతో భూకంప సమాచారాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకుంటాయి. ఇందులో భాగంగా 2003లో ఇండో-రష్యా భూకంప పరిశోధనా కేంద్రాన్ని ఢిల్లీలోని భారత వాతావరణ విభాగం ప్రాంగణంలో నెలకొల్పారు.
- అంతేకాకుండా భూకంప పరిశోధన కోసం భారత భూకంప పరిశోధనా విభాగం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కలిసి రాష్ట్ర విభాగాల అధికారుల శిక్షణా కార్యక్రమాలను, వర్క్‌షాపులను నిర్వహిస్తున్నది.

భారత జాతీయ సముద్ర సేవా కేంద్రం

- 2004 డిసెంబర్ 26న ఏర్పడిన సునామీని సృష్టించిన అత్యంత విధ్వంసకర గ్రేట్ సుమత్రా భూకంపం తర్వాత భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను ఊహించి వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, భారత ప్రభుత్వం హైదరాబాద్ భారత జాతీయ సముద్ర సమాచార సేవా కేంద్రంలో భారత సునామీ ముందస్తు హెచ్చరికా కేంద్రాన్ని ఏర్పరిచింది.
- ఇందులో భాగంగా 17 స్టేషన్లు వాస్తవ స్థితి భూకంప పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను భారత వాతావరణ విభాగం ఏర్పరిచినది.

వేళ్లూనుకున్న బ్రిటిష్ పాలన


భారతదేశ చరిత్ర

గ్రూప్-1 ప్రత్యేకం



- **లార్డ్ వెల్లస్లీ (1798- 1805):** ఇతని కాలంలో భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన విస్తృతంగా విస్తరించింది. అప్పటి వరకు బ్రిటిష్ వాళ్లు భారతదేశంలో తాము సాధించిన ఫలితాలను సాధన సంపత్తిని సుస్థిర పర్చుకొనే వైఖరిని అవలంబించారు. ప్రధానంగా స్వదేశ రాజ్యాలతో శత్రుత్వం పెట్టుకోకుండా తేలికగా భారత భూభాగాన్ని కలుపుకోగలిగిన మేరకు ఆ ప్రయత్నం సాగించారు. లార్డ్ వెల్లస్లీ ఆ మొహమాటాలేమి లేకుండా సాధ్యమైనంత వరకు వీలైనన్ని ఎక్కువ స్వదేశ రాజ్యాలను బ్రిటిష్ ఆధిపత్యం కిందికి తీసుకురావాలని నిర్ణయించాడు. ఆ విధంగా తేవడానికి సమయం అనుకూలంగా ఉందని గుర్తించాడు. 1797 నాటికి బలీయమైన రాజ్యాలైన మహారాష్ట్ర, మైసూరు బలాలు క్షీణించిపోయాయి. మూడో ఆంగ్ల కర్ణాటక యుద్ధంతో మైసూరు గత వైభవం అవశేషంగా మిగిలిపోయింది. అంతఃకలహాలు, అంతర్యుద్ధాల్లో మునిగితేలుతూ మహారాష్ట్రులు బలహీనులైపోయారు. మరో మాటలో భారతదేశంలోని రాజకీయ పరిస్థితులు బ్రిటిష్ విస్తరణ విధానానికి అనుకూలంగా ఉన్నాయి.
- ఇలాంటి పరిస్థితుల్లో వెల్లస్లీ టిప్పు సుల్తాన్‌పై యుద్ధం చేయదలిచి నిజాం, మహారాష్ట్రులతో సంధి కుదుర్చుకున్నాడు. స్వయంగా మద్రాస్ చేరి మైసూర్‌పై దండయాత్రకు సిద్ధమయ్యాడు. తూర్పు పడమరల వైపు నుంచి మైసూరు ప్రమాదం ఎదుర్కొన్నది. జనరల్ స్టువర్ట్ నాయకత్వం కింద బొంబాయి నుంచి ఒక సైన్యం, మద్రాస్ నుంచి జనరల్ హారిస్ నాయకత్వంలో మరొక సైన్యం వెల్లస్లీకి సహాయంగా వెళ్లాయి. బ్రిటిష్ సైన్యం 1799లో టిప్పును ఓడించాయి. అయినా అతను సంధిని వేడుకోలేదు. 'మితం లేని మడ్డి వెధవల మీద ఆధారపడి హీనమైన బతుకు బతుకడం కంటే పౌరుడిగా మరణించడం మేలని' భావించాడు. తన రాజధాని శ్రీరంగ పట్టణాన్ని రక్షించుకొనే ప్రయత్నంలో 1799 మే 4న మరణించాడు. టిప్పు రాజ్యాన్ని బ్రిటిష్, నైజాం నవాబు పంచుకున్నారు.
- టిప్పు సుల్తాన్ మరణానంతరం మహారాష్ట్రులు ఒక్కరు మాత్రమే బ్రిటిష్ వారికి ప్రధాన శత్రువులుగా మిగిలారు. దాదాపు ఐదుగురు మహారాష్ట్ర నాయకులు సంఘటితంగా నిలిచారు. పీష్వా, బరోడా గైక్వాడ్, గ్వాలియర్ సింధియా, ఇండోర్ హోల్కర్, నాగపూర్ భోంస్లే. ఈ మరాఠా కూటమికి నాయకుడు పీష్వా. కానీ, 18వ శతాబ్దాంతానికి మహారాష్ట్రుల్లో నాయకత్వం విషయమై పోటీ ఏర్పడింది. . పీష్వా రెండో బాజీరావును, యశ్వంత్‌రావు హోల్కర్, దౌలత్‌రావ్ సింధియాలు ఎదురించారు. బాజీరావు బేసిన్‌కు పారిపోయి బ్రిటిష్ వారి సహాయాన్ని అర్థించాడు. ఈ విధంగా మహారాష్ట్రుల్లో అంతఃకలహాలు ఏర్పడటంతో వెల్లస్లీ వాటిని ఆసరాగా తీసుకొని వారిని ఒక్కొక్కరిని ఓడించాడు. సింధియా, భోంస్లే సైన్యాలను అస్సామీ యుద్ధంలో 1803లో ఓడించారు. వారు తమ ఆధీనంలోని అనేక ప్రాంతాలను బ్రిటిష్ వారికి అప్పజెప్పారు. అహ్మద్‌నగర్, బ్రోచ్, గంగా-యమునాల మధ్య ప్రాంతం కటక్, బాలసోర్ మొదలైన ప్రాంతాలన్నీ బ్రిటిష్ వారికి దక్కాయి. రెండో మరాఠా యుద్ధం మహారాష్ట్రుల అధికారానికి పెద్ద దెబ్బగా పరిణమించింది. దీంతో వెల్లస్లీ సైన్య సహకార పద్ధతికి అంగీకరించమని హోల్కర్‌ను కోరాడు. దానికి నిరాకరించిన కారణంగా 1804లో హోల్కర్‌పై యుద్ధం ప్రకటించాడు. ఆ విధంగా మూడో మరాఠా యుద్ధం ప్రారంభమైంది. అయితే, 1805లో వెల్లస్లీ స్వదేశానికి వెళ్లడంతో హోల్కర్ అధికారం పూర్తిగా విచ్ఛిన్నం కాలేదు. 1806లో రాజ్‌ఘాట్ సంధి వల్ల హోల్కర్‌తో శాంతి ఒప్పందం కుదిరింది.
- **సైన్య సహకార పద్ధతి(1798):** గవర్నర్ జనరల్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్యసహకార పద్ధతి ప్రసిద్ధి చెందింది. భారతదేశంలోని స్వదేశీ రాజ్యాలను బ్రిటిష్ వారి అధికారానికిలోను చేయడం ఈ పద్ధతి ప్రధాన ఉద్దేశం. సైన్య సహకార పద్ధతి ప్రకారం దానిని అనుసరించిన స్థానిక రాజ్యాలు తమ విదేశీ వ్యవహారాలను బ్రిటిష్ వారికి అప్పజెప్పాలి. యుద్ధాలు ప్రకటించడం నిషేధించబడింది. ఇతర రాజ్యాలతో సంప్రదింపులు జరుపడానికి కంపెనీ అనుమతి పొందాలి. పెద్ద పెద్ద స్వదేశీ రాజ్యాలు కంపెనీ ఏర్పాటు చేసే సైన్యాల ఖర్చు కోసం కొంత భూభాగాన్ని ఇవ్వాలి. చిన్న రాజ్యాలు ఏటా కొంత ధనాన్ని ఇవ్వాలి. సంస్థానాధీశులు బ్రిటిష్ రెసిడెంట్‌ను స్వీకరించాలి. వారు ఏ ఇతర ఐరోపా వారిని తమ రాజ్యంలో నియమించరాదు. అయితే, వారి అంతరంగిక విషయాల్లో జోక్యం కల్పించుకొనదని వారికి తగిన రక్షణ కల్పించేటట్లు కంపెనీ వాగ్దానం చేసింది. ఈ సైన్య సహకార పద్ధతిలో మొట్టమొదట చేరిన స్వదేశీ రాజ్యం హైదరాబాద్ రాజ్యం.
- హిందూ దేశంలో బ్రిటిషు వారి అధికార విస్తరణకు సైన్య సహకార పద్ధతి దోహదం చేసింది. స్థానిక రాజ్యాల్లోని సైన్యాలు రద్దయ్యాయి. రాజులపై బ్రిటిష్ అధికారం స్థాపించబడింది. స్వదేశీ రాజుల వ్యయంతో బ్రిటిష్ కంపెనీ పెద్ద సైన్యాన్ని రూపొందించకలిగింది. ఫ్రెంచ్ వారి అధికారం భారతదేశంలో పెరుగకుండా చేయడానికి సైన్య సహకార పద్ధతిని వినియోగించారు. స్వదేశీ రాజుల అంతఃకలహాలకు కంపెనీ ప్రభుత్వం మధ్యవర్తి అయింది. అనేక ప్రాంతాలు సర్వ అధికారాలతో బ్రిటిష్ వారికి సంక్రమించాయి. కానీ, ఈ సైన్య సహకార పద్ధతితో స్థానిక రాజుల స్వాతంత్ర్యం పూర్తిగా నశించింది. బ్రిటిష్ రెసిడెంట్లు స్వదేశీ రాజ్యాల అంతరంగిక విషయాలలో జోక్యం కల్పించుకుంటూ పరిపాలనా విషయాల్లో తలదూర్చుతూ స్థానిక రాజులకు కంటకప్రాయమయ్యారు. స్థానిక సైన్యాలు రద్దయిన కారణంగా సైనిక విద్యలు నేర్చి నిరుద్యోగులైన సైనికులు దొంగతనాలు, దోపిడీలకు దిగి ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ అరాచకానికి కారకులయ్యారు. సైన్య సహకార పద్ధతికి అంగీకరించిన ముఖ్యమైన రాజ్యాలు హైదరాబాద్ నిజాం, తంజావూరు రాజు, అయోధ్య నవాబు, పీష్వా, ఆర్కాట్, సింధియా, బీరార్, రాజపుత్ర రాజ్యాలు జోధ్‌పూర్, జైపూర్, భరత్‌పూర్ మొదలైనవి.
- **లార్డ్ హేస్టింగ్స్ (1813-1823) :** వెల్లస్లీ తర్వాత 1813 వరకు కంపెనీ ప్రభుత్వం స్థానిక రాజుల విషయాల్లో జోక్యం కల్పించుకోలేదు. ఎప్పుడైతే లార్డ్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా నియమించబడ్డాడో కంపెనీ స్థానిక రాజుల విషయాల్లో జోక్యం చేసుకోవటం మొదలుపెట్టింది. హేస్టింగ్స్ 1816లో నేపాల్‌కు చెందిన గుర్ఖాలను శక్తివంతంగా అణచివేసి సగౌలి సంధిని కుదుర్చుకున్నాడు. 1817లో మహారాష్ట్రులు తాము కోల్పోయిన అధికారాన్ని పొందడానికి ప్రయత్నించారు. పీష్వా మరాఠా నాయకులను సమాఖ్యగా ఏర్పర్చి నవంబర్‌లో పుణెలోని బ్రిటిష్ రెసిడెంట్‌ను ఎదురించాడు. మరాఠా సైన్యాలు ఓడిపోయి అందరు నాయకులు తమ భూప్రాంతాలను పోగొట్టుకున్నారు. పీష్వా పదవి రద్దు అయ్యింది. అప్పటి పీష్వా బాజీరావుకు ఏటా రూ. 8 లక్షలు భరణంగా ఇచ్చారు. హోల్కర్, భోంస్లే బ్రిటిష్ వారి సైన్యాలను స్వీకరించాల్సి వచ్చింది. మహారాష్ట్రుల అధికారం పూర్తిగా అణచబడింది. వారు తిరిగి తలెత్తుకోలేకపోయారు.
- **డల్హౌసీ రాజ్య సంక్రమణ సిద్ధాంతం : 1848-1856** మధ్యకాలంలో గవర్నర్ జనరల్‌గా పనిచేసిన డల్హౌసీ పరిపాలనా కాలం ప్రధానమైంది. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవ్యాప్తికి అతడు మిక్కిలి కృషి చేశాడు. స్థానిక రాజ్యాలను ఆక్రమించుకోవడానికి ఆవగింజ మాత్రం అవకాశం ఉన్నా దాన్ని జారవిడువని వాడు డల్హౌసీ. స్వదేశీ సంస్థానాధీశులను తొలగించి భారతదేశాన్ని పూర్తిగా బ్రిటిష్ ప్రభుత్వం కిందకు తేవడానికి కృషి చేశారు. డల్హౌసీ రెండు ప్రధాన యుద్ధాలను కొనసాగించాడు. అవి రెండో శిక్కు యుద్ధం, రెండో బర్మా యుద్ధం. ఈ రెండు యుద్ధాల వల్ల, అధిక ప్రాంతం లభించడమే కాక, వ్యాపారాభివృద్ధికి కూడా సాధ్యమైంది. సిక్కింపై ఒక్క దండయాత్ర గావించి హెచ్చు ప్రాంతాన్ని స్వాధీనపరుచుకున్నాడు. 1856లో అయోధ్యను ఆక్రమించుకున్నాడు. మొగల్ చక్రవర్తికి భరణాన్ని రద్దు చేశాడు. ఆర్కాట్ నవాబు బిరుదు తొలగించాడు. డార్జిలింగ్ రాజుకు చెల్లిస్తూ వచ్చిన అద్దెను నిలుపుదల చేశాడు. కప్పం సరిగ్గా చెల్లించలేదనే నెపంతో, అతి సారవంతమైన బీరార్ రాష్ట్రాన్ని, హైదరాబాద్ నిజాం నుంచి ఆక్రమించుకున్నాడు. కానీ డల్హౌసీ ఆక్రమణలు తన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని అమలుపర్చినందున సాధ్యమైనవి. ఈ సిద్ధాంతం ప్రకారం సంస్థానాధీశులకు పుత్రులు లేని సందర్భాన ఆ రాజ్యాలు దత్త కుమారులకుగాక బ్రిటిష్ కంపెనీకి చెందుతాయి. దీనికి దత్తత స్వీకార రద్దు చట్టమని కూడా పేరు. డల్హౌసీ ఈ సిద్ధాంతం ప్రవేశపెట్టిన ఆ సమయంలో అనేక స్వదేశీ సంస్థానాధీశులు కుమారులు లేకుండా మరణించిన కారణంగా బ్రిటిష్ అధికారం వడిగా వ్యాప్తి చెందింది. 1848లో సతారాను, 1849లో జైపూర్, సంబాల్‌పూర్, 1850 భగత్స్, 1852లో ఉదయ్‌పూర్, 1853లో ఝాన్సీ, 1854లో నాగ్‌పూర్‌లను బ్రిటిష్ సామ్రాజ్యంలో కలిపివేశాడు. ఈవిధంగా డల్హౌసీ తన సిద్ధాంతాన్ని అమలుపర్చడంలో హిందూమత భావాలను గాయపరుస్తున్నట్లుగా కానీ, భారతీయ సాంప్రదాయాలను అగౌరవపరుస్తున్నట్లు కానీ గుర్తించలేదు. అతని ఈ ఆక్రమణలు, ప్రభువులందు, ప్రజలందు కల్పించిన ఆందోళన అనుమానం తర్వాత 1857లో జరిగిన తిరుగుబాటుకు ఎంతైనా కారణవచ్చు.

1857 వరకు బ్రిటిష్ పరిపాలన, ఆర్థిక విధానం



- **రెగ్యులేటింగ్ చట్టం, 1773 :** భారతదేశంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ నిర్వర్తించాల్సిన రాజకీయ బాధ్యతలను నిర్వచించడానికి, దాన్ని ప్రభుత్వ అదుపులో ఉంచడానికి బ్రిటిష్ పార్లమెంట్ 1772లో రెగ్యులేటింగ్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం కంపెనీ పాలకవర్గమైన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నియామకంలో మార్పులయ్యాయి. వారు ప్రభుత్వ ఆధీనానికి తెచ్చారు. బెంగాల్ గవర్నర్ జనరల్‌గా వ్యవహరించబడ్డాడు. అతని కౌన్సిల్‌లో నలుగురు సభ్యులు ఉంటారు. మద్రాస్, బొంబాయి రాష్ట్రాలు గవర్నర్ జనరల్ అధికారానికి లోను చేయబడ్డాయి. కలకత్తాలో ఒక సుప్రీంకోర్టు స్థాపితమైంది. ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులు నియమితమయ్యారు. ఉన్నతాధికారులందరి వార్షిక జీతభత్యాలు నిర్ణయించారు. అయితే రెగ్యులేటింగ్ చట్టం అనేక విషయాల్లో అసంపూర్ణమైన చట్టమని చెప్పవచ్చు. భారతదేశంలోని పాలనాధికారాన్ని అటు కంపెనీకానీ, ఇటు బ్రిటిష్ ప్రభుత్వంకానీ పూర్తిగా స్వీకరించలేదు. ఈ చట్టం మూలంగా సమర్థవంతమైన పాలన ఏర్పాటు జరగలేదు. గవర్నర్ జనరల్ అధికారాలు ఇతమిత్థంగా సూచించలేదు. కాబట్టి రెగ్యులేటింగ్ చట్టం కంపెనీ వ్యవహారాలను అనుకున్నవిధంగా క్రమబద్ధం చేయలేకపోయింది. ఈ లోపాలు వెంటనే తెలియవచ్చాయి.
- **పిట్ ఇండియా చట్టం 1784 :** బ్రిటిష్ ప్రధానమంత్రి అయిన విలియంపిట్, రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలు తొలగించడానికి ఒక ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టాడు. ఇది 1784లో పిట్ ఇండియా చట్టమనే పేరుతో అమలైంది. కొత్త చట్టం కంపెనీ డైరెక్టర్ల అధికారాలన్నింటిని హరించింది. కంపెనీ పరిపాలనా విషయాల్లో బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎక్కువ అధికారాలు సంక్రమించాయి. ఆరుగురు కమిషనర్లతో కూడిన 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' స్థాపించారు. భారతదేశంలో పరిపాలనా విషయాల్లో ఈ బోర్డు అత్యున్నత స్థానాన్ని ఆక్రమించింది. గవర్నర్ జనరల్‌కు ఇతర గవర్నర్లపై పూర్తి అధికారం ఇచ్చారు. అతని కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్య నాలుగు నుంచి మూడుకు కుదించారు. కంపెనీ వ్యాపారంపై గుత్తాధికారం కొనసాగించిందికానీ పరిపాలనాధికారాలు కోల్పోయింది. 1813లో చార్టర్ చట్టం మూలంగా ఆ వ్యాపారాధికారం కూడా తొలగించబడింది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ నిజానికి పరిపాలనను పర్యవేక్షించింది.

సాపాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492 575 006



రాజ్యాంగ సవరణలు

44వ రాజ్యాంగ సవరణ చట్టం(1978)

- ఈ చట్టాన్ని 1978లో చేశారు. ఇదులో కొన్ని అంశాలను 1978, జూన్ 20న, మరి కొన్ని అంశాలు ఆగస్టు 1న, సెప్టెంబర్ 6న అమల్లోకి వచ్చాయి.
- ఈ చ్టటం ద్వారా రాజ్యాంగంలోని 19, 22, 30, 31ఏ, 31సీ, 38, 74, 77, 83, 105, 123, 132, 133, 134, 139ఏ, 150, 166, 172, 194, 213, 217, 225, 226, 227, 239బీ, 329, 352, 356, 358, 359, 360, 371ఎఫ్, 71(సబ్), 103 (సబ్), 192 (సబ్) ప్రకరణలను, వీటితో పాటు 9వ షెడ్యూల్‌ను సవరించారు.
- 134ఏ, 300ఏ, 361ఏ ప్రకరణలను కొత్తగా చేర్చడంతోపాటు 12వ భాగంలో 4వ చాప్టర్‌ను పొందుపర్చారు.
- 31, 257ఏ, 329ఏ ఆర్టికల్స్‌ను, రాజ్యాంగంలోని 30వ ప్రకరణ తర్వాత ఆస్తిహక్కు అనే సబ్‌హెడింగ్‌ను తొలగించారు.
- ప్రకరణ 22ను సవరించడం ద్వారా నివారక నిర్బంధానికి సంబంధించి కొన్ని రక్షణలు కల్పించారు. అవి..
- సలహాసంఘం అనుమతి లేకుండా నివారక నిర్బంధంలో ఉన్న వ్యక్తి అత్యధిక నిర్బంధ కాలాన్ని మూడు నుంచి రెండు నెలలకు తగ్గించారు.
- సలహా సంఘంలో అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులు ఉండాలి. అధ్యక్షుడిగా హైకోర్టు జడ్జి, సభ్యులుగా పదవీ విరమణ చేసిన, పదవిలో ఉన్న జడ్జిలు ఉండాలి.
- రెండు నెలలు దాటిన నివారక నిర్బంధానికి తప్పకుండా సలహా సంఘం అనుమతి తీసుకోవాలి.
- రాజ్యాంగ యంత్రాంగం విఫలమైతే రాష్ట్రపతిపాలనను ఆరునెలల కన్నా ఎక్కువ అమలు చేయకూడదు. అయితే 365కు ఒక కొత్త క్లాజును చేర్చారు. దీంతో జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు ఏడాదిపైన ప్రతిసారి పొడిగించవచ్చు, ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు వీలుకాదని ధ్రువీకరించినప్పుడు రాష్ట్రపతి పాలన పొడించడానికి అవకాశం కల్పించారు.
- ఆరేండ్లకు పెంచిన పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల కాలపరిమితిని 42వ సవరణ ద్వారా ఐదేండ్లకు తగ్గించారు. రాష్ట్ర శాసనసభల్లో కోరమ్ పునరుద్ధరించారు. ప్రకరణలు 105, 194లను సవరించి హౌస్ ఆఫ్ కామన్స్ అనే పదాన్ని తీసివేశారు.
- 74వ ప్రకరణలోని నిబంధనలను అలాగే ఉంచి దానికి మరి కొన్ని కొత్త అంశాలను చేర్చారు. దీనిప్రకారం మంత్రిమండలి పంపిన సిఫారసులను రాష్ట్రపతికి కేవలం పునఃపరిశీలనకు పంపే హక్కును మాత్రమే కల్పించారు.



- ప్రకరణలు 132, 134లను సవరించి 134ఏ అనే కొత్త ప్రకరణను చేర్చారు. సత్వర న్యాయమందేలా జడ్జిమెంట్ లేదా తుది తీర్పు తర్వాత సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవడానికి హైకోర్టు అనుమతివ్వాలి.
- 42వ సవరణ ద్వారా హైకోర్టులకు కల్పించిన రెవెన్యూ అధికారాలను తొలగించారు. దీంతో ట్రిబ్యునళ్లపై హైకోర్టులకు ఉండే పర్యవేక్షణాధికారం మళ్లీ లభించింది.
- ఈ సవరణ ద్వారా ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించి 19(1-ఎఫ్), 31వ ప్రకరణలను రద్దు చేశారు. ఆస్తిహక్కును 12వ భాగంలో ప్రకరణ 300-ఏలో కేవలం చట్టబద్ధమైన హక్కుగా చేర్చారు.
- ఈ సవరణ ద్వారా 352ను సవరించారు. దీని ద్వారా అంతర్గత అశాంతి (Internal disturbances) అనే పదాన్ని తొలగించి సాయుధ తిరుగుబాటు (Armed Rebellion) అనే పదాన్ని చేర్చారు.
- అత్యవసర పరిస్థితి ప్రకటన, క్యాబినెట్ రాతపూర్వక సిఫారసు ద్వారా మాత్రమే విధించాలని ఈ సవరణ సూచిస్తుంది. అంటే ప్రధానమంత్రి సిఫారసుపై కాకుండా మంత్రివర్గ (కేబినెట్ అనే పదం అంతకుముందు రాజ్యాంగంలో లేదు. ఈ సవవరణ ద్వారానే ఆ పదాన్ని మొదటిసారిగా చేర్చారు) సిఫారసుపై మాత్రమే రాష్ట్రపతి అత్యవసర పరిస్థితిని ప్రకటించాలి.
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన మొదటి ఆరు నెలల తర్వాత ప్రతి ఆరు నెలల పొడగింపునకు పార్లమెంటు అనుమతి తప్పక ఉండాలి. అయితే ఎమర్జెన్సీ విధించిన నెలలోపు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీతో ఆమోదం పొందాలి. గతంలో (44వ సవరణకు ముందు) దీన్ని సాధారణ మెజారిటీతో ఆమోదించాల్సి ఉండేది.
- ఈ సవరణ ద్వారా 358వ ప్రకరణను సవరించారు. దీంతో 19వ ప్రకరణలోని ఆరు రకాల స్వేచ్ఛలు బాహ్యదాడుల సందర్భంలోనే రద్దవుతాయి. కాని అంతర్గత సాయుధ తిరుగుబాటు విషయంలో రద్దు కావు.
- అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు ప్రాణరక్షణ హక్కు, స్వేచ్ఛా హక్కు రద్దు చేయకూడదని 359వ ప్రకరణలో క్లాజ్ (1); (1a)లను సవరించారు.

45వ సవరణ చట్టం

- దీన్ని 1980, జనవరి 25న చేశారు. దీనిద్వారా ప్రకరణ 334ను సవరించారు.
- ఈ సరవణ ద్వారా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, ఆంగ్లో ఇండియన్లకు ప్రాతినిధ్యం కల్పించే విధానాన్ని మరో పదేండ్లపాటు అంటే 1990 వరకు పెంచారు.

46వ సవరణ చట్టం

- ఈ చట్టాన్ని 1982లో చేశారు. 1983, ఫిబ్రవరి 2 నుంచి అమల్లోకి వచ్చింది.
- దీనిద్వారా 269, 286, 366 ప్రకరణలను, 7వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల రాబడిని పెంచడానికి వాణిజ్య పన్నుద్వారా వచ్చే ఆదాయం మరింత పెరగడానికి ఈ సవరణ వీలుకల్పిస్తుంది.
- ప్రకరణ 269 సవరించడం ద్వారా అంతర్‌రాష్ట్ర వాణిజ్యం, వర్తకంపై విధించిన పన్ను రాష్ట్రాలకే చెందుతుంది.
- కేంద్రం, అంతర్‌రాష్ట్ర వస్తు రవాణాపై పన్ను విధించేలా 9వ షెడ్యూల్ జాబితా-1లో 92(బీ) అనే కొత్త అంశాన్ని చేర్చారు.

47వ రాజ్యాంగ సవరణ

- ఈ చట్టం 1984, ఆగస్టు 26న అమల్లోకి వచ్చింది. దీనిద్వారా 9వ షెడ్యూల్‌ను సవరించారు.
- ఈ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో రాష్ట్రాలకు చెందిన 14 భూ సంస్కరణ చట్టాలను చేర్చారు. దీంతో మొత్తం 9వ షెడ్యూల్‌లోని చట్టాల సంఖ్య 202కు పెరిగింది.

48వ సవరణ చట్టం

- ఈ చట్టాన్ని 1984లో చేయగా, 1984, ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చింది. దీనిద్వారా 356వ ప్రకరణను సవరించారు.
- ప్రకరణ 356కు క్లాజ్5ను చేర్చారు. దీంతో పంజాబ్‌లో రాష్ట్రపతి పాలనను మరో రెండేండ్లు పొడిగించారు.

49వ సవరణ చట్టం

- ఈ చట్టం 1984, సెప్టెంబర్ 11న అమల్లోకి వచ్చింది. దీని ద్వారా ప్రకరణ 244ను, 5, 6 షెడ్యూళ్లను సవరించారు.
- త్రిపురలోని గిరిజనుల అభివృద్ధికోసం స్వయంపాలిత జిల్లా కౌన్సిల్‌కు రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించారు.

50వ సవరణ చట్టం

- ఈ చట్టం 1984, సెప్టెంబర్ 11న అమల్లోకి వచ్చింది. దీని ద్వారా ప్రకరణ 33(Sub)ను సవరించారు.
- దీనిద్వారా సాయుధదళాల ప్రాథమికహక్కులను నియంత్రించే అధికారం పార్లమెంటుకు కల్పించారు. ఇది రాష్ట్రాల ఆస్తులను కాపాడే సాయుధ దళాలు, రహస్య సమాచార సేకరణ సాయుధ దళాలు, రక్షక దళాలు, వాటికి సంబంధించిన బ్యూరోలు, వ్యవస్థల కోసం పనిచేసేవారు లేదా వాటికి సంబంధించినవారికి వర్తిస్తుంది.


ప్రతిభకు పరీక్ష

1. రాజ్యాంగంలో 'నీటి వనరుల' గురించి ఎన్నో షెడ్యూల్‌లో పేర్కొన్నారు?
   1) షెడ్యూల్ VII 2) షెడ్యూల్ VI
   3) షెడ్యూల్ V 4) షెడ్యూల్ VIII
2. అంతర్ రాష్ట్ర నీటి వివాదాల యాక్ట్‌కు ఏ సంవత్సరంలో తీసుకొచ్చారు?
   1) 1950 2) 1956
   3) 1947 4) 1952
3. బిజూ పట్నాయక్ అవార్డ్ ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్ -2016ను ఎవరికి ప్రకటించారు?
   1) దిగంబర్ బెహేరా
   2) ప్రశాంత మహోపాత్ర
   3) బి.కె. పటేల్
   4) శరత్ కుమార్ ప్రధాన్
4. చిత్వాన్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?
   1) ఇండియా 2) భూటాన్
   3) బంగ్లాదేశ్ 4) నేపాల్
5. దేశంలో మొదటి 'విదేశీ భవన్'ను ఎక్కడ ప్రారంభించారు?
   1) తెలంగాణ 2) మహారాష్ట్ర
   3) ఉత్తరప్రదేశ్ 4) జార్ఖండ్
6. ముర్లేన్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?
   1) ఒడిశా 2) కర్ణాటక
   3) మిజోరం 4) పంజాబ్
7. జాతీయ క్రీడా మ్యూజియాన్ని ఎక్కడ ఏర్పాటుచేయనున్నారు?
   1) న్యూఢిల్లీ 2) ముంబై
   3) ఇండోర్ 4) బెంగళూరు

సమాధానాలు మంగళవారం నిపుణలో...

24వ తేదీ 'ప్రతిభకు పరీక్ష' సమాధానాలు

1-1, 2-2, 3-3, 4-4, 5-1


కృష్ణ


'స్పైడర్' సెట్‌లో మహేష్‌బాబు

అప్పుడు.. ఇప్పుడు...!

మహేష్‌బాబుతో వివాహం అనంతరం సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు నమ్రత. అయితే సోషల్ మీడియాలో మాత్రం చాలా చురుకుగా ఉంటున్నారామె. తరచూ ఏదో ఒక పోస్ట్ చేస్తూ మహేష్‌బాబు అభిమానులకు అందుబాటులో వుంటున్న నమ్రత తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో యువకుడిగా వున్న కృష్ణ ఫోటోతో పాటు, 'స్పైడర్' చిత్ర షూటింగ్‌లో విరామ సమయంలో మహేష్‌బాబు దిగిన ఫోటోలకు ఆసక్తికరమైన ఓ క్యాప్షన్‌ను జతచేసి పోస్ట్ చేశారు. 'అప్పుడు...ఇప్పుడూ...మా లెంజండరీ మామగారు, ఆయన అందమైన కుమారుడు' అంటూ అసక్తికర వ్యాఖ్యల్ని పోస్ట్ చేసి తన భర్త మహేష్‌ని 'అందగాడు' అంటూ నమ్రత మురిసిపోవడం ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆసక్తిని కలిగిస్తున్నది. మహేష్‌బాబు ప్రస్తుతం ఎ.ఆర్.మురుగదాస్ రూపొందిస్తున్న 'స్పైడర్' చిత్రంలో నటిస్తున్నారు. రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. బ్యాలెన్స్‌గా వున్న పాటని ప్రస్తుతం రొమేనియాలో చిత్రీకరిస్తున్నారు. సెప్టెంబర్ 27న చిత్రాన్ని విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నారు.


బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే

పొల్లాచ్చీలో పోరాటాలు

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా శ్రీవాస్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్నది. పూజా హెగ్డే కథానాయిక. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఇటీవల రామోజీ ఫిలింసిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో తొలి షెడ్యూల్ పూర్తి చేశాం. అలాగే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. దీంతో రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. త్వరలో పొల్లాచ్చీలో 15 రోజుల పాటు భారీ షెడ్యూల్ జరపనున్నాం. అక్కడే పీటర్ హేయిన్స్ నేతృత్వంలో ఓ భారీ పోరాట ఘట్టాన్ని ప్లాన్ చేశాం. ఈ ఫైట్ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ప్రేక్షకులను థ్రిల్ చేసే అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని దర్శకుడు శ్రీవాస్ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. శ్రీనివాస్‌కు మరో హిట్ చిత్రంగా నిలుస్తుందన్న నమ్మకంతో వున్నాం' అన్నారు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెల కిషోర్, రవికిషన్, అశుతోష్‌రాణా, మధు గురుస్వామి, లావణ్య ప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్నారు.

మరోసారి నిర్మాతగా...?


నాని

నాని ప్రస్తుతం ఎంసీఏ (మిడిల్‌క్లాస్ అబ్బాయి), కృష్ణార్జున యుద్ధం చిత్రాల్లో నటిస్తున్నారు. నాని తాజాగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో రాజ్, డీకే సంయుక్తంగా నిర్మించిన 'డీ ఫర్ దోపిడీ' చిత్రానికి సహనిర్మాతగా వ్యవహరించిన నాని 'డైలాగ్ ఇన్ ద డార్క్' పేరుతో ఓ లఘు చిత్రాన్ని తెరకెక్కించిన ప్రశాంత్ చెప్పిన లైన్ నచ్చడంతో అతన్ని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాని త్వరలో ఓ సినిమా నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారట.


బాలకృష్ణ

43 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్... పౌరాణికం, జానపదం, చారిత్రకం వంటి భిన్న నేపథ్యాలు.. 101 సినిమాలు... ఎన్నో అజరామరమైన పాత్రలు ... వెరసి తన సినీ ప్రయాణం అద్భుతంగా సాగిందని అంటున్నారు బాలకృష్ణ. మూసధోరణిలో అడుగులు వేయడం తనకు నచ్చదని, ప్రతిసారీ వైవిధ్యతతో ఆలోచిస్తానని అంటున్నారాయన. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'పైసా వసూల్'. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. భవ్య క్రియేషన్స్ పతాకంపై ఆనంద్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బాలకృష్ణతో 'నమస్తే తెలంగాణ' జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది..

నాకు నేనే పెద్ద అభిమానిని

నలభై మూడేళ్ల సినీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది?

• బ్రహ్మాండంగా సాగింది. మొదట్లో నేను సినిమాల్లోకి రావడానికి నాన్న ఇష్టపడలేదు. లేదంటే ఇప్పటికీ 250 సినిమాలు పూర్తయ్యేవి. 'నేను నటిస్తుండగా నువ్వు సినిమాల్లోకి వస్తానంటే ఎలా ఒప్పుకుంటా' అని వారించారు. చదువు పూర్తిచేసుకోమని అనేవారు. చదువుపై నాకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఆయన సినిమాలు చూస్తూ పెరగడంతో నటుడినవ్వాలని నిర్ణయించుకున్నాను.

తొలినాళ్లలో నాన్నతో కలిసి చాలా సినిమాలు చేశారు. సెట్స్‌లో మీ మధ్య అనుబంధం ఎలా ఉండేది?

• ఇంట్లో తండ్రిగా మమ్మల్ని గారాబంగా చూసుకున్నా సెట్స్‌లో అడుగుపెడితే మాత్రం మా ఇద్దరి మధ్య నటుడు, దర్శకుడి అనుబంధం ఉండేది. నన్ను ప్రత్యేకంగా గౌరవించడం, దెబ్బలు తగిలినా షూటింగ్‌లకు ప్యాకప్‌లు చెప్పడాలు ఉండేవి కావు. 'అనురాగ దేవత' సమయంలో నా కాలుకు పెద్ద గాయమైంది. ఆయన వచ్చి నన్ను చూసి వెంటనే 'వాడితో షూటింగ్ చేయాలి డిశ్చార్జ్ చేయండి' అని డాక్టర్లతో చెప్పారు.

గత చిత్రాలతో పోలిస్తే 'పైసా వసూల్'లో చాలా హుషారుగా కనిపిస్తున్నారు? కారణమేమిటి?

• పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. తేడా సింగ్‌గా నా పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. నా వయసుకు తగినట్లుగా ఈ పాత్ర ఉంటుంది. ట్రైలర్‌లో చూపించినట్లుగా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. మంచి కథ, పాత్రలు అన్ని చక్కగా కుదిరాయి. ఉప్పు, కారం, తీపి, వగరు చేదు ఇలా షడ్రుచులను మేళవించి విందు భోజనంగా పూరి జగన్నాథ్ ఈ సినిమాను తీర్చిదిద్దారు. ప్రస్తుతం ప్రేక్షకుల అభిరుచులు రోజురోజుకు మారుతున్నాయి. వేగం పెరిగిపోయింది. వాటిని అందుకోవాలంటే ప్రతి సినిమాలో వైవిధ్యత కనబరచాల్సిందే. ప్రేక్షకులు చూస్తారో లేదో అనే ఆలోచనను పక్కనపెట్టి ప్రతి సినిమా కొత్తగా చేయాలని ప్రయత్నిస్తాను.

తేడా సింగ్‌గా మీ పాత్ర ఎలా ఉండనుంది?

• దొంగ వస్తువులను రవాణా చేసే వ్యక్తిగా కనిపిస్తాను. అతడి జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, ఓ అమ్మాయితో ప్రేమాయణం ఆసక్తిని పంచుతాయి. పరిణితితో కూడిన ప్రేమకథతో పాటు వాణిజ్య హంగులన్నీ ఉన్న చిత్రమిది.

తెరపై మీ పాత్రలు ఎక్కువగా ఆవేశపూరితంగా సాగుతాయి. నిజజీవితంలో ఎలా ఉంటారు?

• సినిమాలు తప్ప నాకు మరో ప్రపంచం తెలియదు. ఇరవై నాలుగు గంటలు వృత్తి గురించే ఆలోచిస్తాను. నటనతో ప్రేక్షకుల్ని అలరించే అవకాశం అందరికి రాదు. ఆ అదృష్టం నాకు దొరికింది. ఇంతకు మించిన తృప్తి మరొకటి ఉండదు. మిగతా వారితో పోలిస్తే నా లైఫ్‌స్టైల్ భిన్నంగా ఉంటుంది. ఉదయం మూడున్నరకే నిద్రలేస్తాను. రోజుకు ఇరవై నుంచి పద్దెనిమిది గంటల పాటు పనిచేస్తాను. కేవలం నాలుగు గంటల పాటే నిద్రపోతాను. అనవసరంగా కోపతాపాలు పెంచుకోవడం, కష్టాలు కొని తెచ్చుకోవడం వల్ల ఉపయోగం ఉండదని నమ్ముతాను.

పూరి జగన్నాథ్‌తో నా కెమిస్ట్రీ బాగా కుదిరిందని ప్రచార కారక్రమాల్లో చెప్పారు. ఆయనతో పనిచేయడం ఎలా ఉంది?

• ఈ సినిమాలో మా ఇద్దరి అభిప్రాయాలు చాలా వరకు కుదిరాయి. పూరి జగన్నాథ్‌తో మరో సినిమా తప్పకుండా చేస్తాను. ప్రతి చిత్రానికి నాకు కొన్ని క్యాలిక్యులేషన్స్ ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకొనే సినిమాలు చేస్తాను. ఈ సినిమా విషయంలో నా ఊహలన్ని వందశాతం నిజమయ్యాయి. పూరి జగన్నాథ్ తన అనుభవన్నాంతా ఉపయోగించి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమాకు పూరి జగన్నాథ్ పేరును నేనే సూచించాను. నిర్మాత నా ఆలోచన బాగుందని అంగీకరించారు కానీ చిత్ర పరిశ్రమలో చాలా మంది ఆయన గురించి వ్యతిరేకంగా చెప్పారు. అలాంటివి నేను పట్టించుకోను. సినీ పరిశ్రమలో నాకున్న సన్నిహితులు తక్కువే. సాయికొర్రపాటితో పాటు కొద్దిమందితో మాత్రమే సన్నిహితంగా ఉంటాను. అందుకే ఏవీ పట్టించుకోకుండా పూరి జగన్నాథ్‌ను నమ్మి సినిమా చేశాను.

ఈ సినిమాను 78 రోజుల్లోనే పూర్తిచేశామని ఆడియో వేడుకలో చెప్పారు. తక్కువ రోజుల్లో చేయాలని నిర్ణయించుకోవడానికి కారణమేమిటి?

• 'గౌతమిపుత్రశాతకర్ణి' సినిమాను 79 రోజుల్లో పూర్తిచేస్తే ఈ సినిమాను 78 రోజుల్లో చిత్రీకరించాం. కె.ఎస్.రవికుమార్‌తో చేస్తున్న సినిమాకు మరో రోజు తగ్గిస్తాం. అలా ఒక్కో సినిమాకు ఒక్కో రోజు తగ్గిస్తూ పోవాలనుకుంటున్నాను. ఒకప్పుడు తక్కువ రోజుల్లోనే సినిమాలు చేసేవారు. రాత్రింబవళ్లు కష్టపడేవారు. ఇప్పుడు తక్కువ రోజులంటేే భయపడిపోతున్నారు. సినీ పరిశ్రమపై ఎంతో మంది ఆధారపడివున్నారు. చాలా మందికి సినీ రంగం ఉపాధికల్పిస్తున్నది. వేగంగా సినిమాలు చేస్తే మరింత మందికి జీవనోపాధి కల్పిస్తున్నట్లవుతుందనిపించింది. ప్రతి సినిమాను తొందరగా చేయాలని నిర్ణయించుకున్నాను. సుదీర్ఘ సినీ ప్రయాణంలో జానపదం, చారిత్రకం, ఫాంటసీ ఇలా భిన్న నేపథ్యాలతో సినిమాలు చేశాను. మూసధోరణిలో సినిమాలు చేయడం నాకు నచ్చదు. నా నేచర్ అది కాదు. ప్రతిసారి కొత్త కథలు, ఆర్టిస్టులతో పనిచేయాలనుకుంటాను. చేయగల సత్తా, క్రమశిక్షణ నాన్న నుంచి వచ్చాయి. అందుకే ప్రతి సినిమాను వేగంగా పూర్తిచేస్తాను.

ఓ యాక్షన్ సన్నివేశంలో డూప్ లేకుండా నటించారని తెలిసింది?

• డూప్ లేకుండా ఆ సన్నివేశాన్ని నేను చేస్తానని ఎవరూ ఊహించలేదు. ఆ సన్నివేశంలో కారులో నా పక్కనే కూర్చున్న శ్రియకు కూడా తెలియదు. 'నా మీద నమ్మకం ఉందా' అని ఆమెను అడిగాను. అవునని సమాధానం చెప్పింది. ఏం చేయబోతున్నావని ఆమె అడగడం పూర్తికాకుండానే కారును రెండు పల్టీలు కొట్టించాను. దాంతో శ్రియ భయపడిపోయింది. 'లెజెండ్'లో గుర్రంపై వచ్చి అద్దం పగలకొట్టే సన్నివేశాన్ని డూప్ లేకుండా చేశాను. పాత్రను ఎంజాయ్ చేస్తూ అందులోకి పరకాయ ప్రవేశం చేస్తే రిస్క్ అనే ఆలోచన రాదు.

సినిమాలో 'ఏక్ పెగ్‌లా..' అంటూ గీతాన్ని ఆలపించారు? పాట పాడాలనే ఆలోచన మీదేనా?

• ఏ హీరో కూడా తన గొప్పతనాన్ని కీర్తించుకుంటూ స్వంతంగా పాటలు పాడుకోలేదు. తొలిసారి నేనే ఆ పనిచేశా. నాకు నేనే పెద్ద అభిమానిని. నాన్నే నాకు గురువు, దైవం. ఆయన తర్వాత నచ్చే మనిషి ఎవరంటే నాకు నేనే అని సమాధానం చెబుతాను. ఏది చేసినా అంకితభావం, క్రమశిక్షణతో పూర్తిచేస్తాను. నేను సంపాదించుకున్న జ్ఞానం పదిమందికి ఉపయోగపడాలని కోరుకుంటాను. సినిమా షూటింగ్‌లు లేకపోతే సాహిత్యం చదువుకుంటూ కూర్చుంటాను. సినిమాల ద్వారా తెలుగు భాషను పెంపొందించే ప్రయత్నం చేయడం ఆనందంగా ఉంది.

నాన్న నటించిన 'కొంటెనవ్వు చెప్పింది...' అనే పాటను రీమిక్స్ చేసినట్లున్నారు?

• గతంలో 'నిప్పులాంటి మనిషి' సినిమాలో నాన్నగారి పాటను ఉపయోగించాం. ఆ తర్వాత ఆయన పాటను మళ్లీ ఈ సినిమాలోనే ఉపయోగించాను. డ్యాన్సుల్లో నాన్నగారిని అనుకరించడం థ్రిల్లింగ్‌గా అనిపించింది.

మీ మనవడు దేవాన్ష్ మీరు నటించిన సినిమాల్ని చూస్తున్నాడా?

• వాడు నాకు పెద్ద ఫ్యాన్. నా పేరు తెలియదు. గోల తాత, శాతకర్ణి అంటూ పిలుస్తుంటాడు. నా సినిమాలు చూస్తుంటాడు, పాటలు విని నవ్వుతుంటాడు.

కె. యస్. రవికుమార్ దర్శకత్వంలో చేయబోతున్న సినిమా సందేశాత్మక కథాంశంతో చేస్తున్నారని తెలిసింది?

• కుటుంబ బంధాలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. తొలి షెడ్యూల్ పూర్తయింది. కుంభకోణంలో రెండో షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. సినిమా నాన్న నటించిన 'గుడిగంటలు' తరహాలో ఉంటుంది.

ఎన్టీఆర్ జీవిత కథతో మీరు ఓ సినిమా చేస్తున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి?

• తప్పకుండా నాన్న జీవిత కథతో సినిమా చేస్తాను. కథా చర్చలు జరుగుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో దర్శకుడితో పాటు సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తాను.

రాజకీయ కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉందా?

• రాజకీయ కథాంశాలతో సినిమా అస్సలు చేయను. ఇతర కథల కంటే అవే నన్ను ఎక్కువగా వెతుక్కుంటూ వస్తున్నాయి.

'జై లవ కుశ' పాటల హంగామా!


ఎన్టీఆర్

ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జై లవ కుశ'. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహిస్తున్నారు. రాశీఖన్నా, నివేదా థామస్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'సెప్టెంబర్ 3న ఆడియోను భారీ స్థాయిలో విడుదల చేయాలని ప్లాన్ చేశాం. అయితే ఆ రోజున భారీ వర్ష సూచనతో పాటు వినాయక నిమజ్జనం వుండటం, ఆ కార్యక్రమంలో పోలీస్ శాఖ నిమగ్నమై వుంటారు కాబట్టి అభిమానుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆడియోను నేరుగా మార్కెట్‌లోకి విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నాం. సెప్టెంబర్ 10న అభిమానుల సమక్షంలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం. నా సోదరుడు ఎన్టీఆర్‌తో సొంత సంస్థలో ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా వుంది. అత్యుత్తమ సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ చిత్రం అభిమానులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకముంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: చోట కె.నాయుడు, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు, విజువల్ ఎఫెక్ట్స్: అనిల్ పాతూరి.

మారుతి దర్శకత్వంలో...!


నాగచైతన్య

'రారండోయ్ వేడుక చూద్దాం' తరువాత నాగచైతన్య సినిమాల ఎంపిక విషయంలో స్పీడు పెంచారు. ప్రస్తుతం యుద్ధం శరణం, సవ్యసాచి చిత్రాల్లో నటిస్తున్న ఆయన తాజాగా మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నాగచైతన్యతో 'ప్రేమమ్' వంటి హిట్ చిత్రాన్ని అందించిన సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ తాజా చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. యువ దర్శకుడు మారుతి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌పైకి రానుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాతో పాటు శర్వానంద్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సుధీర్‌వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ రెండు చిత్రాలకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో తెలియజేస్తామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు.


యోధ, పావని, సాంబ

లావణ్య ప్రేమకోసం...!

సాంబ, యోధ, కిరణ్, పావని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లావణ్య విత్ లవ్‌బాయ్స్'. డా.వడ్డేపల్లి కృష్ణ దర్శకుడు. రాజ్యలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై రాజ్యలక్ష్మి, సి. నర్సింలుపటేల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు డా. వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ 'దాదాపు దశాబ్ద కాలం తరువాత నేను దర్శకత్వం వహించిన చిత్రమిది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా నవరసాల్ని మిళితం చేసి ఆద్యంతం వినోదాత్మకంగా చిత్రాన్ని రూపొందించాం. ముగ్గురు యువకులు, ఓ యువతి నేపథ్యంలో సాగే చిత్రమిది. పడుచుకుర్రాళ్ల ప్రణయగాథగా తెరకెక్కిన చిత్రమిది. లావణ్య ప్రేమ కోసం ముగ్గురు యువకులు ఏం చేశారు? ఆ తరువాత ఏం జరిగింది? అనేది ఆసక్తికరంగా వుంటుంది. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రం అందరిని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అని నిర్మాత తెలిపారు.

ప్రేమకు కొత్త భాష్యం


శ్రీకర్, అమృత

శ్రీకరణ్, అమృత, ప్రీతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బెస్ట్ లవర్స్'. నంది వెంకట్‌రెడ్డి దర్శకుడు. గొంటి శ్రీకాంత్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ప్రేమను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. తమ ప్రేమను గెలుపించుకోవడానికి ఓ జంట ఎలాంటి త్యాగానికి సిద్ధపడింది? గొప్ప ప్రేమికులుగా చరిత్రలో వారు ఎలా నిలిచిపోయారు? అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. వెంకట్‌రెడ్డి దర్శకత్వ ప్రతిభ, సాయికిరణ్ బాణీలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి. సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తిచేసి త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: డి. యాదగిరి.


భరత్, రూహాని

మళ్లీ ప్రేమిస్తే...

భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మళ్ళీ ప్రేమిస్తే'. రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్‌పూదోట నిర్మిస్తున్నారు. రవి భార్గవన్ దర్శకుడు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నిర్మాత మాట్లాడుతూ 'ప్రేమలో మోసపోయే ఓ యువకుడి కథ ఇది. ప్రేమికుడి విరహావేదనను హృదయానికి హత్తుకునేలా తెరపై ఆవిష్కరించారు దర్శకుడు రవి భార్గవన్. 'ప్రేమిస్తే' తర్వాత భరత్ నటిస్తున్న వినూత్న ప్రేమకథా చిత్రమిది.విజయ్ కురాకుల అయిదు అద్భుతమైన బాణీలను అందించారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. కాశీవిశ్వనాథ్, సురేఖావాణి, సన, కోటేశ్వరరావు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ముజీబ్ మాలిక్, ఎడిటింగ్: నందమూరి హరిబాబు, సహనిర్మాత: కిరణ్ తనమాల.

బీఎడ్, డీఎడ్ కళాశాలలకు గ్రేడ్లు!

ప్రమాణాలు, ఉత్తీర్ణత ఆధారంగా కేటాయింపు • ఎన్సీటీఈ కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా అన్ని ప్రైవేటు బీఎడ్, డీఎడ్ కళాశాలలకు గ్రేడ్లు ఇవ్వాలని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) నిర్ణయించింది. బీఎడ్, డీఎడ్ కళాశాలల్లో తాజా పరిస్థితులను అంచనావేశాక.. వాటికి ఏ, బీ, సీ, డీ గ్రేడింగ్‌లు ఉండాలని భావించి కసరత్తు చేస్తున్నది. దీనివల్ల విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అఫిలియేషన్ పొందిన బీఎడ్ కాలేజీలు.. అక్కడ నమోదైన ఉత్తీర్ణత, విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, భవన నిర్మాణాలు, భూ డాక్యుమెంట్లు తదితర వివరాలను ఎన్సీటీఈ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. కాలేజీలు అప్‌లోడ్ చేసిన వివరాలపై రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) తనిఖీలు నిర్వహిస్తుంది. అప్‌లోడ్ చేసిన వివరాలకు, క్షేత్రస్థాయి తనిఖీల సమయంలో పరిశీలించిన అంశాలకు ఏమైనా తేడాలుంటే కాలేజీల గుర్తింపు రద్దుచేయనున్నది. కాలేజీలవారీగా నివేదికలను తిరిగి ఎన్సీటీఈకి పంపించనున్నది. అన్ని వివరాల ఆధారంగా గ్రేడ్లు కేటాయించనున్నారు. మరోవైపు ఎన్సీటీఈ చేపడుతున్న చర్యలతో ప్రమాణాలు పాటించని బీఎడ్, డీఎడ్ కళాశాలలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. తెలంగాణలో దాదాపు 25 డీఎడ్ కాలేజీలు మూసివేసేందుకు ఎన్సీటీఈకి దరఖాస్తు పెట్టుకున్నాయి. గతఏడాది వరకు 280 కళాశాలలుండగా.. వాటిలో దాదాపు 100 కాలేజీలకు ఎన్సీటీఈ అనుమతులు మంజూరుచేయలేదు. ప్రస్తుతం 170 కాలేజీలే కొనసాగుతున్నాయి. వాటిలో 10 వేల సీట్లు ఉండగా, డీఈఈసెట్-2017 కౌన్సెలింగ్ కోసం ఏడువేల మంది అభ్యర్థులే పాల్గొన్నారు. అర్హులైన ఫ్యాకల్టీతో బోధనలు చెప్పించాలనే నిబంధన పాటించకపోవడంతో చాలా కాలేజీలకు అఫిలియేషన్లు రాలేదని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్

తిరుమల, నమస్తే తెలంగాణ: గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుపతి చేరుకున్న ఆయన ముందుగా సతీసమేతంగా పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలను గవర్నర్ దంపతులకు అందజేశారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ

ఫీజులు, ఖర్చుల వివరాలు 15 కల్లా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్

లేదంటే చర్యలు తప్పవన్న విద్యాశాఖ డైరెక్టర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించడంపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయి. వరుసగా మూడేండ్లపాటు ప్రైవేటు స్కూళ్లలో వసూలుచేస్తున్న ఫీజుల వివరాలతోపాటు ఖర్చుల వివరాలను పాఠశాల విద్యాశాఖ www.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో యాజమాన్యాలు అప్‌లోడ్ చేయాలని షెడ్యూల్ విడుదల చేశారు. సెప్టెంబర్ 15 కల్లా అప్‌లోడ్ చేయాలని స్కూళకు గడువు విధించారు. గడువు ముగిసిన తర్వాత కూడా ఫీజులు, ఖర్చుల వివరాలను అప్‌లోడ్ చేయని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కేంబ్రిడ్జి వంటి అన్ని సిలబస్‌తో కొనసాగుతున్న ప్రైవేటు స్కూళ్లు కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ప్రొఫెసర్ తిరుపతిరావు అన్నారు. ఇందుకోసం 25 అంశాలతో రూపొందించిన నమూనా పత్రాన్ని పూర్తిచేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టంచేశారు. 2015-16 నుంచి వరుసగా మూడేండ్ల ఫీజులు, ఖర్చుల వివరాలను చూపాల్సి ఉంటుంది. ఆ తర్వాత స్కూళ్లను అక్కడక్కడ తనిఖీ చేస్తారు. ఇతర రాష్ట్రాలలో ప్రైవేటు స్కూల్ ఫీజుల నియంత్రణ విధానం, వసూలు చేస్తున్న ఫీజులను అధ్యయనం చేస్తారు. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకొని ప్రైవేటు స్కూల్ ఫీజులను ఖరారు చేయడానికి చర్యలు తీసుకుంటారు.



బుధవారం తెలంగాణభవన్‌లో మెప్మా ఆర్పీల ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబుయాదవ్

బంగారు తెలంగాణలో భాగస్వాములుకండి

టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం(టీఆర్ఎస్కేవీ) రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబుయాదవ్ పిలుపునిచ్చారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు చెందిన రిసోర్స్ పర్సన్ (మెప్మా ఆర్పీ)ల ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం తెలంగాణభవన్‌లో జరిగింది. మెప్మా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు సునీత అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో రాంబాబు యాదవ్ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తున్న ఆర్పీలను గత ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకున్నాయని, వారి సమస్యలు పరిష్కరించలేవని విమర్శించారు. ఆర్పీలకు త్వరలోనే వేతనాలు పెరుగుతాయని, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నమ్మకం, విశ్వాసంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్ రూప్‌సింగ్, టీఆర్ఎస్కేవీ నాయకులు పీ నారాయణ, బీ కృష్ణయ్య, నల్లా భారతి, ఏ శారద, మారయ్య యువరాజ్, ఆర్పీల సంఘం ప్రధాన కార్యదర్శి విజయ, లక్ష్మీ, చంద్రకళ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పదవీవిరమణ ప్రయోజనాలు పెంచండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంగన్‌వాడీ వర్కర్స్ పదవీవిరమణ ప్రయోజనాలను పెంచాలని రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమం, ఆర్అండ్‌బీశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు టీఆర్ఎస్ కార్మిక విభాగం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విజ్ఞప్తిచేశారు. మంత్రి తుమ్మలను ఆయన నివాసంలో బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసినవారిలో టీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, అంగన్‌వాడీ నాయకురాలు నల్లా భారతి, శారద , యువరాజు, కృష్ణ, రమేశ్, పద్మ, వీ నిర్మల, జీ రమ, పొడిశెట్టి నాగమణి, జూలకంటి మల్లీశ్వరి, దాడి అరుణ, కమల, సుజాత, విజయ, హేమలత తదితరులు ఉన్నారు.

పురపాలకశాఖలో 21 మందికి పదోన్నతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పురపాలకశాఖలో 21 మందికి గ్రేడ్-2 కమిషనర్లుగా పదోన్నతిని కల్పిస్తూ మున్సిపల్‌శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్.. గ్రేటర్ వరంగల్ సూపరింటెండెంట్, డిప్యూటీ కమిషనర్.. నిజామాబాద్ కార్పొరేషన్‌లో గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్, సూపరింటెండెంట్ తదితరులు పదోన్నతిని పొందారు. జగిత్యాల, సత్తుపల్లి, ఇల్లందు, బోధన్, మంచిర్యాల, ఆర్మూరు, కోరుట్ల, హుజురాబాద్, వేములవాడ, ఆదిలాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో పనిచేసే కమిషనర్లు, ఇతరులకు గ్రేడ్-2 కమిషనర్లుగా పదోన్నతిని కల్పించారు.

పగటికలల కాంగ్రెస్!

మొదటిపేజీ తరువాయి...

బతుకుతూ.. ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నరు. కానీ వాళ్ల మాయ మాటలను ఏనాడూ ప్రజలు నమ్మలేదు. 2014 ఎన్నికలతోపాటు ఆ తర్వాత వచ్చిన ప్రతి ఉప ఎన్నికలోనూ టీఆర్ఎస్ అభ్యర్థులకే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మరి ఆ ఎన్నికలు ప్రజాభిప్రాయానికి కొలబద్దలు కావా?' అని హరీశ్ ప్రశ్నించారు.

రైతులకు మేలు చేయడం ఇష్టం లేదా?

భూ రికార్డులను సరిచేస్తామంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావడంలేదని హరీశ్‌రావు అన్నారు. నిజాం కాలం తర్వాత మళ్లీ భూ సర్వే జరుగలేదని గుర్తుచేశారు. రికార్డులన్నీ ప్రక్షాళన చేయకపోవడంతో గందరగోళంగా ఉందని, అస్తవ్యస్త రికార్డుల వల్లనే భూ వివాదాలు, అక్రమాలు పెరిగిపోతున్నాయని చెప్పారు. అందుకే గ్రామసభలుపెట్టి, రైతుల భాగస్వామ్యంతో రికార్డులను సరిచేయాలని ప్రభుత్వం అనుకుంటున్నదని తెలిపారు. భూ వివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడాలని, రైతులకు భూ హక్కులపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం కోరుకుంటున్నదని చెప్పారు. దీనికి కాంగ్రెస్ నాయకులు ఎందుకు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారో చెప్పాలని డిమాండ్‌చేశారు. భూ రికార్డులను సంస్కరించడంవల్ల అవినీతికి ఆస్కారం ఉండదని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారా? వారుచేసిన భూదందాలు బయటకు వస్తాయని జంకుతున్నారా? బినామీ భూములు కోల్పోతామని వణుకుతున్నారా? అని హరీశ్ ప్రశ్నించారు. కోర్టుకు వెళ్లి ఈ ప్రక్రియను అడ్డుకుంటామని ప్రకటించడం ఆ పార్టీ నేతల నైరాశ్యానికి నిదర్శనమన్నారు. ఆదర్శ రైతుల పేరిట కాంగ్రెస్ పార్టీ వారి కార్యకర్తలకు ప్రజాధనాన్ని దోచిపెడితే.. తెలంగాణ సర్కారు మాత్రం స్వచ్ఛందంగా రైతు సంఘాలు, రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేస్తున్నదన్నారు. రైతులకు మేలు జరుగుతుందంటే కాంగ్రెస్‌కు ఇంత కండ్ల మంట ఎందుకని ప్రశ్నించారు.

ఇది రైతుల బాధలు తెలిసిన సర్కారు..

'రైతులకు కరెంటు ఇస్తే ఓర్వరు. ఎకరానికి రూ.8వేల పెట్టుబడి ఇస్తమంటే వంకలు పెడుతరు. ప్రాజెక్టులు కడుతమంటే అడ్డుకుంటరు. చెరువులు పునరుద్ధరిస్తే గుండెలు బాదుకుంటరు.. ఇదెక్కడి అన్యాయం? ఇంత విపరీత ధోరణి ఎందుకు? అసలు రైతులకు ఏం చేసినా ఆ పార్టీ నాయకులకు నచ్చదా..' అని మంత్రి నిలదీశారు. రైతులు టీఆర్ఎస్ ప్రభుత్వంవైపు ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పుట్టగతులు ఉండవనే భయంతోనే రైతులకు నష్టంచేసేందుకు ఆ పార్టీ నేతలు వెనుకాడటం లేదన్నారు. రాజకీయ స్వార్థం కోసం రైతులను బలి చేస్తారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే రైతులే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో వ్యవసాయాభివృద్ధికోసం, రైతుల కోసం పనిచేసిందిలేదని, అందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వాళ్ల లాగనే ఉండాలని కోరుకుంటున్నారని ఎద్దేవాచేశారు. కానీ టీఆర్ఎస్ సర్కారు మాత్రం అలా ఉండదని, తమది ఉద్యమ స్ఫూర్తి ఉన్న ప్రభుత్వమని మంత్రి చెప్పారు. రైతుల బాధలు తెలిసినందున వారిని అప్పుల ఊబిలో నుంచి బయటపడేయాలని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కంకణం కట్టుకున్న ప్రభుత్వమని చెప్పారు. రైతులకు మేలుచేసే తమ చిత్తశుద్ధిని పిచ్చి చేష్టలతో, కుట్రలతో భగ్నంచేయలేరని మంత్రి స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో రాష్ట్రం ముందుకు పోతున్నదని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఛాయలు ఏ కోశానా కనిపించడం లేదని స్పష్టంచేశారు.

విభజన సమస్యలపై కేంద్రం శీతకన్ను

పరిష్కారంపై కరువైన చొరవ..

సాచివేత వైఖరితో వివాదాలను పెంచుతున్నదని

తెలంగాణ ఉద్యోగ సంఘాల విమర్శ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మేరకు విభజన సమస్యలను పూర్తిగా, సమగ్రంగా పరిష్కరించడంలో కేంద్రం చొరవ చూపడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి. రాష్ట్ర విభజన జరిగి మూడేండ్లు దాటుతున్నా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య హైకోర్టు, తొమ్మిది, పదో షెడ్యూలు సంస్థలు, ఢిల్లీలోని ఏపీ భవన్, విద్యుత్ ఇంజినీర్లు, ఆర్టీసీ ఆస్తులు, ఉద్యోగుల విభజన వంటివన్నీ ఇంకా అలాగే ఉన్నాయి. ఏపీ మొండివైఖరి కారణంగా వివాదాలుగా మారిన అంశాలను కేంద్రం పెద్దన్న పాత్ర పోషించి పరిష్కరించడం లేదని, పైగా సాచివేత వైఖరితో వివాదాలను పెంచిపోషిస్తున్నదని, కేంద్రం తీరు మీ సమస్యలను మీరే పరిష్కరించుకోండి, మాకేం సంబంధం లేదనే విధంగా ఉందని ఉద్యోగ సంఘాల నేతలు దుయ్యబడుతున్నారు. పునర్వ్యవస్థీకరణచట్టంతోపాటు, 371డీ, రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఇచ్చిన హామీల అమలులో కేంద్ర డీవోపీటీ అధికారులు కాలయాపన చేస్తున్నారని అంటున్నారు. తాజాగా సోమవారం జరిగిన ఉద్యోగుల విభజన వివాదాలే ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు.స్థానికతను ప్రామాణికంగా తీసుకొని ఉద్యోగులను విభజించాలని తెలంగాణ ఉద్యోగులు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా కమలనాథన్ కమిటీ వేల మంది ఆంధ్రా ప్రాంత ఉద్యోగులను తెలంగాణకు కేటాయించింది. కేంద్రం కనుసన్నల్లోనే ఈ అన్యాయం జరిగిందని తెలంగాణ ఉద్యోగసంఘాల ఆరోపిస్తున్నాయి. సీమాంధ్రకు చెందిన 24 మంది సెక్షన్ ఆఫీసర్లు ఏపీకి వెళ్తామని ఆప్షన్ ఇచ్చినా డీవోపీటీ అధికారులు ఆమేరకు ఆదేశాలు జారీచేయలేదు. పునర్వ్యవస్థీకరణచట్టం ప్రకారం తొమ్మిది, పదో షెడ్యూలు సంస్థల ఆస్తులు ఏ ప్రాంతంలో ఉన్నవి ఆ ప్రాంతానికే చెందాలి. ఏపీ అందుకు ఒప్పుకోనట్లు వ్యవహరిస్తున్నది. ఏపీ స్థానికత గల విద్యుత్ ఇంజనీర్లను ఏపీ సర్కార్ తీసుకోవడం లేదు. ఇవన్నీ చూస్తూ కూడా కేంద్రం న్యాయం చేయడానికి చొరవ తీసుకోవడం లేదు. అంతరాష్ట్ర బదిలీల్లోనూ అంతే. ఈ సమస్యను సులభంగా పరిష్కరించే అవకాశాలున్నా పట్టించుకోవడం లేదని ఉద్యోగ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల విభజనలో అన్యాయం



డీవోపీటీ అధికారులు ఉద్యోగుల విభజనలో న్యాయంగా వ్యవహరిస్తారని చాలా ఆశపడ్డాం. కానీ తెలంగాణకు రాజ్యాంగం ఇచ్చిన హామీలను కూడా వారు అమలు చేయలేకపోతున్నారు. ఏపీ వైఖరి వల్ల రెండు రాష్ట్రాలు కలిసి వివాదాలను పరిష్కరించుకోలేని పరిస్థితి ఏర్పడింది. న్యాయంగా పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

– కారం రవీందర్‌రెడ్డి,టీఎన్జీవో అధ్యక్షుడు

కేంద్రం వైఖరి బాగాలేదు



తొమ్మిది, పదో షెడ్యూల్ సంస్థలు, ఉద్యోగుల విభజనలో తలెత్తిన వివాదాల గురించి కేంద్రానికి చాలాసార్లు వివరించాం. పరిష్కరిస్తుందని ఆశించాం. కానీ కేంద్రం తీరు చాలా అసంతృప్తిని మిగిల్చింది.

– ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్
టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు

కేంద్రం విఫలమవుతున్నది



అంతర్రాష్ట్ర బదిలీలకోసం ఎంతోమంది ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఎంపీ కల్వకుంట్ల కవిత సారథ్యంలో తెలంగాణ ఉద్యోగ సంఘాలు అనేకమార్లు డీవోపీటీ అధికారులను కలిసి స్థానికత ప్రామాణికంగా ఉద్యోగులను విభజించాలని కోరాం. కమలనాథన్ కమిటీ చేసిన అన్యాయాలను వివరించాం. అయినా కేంద్రం స్పందన సరిగా లేదు. తెలంగాణ, ఏపీల మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించడంలో డీవోపీటీ అధికారులు విఫలమవుతున్నారు.

– జీ దేవీప్రసాద్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

వివాదాలను పెంచుతున్నారు



కేంద్ర అధికారులు ఉద్యోగుల విభజన సమస్యలన్నీ పరిష్కరిస్తారని ఆశపడ్డాం. కానీ ఆ విధంగా జరుగలేదు. వాళ్లు వివాదాలు పెంచేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా కేంద్రం సముచితంగా పరిష్కరించాలి.

– ఏ పద్మాచారి
తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

కాంగ్రెస్ మునిగిపోయే పడవ

వార్డుసభ్యులు కూడా చేరరు • టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ లాంటిదని, ఆ పార్టీలో టీఆర్ఎస్ వార్డు సభ్యుడు కూడా చేరడని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్‌రావు అన్నారు. టీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు ఉంటాయని చేస్తున్న ప్రచారాన్ని తప్పుబట్టారు. మునిగిపోయే పడవలో ప్రయాణించాలని ఎవరూ కోరుకోరనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. కొందరు కాంగ్రెస్ నాయకులను కోవర్ట్ ఆపరేషన్‌లో భాగంగా టీఆర్ఎస్‌లోకి పంపించామని భట్టి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కోవర్ట్ పనులు చేసినందునే ఆయనకు అలాంటి అలోచనలు వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందనే విషయాన్ని ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే చెప్తున్న విషయాన్ని భట్టి గుర్తించాలన్నారు. రైతు సమన్వయ కమిటీలు అమల్లోకి వస్తే ఏ గ్రామంలో అడుగుపెట్టకపోవడమే కాకుండా పార్టీ అడ్రస్ గల్లంతవుతుందనే భయంతోనే రైతు సమన్వయ కమిటీలపై ఆరోపణలు చేస్తున్నారని భానుప్రసాదరావు చెప్పారు. వచ్చే 20 ఏండ్ల వరకూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు. తన పరపతిని పెంచుకునే ప్రయత్నాల్లో భాగంగా భట్టి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. భూరికార్డులు సరిగా ఉంటే కాంగ్రెస్ నాయకులకు పంచాయితీ చేసే అవకాశం ఉండదని, గతంలో రైతుల మధ్య పంచాయితీ పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. రైతు సమన్వయ కమిటీల ఏర్పాటు దేశంలో మొదటిసారిగా జరుగుతుందన్నారు. భూ సర్వేను టీఆర్ఎస్ నాయకులు చేయరని, రెవెన్యూ ఉద్యోగులే చేస్తారనే కనీసం పరిజ్ఞానం లేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధిని నిరోధించేందుకు కోర్టుకు వెళ్లడం తప్ప కాంగ్రెస్ నాయకులకు మరేం తెలియదని విమర్శించారు.



టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు



వరద నీటితో కళ కళ లాడుతున్న తుంగభద్ర నది



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటి మట్టం

కృష్ణమ్మ కళకళ

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తుతం 115.70 టీఎంసీల నిల్వ ఉన్నది. ప్రవాహం మరో వారం కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు కృష్ణానది జన్మస్థలమైన మహబలేశ్వరంలోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటివరకు 36 సెంటీమీటర్లు నమోదైనట్టు అంచనా. అక్కడి నుంచి ఈ రెండు రోజుల్లో దాదాపు లక్ష క్యూసెక్కులు దిగువకు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నీటితో జూరాల పూర్తిగా నిండి దిగువకు వదిలితే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగనున్నది. ప్రస్తుతం ఉజ్జయిని స్పిల్‌వే గేట్ల నుంచి విడుదల చేస్తున్న నీటితో జూరాలకు ఇన్‌ఫ్లో పెరిగింది. కాగా ప్రస్తుతం ఉజ్జయినీ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీరు భీమా ద్వారా తంగిడి వద్ద కృష్ణాలో కలుస్తున్నది.

జూరాల నుంచి నీటి విడుదల..

ఎగువ నుంచి జూరాలకు 10 వేల క్యూసెక్కులు వస్తున్నది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు భీమా-1, కోయిల్‌సాగర్, సాయంత్రం భీమా-2 ఎత్తిపోతల పథకాల మోటర్లను ప్రారంభించారు. ఇంకా నెట్టెంపాడు మోటర్లు ప్రారంభం కాలేదు. భీమా-2కు 850 క్యూసెక్కులు, భీమా-1కు 650, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎడుమ కాల్వకు 1000 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రెండ్రోజుల్లో ఆల్మట్టి నుంచి వరద..

ఎగువ నుంచి వరద సమాచారంతో ఆల్మట్టి నుంచి బుధవారం సాయంత్రం పవర్‌హౌజ్ నుంచి 31వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ వరద మొత్తం నదిలోకి రానుండడంతో నేడో, రేపో ఎగువ నుంచి వరద మరింత పెరిగితే జూరాల స్పిల్‌వే గేట్లను ఎత్తేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి ఇంకో మూడు టీఎంసీల అవసరం ఉంది. ఈ రెండు రోజులూ ఆల్మట్టి నుంచి ఇదే వరద కొనసాగితే నారాయణపూర్ జలాశయం నిండనుంది. అయితే ఎగువ నుంచి వరద వస్తుండటంతో నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి కూడా గురువారం సాయంత్రం వరకు గేట్లు ఎత్తే అవకాశాలున్నాయని అక్కడి ప్రాజెక్టు ఇంజినీర్ రాఘవేంద్ర తెలిపారు. ఉజ్జయిని నుంచి 25 వేల క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి దాదాపు 30వేల క్యూసెక్కుల వరద వస్తే జూరాలకు 55వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో ఉండనున్నది. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.90 టీఎంసీల నీరు ఉంది.

తుంగభద్రకు పెరిగిన ఇన్‌ఫ్లో..

కర్ణాటకలోని హోస్పేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు, మూడ్రోజుల కిందటి వరకు ఏడు వేల క్యూసెక్కులతో కొనసాగిన ప్రవాహం, మంగళవారం అర్ధరాత్రి నుంచి పెరిగింది. బుధవారం సాయంత్రం వరకు 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. తుంగభద్రకు కూడా వరద పెరుగడం, తద్వారా నీటి నిల్వ పెరుగుతుండటంతో జిల్లాలోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల్లో సంబురం నెలకొంది. 2010 నుంచి తుంగభద్ర పూర్తిస్థాయి నీటిమట్టానికి సగం దూరంలోనే ఉంటున్నది. కానీ ఈసారి మాత్రం ఇప్పటి వరకు 64 టీఎంసీలకు చేరింది. 25వేల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది.

నిరుద్యోగుల ఆర్థికాభివృద్ధిపై శ్రద్ధ

• ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగుల ఆర్థికాభివృద్ధి కోసం చేపట్టిన స్వయం ఉపాధి పథకాలపై దృష్టిసారించి, వాటిని సమర్థంగా అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్ సూచించారు. ఆయా శాఖల అధికారులతో బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఆమోదించిన కార్యాచరణ ప్రణాళికలను త్వరితగతిన జిల్లాలకు పంపాలన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భూక్యా, మైనారిటీ కార్పొరేషన్ ఉప కార్యదర్శి లియాఖత్, జీఎం ఎస్ బారీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఎండీ విక్టర్, ఎస్టీ కార్పొరేషన్ డీజీఎం కే శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్‌లో జరిగే 'ది మైనింగ్-2017' రిసోర్స్ కన్వెన్షన్ సదస్సుకు హాజరైన టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు

మైనింగ్‌లో నూతన విధానాలపై అధ్యయనం

'ది మైనింగ్-2017' రెండోరోజు సదస్సులో పాల్గొన్న టీఎస్ఎండీసీ బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణానికి ఇబ్బంది లేకుండా మైనింగ్‌లో వివిధ దేశాలు అవలంబిస్తున్న పద్ధతులను టీఎస్ఎండీసీ ప్రతినిధి బృందం అధ్యయనం చేసింది. ఆస్ట్రేలియా న్యూ సౌత్‌వేల్స్‌లో జరుగుతున్న 'ది మైనింగ్-2017' రిసోర్స్ కన్వెన్షన్ సదస్సు రెండోరోజు కార్యక్రమాల్లో టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎండీ మల్లూర్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ సుశీల్‌కుమార్, మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వివిధ దేశాల మైనింగ్ నిపుణులతో మాట్లాడారు. మైనింగ్‌లో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై అధ్యయనం చేశారు.

జెన్‌కో తాత్కాలిక ఉద్యోగులకు గ్రేడ్లవారీగా వేతనాల పెంపు

మొదటిపేజీ తరువాయి...

గ్రేడ్-4 ఉద్యోగులకు రూ.12,217 వేతనాన్ని చెల్లించాలని నిర్ణయించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య గ్రేడ్ల వారీగా

పనిచేసే స్టేషన్	గ్రేడ్-1	గ్రేడ్-2	గ్రేడ్-3	గ్రేడ్-4	మొత్తం
కేటీపీఎస్ 5,6	45	381	192	585	1203
కేటీపీఎస్ ఓఅండ్ఎం	10	119	74	208	411
కేటీపీపీ	26	391	192	131	740
ఆర్టీఎస్	–	13	8	28	49
ఎన్ఎస్‌హెచ్ఈఎస్	3	36	22	48	109
పీజేహెచ్ఈఎస్, ఎల్జేహెచ్ఈఎస్	–	8	13	22	43
ఎస్సెల్బీహెచ్ఈఎస్	–	38	27	83	148
ఎంహెచ్ఎస్	–	6	4	6	16
విద్యుత్ సౌధ	22	73	38	59	192
మొత్తం	**106**	**1065**	**570**	**1170**	**2911**

మెట్రో రైల్ పనుల్లో ఆర్టీసీ సహకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భాగ్యనగరానికి మణిహారంగా నిలిచే మెట్రోరైల్ నిర్మాణానికి టీఎస్ఆర్టీసీ పూర్తి సహకారం అందిస్తుందని సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ తెలిపారు. హైదరాబాద్ మెట్రోరైల్, ఆర్టీసీ మధ్య సమన్వయంపై చర్చించేందుకు ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, రోడ్లు భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు బుధవారం బస్‌భవన్‌లో హెచ్ఎంఆర్, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ పాస్ రూపకల్పన, అభివృద్ధి, ఆదాయాన్ని అంచనా వేయడంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శంకరయ్య, దక్షిణ మధ్యరైల్వే డీఆర్ఎం సుమీత్‌శర్మ పాల్గొన్నారు.



బుధవారం బస్‌భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణారావు, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు

మాజీ ఐపీఎస్ రామకృష్ణారావు కన్నుమూత

సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్ ● అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం




ఉప్పల్, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మాజీ ఐపీఎస్ అధికారి దామరాజు వెంకట లక్ష్మీనర్సింహ రామకృష్ణారావు (83) బుధవారం కన్నుమూశారు. ఒంగోలు జిల్లా ఉప్పలపాడుకు చెందిన ఆయన హైదరాబాద్ హబ్సిగూడ కాకతీయనగర్‌లో నివాసం ఉంటున్నారు. సికింద్రాబాద్‌లోని ఓ దవాఖానలో మృతిచెందారు. రామకృష్ణారావుకు కుమారులు ప్రకాశ్, శ్రీరాం, కుమార్తెలు అనురాధ, రత్నమాల ఉన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి రామకృష్ణారావు మృతికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గురువారం రామకృష్ణారావు అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని సీఎం కేసీఆర్.. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఆదేశించారు. రామకృష్ణారావు మృతికి డీజీపీ అనురాగ్‌శర్మ, ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి అంజనీకుమార్ సంతాపం తెలిపారు. రామకృష్ణారావు 1957లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. మొదట శ్రీకాకుళం ఎస్పీగా పనిచేశారు. డైరెక్టర్ ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీఐజీగా, హైదరాబాద్‌లో అడిషనల్ కమిషనర్‌గా, సీఐడీ ఐజీగా, ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ డీజీపీగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

ఉదయసముద్రానికి నీటి విడుదల

- అక్కంపల్లి నుంచి 200 క్యూసెక్కుల డిశ్చార్జి
- నల్లగొండ, ఫ్లోరైడ్ గ్రామాలకు ఉపశమనం



అక్కంపల్లి జలాశయం నుంచి ఉదయసముద్రానికి విడుదలవుతున్న నీరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్కంపల్లి జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీరు ఉదయసముద్రానికి విడుదలైంది. బుధవారం సాయంత్రం సాగునీటిపారుదల శాఖ అధికారులు నీటిని వదిలారు. దీంతో నల్లగొండ పట్టణంతోపాటు సుమారు 230కిపైగా ఫ్లోరైడ్‌పీడిత గ్రామాల తాగునీటి సరఫరాకు ఉపశమనం కలుగనుంది. హైదరాబాద్ మహా నగరానికి మంజీరా జలాల సరఫరాను పునరుద్ధరించడంతో ఆ మేరకు సాగర్ నీటిని నల్లగొండ సమీపంలోని ఉదయసముద్రం జలాశయానికి తరలించాలని మంగళవారంనాటి సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశించడంతో నీటిపారుదలశాఖ అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సునీల్, ఇతర అధికారులు బుధవారం నల్లగొండ జిల్లా పుట్టంగండి వద్ద పరిస్థితిని సమీక్షించారు. జలమండలి అత్యవసర మోటర్ల ద్వారా మొన్నటిదాకా 675 క్యూసెక్కుల డిశ్చార్జి ఉండగా, దానిని కొంతమేర పెంచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌కు 700 క్యూసెక్కులకుపైగా నీళ్లు వస్తున్నాయి. మంగళవారం వరకు హైదరాబాద్‌కు తాగునీటి కోసం 525 క్యూసెక్కులను సేకరించిన జలమండలి అధికారులు మంజీరా సరఫరా పునరుద్ధరణ కారణంగా 350 క్యూసెక్కులకు తగ్గించారు. దీంతో అక్కంపల్లి రిజర్వాయర్‌లో నిల్వ క్రమేపీ పెరుగుతుంది. బుధవారం 0.15 టీఎంసీలకు నిల్వ చేరుకోవడంతో అధికారులు ఉదయసముద్రానికి నీటిని విడుదలచేశారు. అక్కంపల్లిలో నిల్వ పెరిగేకొద్దీ డిశ్చార్జిని పెంచుతామని సునీల్ తెలిపారు.

ప్రాజెక్టులకు అనుమతుల్లో ముందంజ

- తెలంగాణకు రికార్డ్ సమయంలో పర్యావరణ పర్మిషన్లు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అటవీ, పర్యావరణ అనుమతులను సాధించడంలో తెలంగాణ ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తున్నదని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ప్రాంతీయ అధికారి రాంగోపాల్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలు సకాలంలో పూర్తయితే ప్రజలందరికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వివిధ ప్రాజెక్టులకు అటవీ అనుమతులు ఎలా జారీ అవుతున్నాయి, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో బుధవారం రాంగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల అనుమతుల్లో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో రాష్ట్ర సర్కారు ముందుకుసాగడం ప్రశంసనీయమని ఆయన అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులకు, మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులకు ఎలా అనుమతులిస్తున్నారు, అవి ఏ దశలో ఉన్నాయనే విషయంపై తెలంగాణ అటవీ శాఖ, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు ప్రాజెక్టులకు అనుమతి విషయంలో పురోగతిపై మరోసారి సమీక్షించాలని నిర్ణయించారు. వివిధ పథకాల నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులపై సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, అవసరమైన నిబంధనలను పూర్తిచేయడంలో ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే ముందుందని అధికారులు రాంగోపాల్‌రెడ్డికి వివరించారు. తెలంగాణలో ఇప్పటికే 263 ప్రాజెక్టుల పనులకు రెండోదశ అనుమతులు, 37 ప్రాజెక్టులకు తుది అనుమతులు లభించడం రికార్డ్‌గా చెప్పవచ్చని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా వివరించారు.

ఇద్దరు అదనపు డీసీపీలకు పదోన్నతి.. మరో ఇద్దరికి బదిలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇద్దరు అదనపు డీసీపీలకు కమాండెంట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించి, పోస్టింగ్ ఇచ్చింది. మరో ఇద్దరు కమాండెంట్లను బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన కమాండెంట్లు 15 రోజుల్లో కొత్తపోస్టుల్లో బాధ్యతలు చేపట్టాలని పేర్కొన్నారు. సైబరాబాద్ సెక్యూరిటీ వింగ్ అదనపు డీసీపీగా ఉన్న సీ నారాయణకు హైదరాబాద్‌లో హోంగార్డ్స్ విభాగానికి కమాండెంట్‌గా పదోన్నతి కల్పించారు. హైదరాబాద్ సిటీ సీఎస్‌డబ్ల్యూ అదనపు డీసీపీగా ఉన్న ఎంసీ ప్రతాప్‌కు తెలంగాణలో హోంగార్డ్స్ విభాగానికి కమాండెంట్‌గా పదోన్నతి కల్పించారు. తెలంగాణ హోంగార్డ్స్ కమాండెంట్‌గా ఉన్న వీ దేవేంద్రకుమార్‌ను సీఎస్‌డబ్ల్యూకు అదనపు డీసీపీగా హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్‌సిటీ హోంగార్డ్స్ కమాండెంట్‌గా ఉన్న ఈ విజయ్‌కుమార్‌ను సెక్యూరిటీ వింగ్‌కు అదనపు డీసీపీగా సైబరాబాద్‌కు బదిలీ చేశారు.

రాష్ట్రపతి తిరుమల పర్యటన ఖరారు

తిరుమల: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరుమల పర్యటన ఖరారైంది. సెప్టెంబర్ 2వ తేదీన (శనివారం) తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానం ద్వారా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 4:22 నిమిషాలకు స్విమ్స్ దవాఖానలో నూతన భవనాన్ని ప్రారంభిస్తారు.

నేరెళ్ల ఘటనపై నివేదికల అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేరెళ్ల దళితుల మీద దాడి ఘటన వ్యవహారంపై కరీంనగర్ డీఐజీ, జైలు సూపరింటెండెంట్ నివేదికలను సమర్పించారని బుధవారం ఉమ్మడి హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. ఎస్సై వ్యవహరించిన తీరు అతిగా ఉన్నదనే కారణంతో అతన్ని సస్పెండ్ చేసినట్టు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) డీ ప్రకాశ్‌రెడ్డి న్యాయస్థానానికి తెలిపారు. ఈ నివేదికలను ప్రమాణపత్రంలో దాఖలు చేయడానికి సమయం కావాలని కోరారు. దీంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఆ మేరకు గడువు ఇస్తూ తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. నేరెళ్ల ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని పౌరహక్కుల సంఘం తరపున హైకోర్టులో వ్యాజ్యం దాఖలు కాగా, విచారణ సందర్భంగా డీఐజీ, జైలు సూపరింటెండెంట్ తదితరులు నివేదికలను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. బుధవారం విచారణ సందర్భంగా నివేదికల్లోని వివరాలను అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు వివరించారు. ఆరుగురు బాధితుల్లో నలుగురికి ప్రస్తుతం వైద్య పరీక్షలు అవసరంలేదని, మరో ఇద్దరు వైద్య పరీక్షలకు నిరాకరిస్తున్నారని తెలిపారు.

తెలంగాణ డిస్టిలరీస్ అసోసియేషన్ ఏర్పాటు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర డిస్టిలరీస్ అసోసియేషన్ ఏర్పాటైంది. రాష్ట్ర డిస్టిలరీస్ సభ్యులు సమావేశమై ఈ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్ గురుచరణ్ బగ్గా, జనరల్ సెక్రటరీగా ఎస్ రణ్‌బీర్ బగ్గా, ట్రెజరర్‌గా ఎస్ రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నారు.

హైదరాబాద్ ప్రపంచస్థాయి వైద్య కేంద్రం

హైదరాబాద్: హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఉన్నతమైన వైద్య కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని స్టార్ హాస్పిటల్‌లో సీనియర్ కన్సల్టెంట్ కార్డియాక్ సర్జన్, సజ్జా హార్ట్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సజ్జా లోకేశ్వరరావు ఆధ్వర్యంలోని స్టార్ హాస్పిటల్ బృందం రుజువుచేసింది. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు న్యూయార్క్‌లో 'ద ఇంటర్నేషనల్ కరోనరీ కాంగ్రెస్-2017' సదస్సు నిర్వహించారు. ఇందులో 41 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనగా, అందులో సజ్జా లోకేశ్వర్‌రావు కూడా ఉన్నారు. ఆయన 'అనాలసిస్ ఆఫ్ 30-డేస్ ఔట్‌కమ్స్ ఆఫ్ ఆఫ్ అండ్ ఆన్-పంప్ కరోనరీ ఆర్టరీ బైపాస్‌గ్రాఫ్టింగ్ -ఏ ప్రొపెన్సిటీ మాచ్‌డ్ స్టడీ' పేపర్‌ను ఈ సదస్సులో సమర్పించారు. స్టార్ హాస్పిటల్ బృందంలోని డాక్టర్ గోపీచంద్ మన్నంతో కలిసి లోకేశ్వర్‌రావు 20 ఏండ్ల వ్యవధిలో 28 ఏండ్ల నుంచి 85 ఏండ్ల మధ్య వయసున్న దాదాపు 12 వేల మందికి ఆఫ్ అండ్ ఆన్-పంప్ కరోనరీ ఆర్టరీ బైపాస్‌గ్రాఫ్టింగ్ నిర్వహించి అధ్యయనం చేశారు.

పెట్రోల్‌పై పన్నులు తగ్గించం

స్పష్టం చేసిన చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ఈమధ్యకాలంలో గణనీయంగా పెరిగిన పెట్రో ధరాభారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నులేమైనా తగ్గించబోతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నవారిపై పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీళ్లు చల్లారు. ప్రస్తుతానికైతే పెట్రోల్, డీజిల్‌పై పన్నులు తగ్గించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. పెట్రోలియం ఉత్పత్తులపై విధిస్తున్న పన్నులపై పునరాలోచించాల్సిన పరిస్థితులింకా రాలేదని బుధవారం ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన మీడియాతో అన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితులు ఏర్పడితే ప్రభుత్వం సమీక్షిస్తుందన్నారు. జూలై నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ రెండు నెలల కాలంలో హైదరాబాద్ మార్కెట్లో లీటరు పెట్రోల్ రూ.6కు పైగానే పెరిగింది. డీజిల్ దాదాపు రూ.4 వరకు ప్రియమైంది. గతంలో ప్రతి 15 రోజులకోసారి ధరలను సవరిస్తూ వచ్చిన ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు.. ఆ సంప్రదాయానికి తెరదించుతూ జూన్ 16నుంచి రోజువారీ ధరల మార్పు విధానాన్ని ప్రవేశపెట్టాయి. మొదటి పక్షం రోజులు ధరలు క్రమంగా తగ్గినప్పటికీ.. జూలై 3 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు క్రమంగా పైపైకి ఎగబాకుతూనే ఉన్నాయి. మూడేండ్ల క్రితం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. కానీ, అందుకు అనుగుణంగా పెట్రో రేట్లను తగ్గించకుండా ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ వచ్చింది. నవంబర్ 2014 నుంచి జనవరి 2016 మధ్యకాలంలో పలుదఫాల్లో ఎక్సైజ్ సుంకం పెట్రోల్‌పై రూ.11.77, డీజిల్‌పై రూ.13.47 పెరిగింది.



సెన్సెక్స్	నిఫ్టీ
31,646	9,884
258	88

బంగారం ధరలు

ఢిల్లీ

24 క్యారెట్లు	30,100
22 క్యారెట్లు	29,950
వెండి (కిలో)	41,000

ముడి చమురు (బ్రెంట్)

50.80

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్ఎల్ఎఫ్‌పి
హైదరాబాద్	355-00	355-00
రంగారెడ్డి	355-00	355-00
మెదక్	355-00	355-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారంధర	87.00
రిటైల్ లైవ్	102.00
డ్రెస్డ్	143.00
స్కిన్‌లెస్	168.00

లగ్జరీ కార్ల ధరలకు మళ్లీ రెక్కలు!

సెస్సు 25 శాతానికి పెంపు నిర్ణయానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలుతో భారీగా తగ్గిన లగ్జరీ కార్ల ధరలు మళ్లీ పెరుగనున్నాయి. మధ్యస్థాయి, భారీ, లగ్జరీ కార్లతోపాటు హైబ్రిడ్ మోడళ్లు, స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్ (ఎస్‌యూవీ) గరిష్ఠ సెస్సు పరిమితిని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచేందుకు వీలుగా ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1 నుంచి జీఎస్టీ అమలులోకి వచ్చిన ఫలితంగా ఆడా కార్ల ధరలు రూ.3 లక్షల వరకు తగ్గాయి. అయితే, కొత్త పరోక్ష పన్నుల విధానంలో సాధారణ వస్తువుల రేట్లు మాత్రం గతంలో కంటే పెరిగాయి. ఈ వైరుధ్యాన్ని చక్కదిద్దేందుకే పెద్ద కార్లపై సెస్సు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లుగా తెలుస్తున్నది. బుధవారం క్యాబినెట్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మీడియాతో మాట్లాడుతూ.. గరిష్ఠ సెస్సు పరిమితిని పెంచేందుకు ఆర్డినెన్స్ లేదా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా జీఎస్టీ (రాష్ర్టాలకు నష్టపరిహారం) చట్టం-2017లో తగిన సవరణ చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఏ విభాగ కార్లపై ఎంత సెస్సు విధించాలి, పెంపును ఎప్పటి నుంచి అమలు చేయాలనేది జీఎస్టీ మండలి నిర్ణయిస్తుందని జైట్లీ తెలిపారు. ఈనెల 9న హైదరాబాద్‌లో అరుణ్ జైట్లీ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కాబోతున్నది. పార్లమెంట్ సమావేశాలు జరుగని సమయాల్లో చట్టాన్ని సవరించేందుకు ఆర్డినెన్స్ జారీ చేస్తారు. ఆ ఆర్డినెన్స్‌ను రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంటుంది. అయితే, ఆ చట్ట సవరణపై ఆరు నెలల్లో పార్లమెంట్ ఆమోదం కూడా పొందాల్సి ఉంటుంది. తదుపరి పార్లమెంట్ సమావేశాలు నవంబర్ లేదా డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

విలాస వస్తువుల ధరలు తగ్గి, నిత్యావసరాలు ప్రియం కావడం జీఎస్టీ ఉద్దేశం కాదని జైట్లీ అన్నారు. 'ఒకవేళ పన్నుల ఊరట ఇస్తే సాధారణ ప్రజలకివ్వాలి గానీ లగ్జరీ ఉత్పత్తులపైన కాదు. రూ.కోటితో కారు కొనగలిగే వ్యక్తి రూ.1.20 కోట్లు వెచ్చించైనా ఆ వాహనాన్ని దక్కించుకోగలడు' అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన డజనుకుపైగా పరోక్ష పన్నులన్నింటి స్థానంలో కేంద్రం జీఎస్టీని ప్రవేశపెట్టింది. కొత్త పరోక్ష పన్నుల విధానంలో కార్లపై 28 జీఎస్టీతోపాటు మోడల్‌ను బట్టి 1 నుంచి 15 శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. సెస్సు వసూలు ద్వారా పోగైన నిధులను కార్పస్ ఫండ్‌గా ఏర్పాటు చేసి జీఎస్టీ అమలు కారణంగా నష్టపోతున్న రాష్ర్టాలకు కేంద్రం పరిహారం చెల్లించనున్నది. జీఎస్టీ అమలుతో కార్లపై మొత్తం పన్ను భారం గత విధానంలో కంటే తగ్గింది.

ప్రస్తుతం మధ్య స్థాయి వాహనాలు, ఎస్‌యూవీలు, మిడ్, లార్జ్, హైబ్రిడ్ కార్లపై 28 శాతం జీఎస్టీతోపాటు 15 శాతం సెస్సు విధిస్తున్నారు. 4 మీటర్లు, 1,200 సీసీలోపు ఇంజిన్ సామర్థ్యం కలిగిన చిన్న పెట్రోల్ కార్లపై 28 శాతం జీఎస్టీతో పాటు ఒక శాతం సెస్సు వర్తిస్తుంది. ఇక 4 మీటర్లు, 1,500 సీసీ లోపు ఇంజిన్ కెపాసిటీ కలిగిన డీజిల్ కార్లపై 28 శాతం జీఎస్టీతోపాటు 3 శాతం సెస్సు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 15 శాతం సెస్సు వర్తించే కార్లపై పన్ను భారం మరో పది శాతం పెరుగనుందని ఓ అధికారి తెలిపారు. సెస్సును 15 శాతం నుంచి 25 శాతానికి పెంచేందుకు వీలుగా జీఎస్టీ చట్టంలో సవరణ చేయాలని ఈనెల 5న జరిగిన సమావేశంలో జీఎస్టీ మండలి కేంద్రానికి ప్రతిపాదించింది. వాహనాల్లో మొత్తం 12 రకాల విభాగాలున్నాయని, అందులో కేవలం 2 క్యాటగిరీలపైనే సెస్సు పెంపు ప్రభావం ఉండనుందని జైట్లీ అన్నారు. కార్ల విభాగాల్లో మార్పు లేదని, కేవలం లగ్జరీ క్యాటగిరీ తప్ప మరే ఇతర కార్లపై పన్ను భారం పెంచే ఉద్దేశం లేదని రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా అన్నారు.



లగ్జరీ కార్ల మార్కెట్ వృద్ధిపై ప్రభావం: ఆటో ఇండస్ట్రీ

సెస్సు పెంపు నిర్ణయం భారత్‌లో లగ్జరీ, ఎస్‌యూవీ కార్ల విభాగ వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపనుందని మెర్సిడెజ్ బెంజ్, ఆడీ, జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్ఆర్)తోపాటు పలు ఆటో సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. సెస్సు పెంపు విషయంలో ప్రభుత్వం తొందరపడుతున్నదని విమర్శించిన సంస్థలు.. జీఎస్టీ ప్రభావంపై ఆరు నెలల్లో స్పష్టత వస్తుందని, ఈ అంశాన్ని పరిశీలించి పున: సమీక్షించాల్సిందని అభిప్రాయపడ్డాయి. కేంద్రం నిర్ణయంతో దేశీయ మార్కెట్లో లగ్జరీ కార్ల వృద్ధిపై తీవ్ర ప్రభావం పడనుందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్గర్ అన్నారు.

అరబిందో చేతికి 'శ్రేయా లైఫ్' రష్యా విభాగం!?

డీల్ విలువ 8-10 కోట్ల డాలర్లుగా ఉండే అవకాశం

ముంబై, ఆగస్టు 30: రాష్ర్టానికి చెందిన ఔషధ తయారీదారు అరబిందో ఫార్మా.. ముంబై ఫార్మా సంస్థ శ్రేయా లైఫ్ సైన్సెస్‌కు చెందిన రష్యా వ్యాపార విభాగాన్ని కొనుగోలు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇరు సంస్థల మధ్య ఈ విషయమై చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. ఒప్పందం విలువ 8-10 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ఈ విషయంపై అరబిందో ఫార్మా స్పందించలేదు. శ్రేయా లైఫ్ ప్రతినిధి మాత్రం అలాంటి ప్రతిపాదనేది లేదన్నారు. 2001లో ఏర్పాటైన శ్రేయా లైఫ్ సైన్సెస్.. పలు రకాల ఫార్మా ఉత్పత్తులను తయారు చేయడంతోపాటు మార్కెటింగ్ చేస్తున్నది. 2002లో సంస్థ రష్యా మార్కెట్లోనూ కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం రష్యాలో 81 రకాల ఉత్పత్తులను విక్రయిస్తున్నది. రష్యాతోపాటు ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్, కజకిస్థాన్.. ఇంకా ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆగ్నేయ ఆసియా మార్కెట్లకూ కార్యకలాపాలు విస్తరించింది. దేశంలోని టాప్ టెన్ ఫార్మా కంపెనీల్లో అరబిందో ఒకటి. ప్రస్తుతం 125 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అరబిందో ఫార్మాకు 70 శాతం ఆదాయం విదేశీ మార్కెట్ల నుంచే సమకూరుతున్నది.

బీఎస్ఎన్ఎల్ వెల్‌కమ్ ఆఫర్

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ అనంతరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా కొత్త వినియోగదారులకు, ఎంఎన్‌పీ ద్వారా సంస్థ నెట్‌వర్క్‌కు మారిన వారికి 350ఎంబీ ఉచిత డాటా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ డాటాను మొదటి 30 రోజుల లోపు మాత్రమే వాడుకోవాలన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 1503, 18001801503ని సంప్రదించాలని కోరారు.

మారుతి సుజుకీ నయా అవతార్!

- చిన్న కార్ల విక్రయం కోసం ప్రత్యేక షోరూంలు



ఢిల్లీలో తొలి మారుతి సుజుకీ అరెనా షోరూం ప్రారంభ కార్యక్రమంలో సంస్థ ఎండీ, సీఈవో కెనిచి అయుకవ, ఈడీ ఆర్ఎస్ కల్సి

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ.. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ ప్రియులను ఆకట్టుకునేలా షోరూంలను రీబ్రాండింగ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై చిన్న కార్లను 'మారుతి సుజుకీ అరెనా' షోరూంల ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఇప్పటికే సియాజ్.. బాలెనో, విటారా బ్రెజ్జా, ఎస్‌క్రాస్, సియాజ్ వంటి ప్రీమియం మోడళ్లను విక్రయించేందుకు నెక్సా పేరుతో ప్రత్యేక షోరూంలను ఏర్పాటు చేసింది. సంస్థ రూపాంతర ప్రయత్నాల్లో భాగంగానే షోరూం బ్రాండ్‌నేమ్‌ను మార్చినట్లు మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో కెనిచి అయుకవ తెలిపారు. షోరూంల రీబ్రాండింగ్ దశలవారీగా జరుగనున్నట్లు, వచ్చే 3-5 ఏండ్లలో సంస్థకు చెందిన చిన్న కార్ల విక్రయ షోరూంలన్నింటిని మారుతి సుజుకీ అరెనా రిటైల్ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి నాటికల్లా 80 మారుతి సుజుకీ అరెనా షోరూంలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 1,683 నగరాల్లో 2,050 షోరూంలను నిర్వహిస్తున్నది. నిమిషానికి తొమ్మిది కార్లు విక్రయిస్తుండగా.. రోజుకు 1.26 లక్షల మంది కస్టమర్లతో సంప్రదింపులు జరుపుతున్నది.

జీఎస్టీతో ప్రత్యక్ష పన్ను వసూళ్లకూ ఊతం!

- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక మంత్రి జైట్లీ. చిత్రంలో ఉన్నవారు జస్టిస్ ఏకే సిక్రీ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: గతనెల ఒకటి నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ విధానం ఆదాయం పన్ను, కార్పొరేట్ ట్యాక్స్ వంటి ప్రత్యక్ష పన్నులపైనా ప్రభావం చూపనుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. జీఎస్టీ పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చాక ప్రత్యక్ష పన్ను వసూళ్లు కూడా పుంజుకునే అవకాశం ఉందని బుధవారం ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అన్నారు. జీఎస్టీ విధానంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పరిష్కరించేందుకు బిల్లులను సరిపోల్చే ప్రక్రియ మొదలయ్యాక వ్యాపారులకు పన్ను చట్టాలకు ఏమేర కట్టుబడి ఉంటున్నారనే విషయంపై స్పష్టత రానుందన్నారు. జీఎస్టీ అధికారులు పన్ను చెల్లింపులను పొంతనలేకుండా బిల్లులు సమర్పించే వారి వెంటపడనున్నారని జైట్లీ హెచ్చరించారు. గడిచిన 2-3 ఏండ్లలో పన్ను ఎగవేతలకున్న మార్గాలు ఒక్కటొక్కటిగా మూసివేయడం జరిగిందని, దాంతో చాలామందికి ఊపిరాడని షాక్ తగిలిందన్నారు. జీఎస్టీ విషయంలో ప్రస్తుతం వ్యాపారులకు స్వల్పంత సమ్మతితో పన్నులు చెల్లించే వెసులుబాటు కల్పించామన్న మంత్రి.. బిల్లులను పన్ను చెల్లింపులతో సరిపోల్చే ప్రక్రియ మొదలయ్యాక వారు పన్ను చట్టాలకు ఏమేర లోబడుతున్నారనే విషయం అవగతం అవుతుందన్నారు.

ఎన్‌టీపీసీ వాటా విక్రయానికి అపూర్వ స్పందన

7% వాటా ఉపసంహరణ.. కేంద్రానికి 9,100 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశంలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్'లో (ఎన్‌టీపీసీ) వాటా విక్రయానికి భారీ స్పందన లభించింది. కేంద్రం నుంచి 7 శాతం వాటా కొనుగోలుకు బిడ్లు దాఖలయ్యాయి. తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.9,100 కోట్ల ఆదాయం సమకూరనుంది. సంస్థలో 5 శాతం వాటా విక్రయ ప్రతిపాదనతో కేంద్రం..ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలో 42.22 కోట్ల షేర్లను వేలానికి పెట్టింది. షేర్ కనీస ధరను రూ.168గా నిర్ణయించింది. ఒకవేళ అధిక బిడ్లు దాఖలైతే మరో ఐదు శాతం వరకు వాటాను విక్రయించాలనుకుంది. ఈ ఆఫర్‌లో సంస్థాగత ఇన్వెస్టర్లకు 32.98 కోట్ల షేర్లను కేటాయించగా.. వారి నుంచి 46.35 కోట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లకు 11.58 కోట్ల షేర్లను కేటాయించినప్పటికీ 8.45 కోట్ల షేర్ల కొనుగోలుకు మాత్రమే బిడ్లు వచ్చాయి. ఇరు వర్గాల నుంచి వచ్చిన బిడ్లను సర్దుబాటు చేసుకొని ఏడు శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించినట్లు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017-18) ఇప్పటివరకు కేంద్రం 6 కంపెనీల్లో వాటాల ఉపసంహరణ ద్వారా రూ.8,800 కోట్లు సమీకరించగలిగింది. ఎల్ అండ్ టీలోని యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్(ఎస్‌యూయూటీఐ) వాటాను కూడా విక్రయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.72,500 కోట్ల సేకరణ చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో రూ.46,500 కోట్లు మైనారిటీ వాటాల విక్రయం ద్వారా, మరో రూ.15వేల కోట్లు వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రాబట్టాలని అనుకుంటున్నది.

త్వరలో సలహాదారుల నియామకం

ఎయిర్‌ఇండియాలో వాటా విక్రయంపై ఆర్థిక మంత్రి జైట్లీ



న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్‌ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) కోసం లావాదేవీ సలహాదారులను నియమించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంస్థలో వాటా విక్రయాన్ని వేగవంతం చేసేందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మంత్రుల బృందం బుధవారం నాడు సమావేశమైంది. ఎయిర్‌ఇండియా డిజిన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన పలు అంశాలపై మంత్రుల బృందం సుమారు గంటపాటు చర్చించింది. సంస్థలో వాటా విక్రయం కోసం ట్రాన్సాక్షన్ అడ్వైజర్లను నియమించుకోవాలని నిర్ణయించినట్లు సమావేశం అనంతరం జైట్లీ తెలిపారు. ఈ సమావేశంలో జైట్లీతోపాటు విమాన మంత్రి అశోక్ గజపతిరాజు, రైల్వే మంత్రి సురేశ్ ప్రభు, విద్యుత్ మంత్రి పీయూష్ గోయల్, ఎయిర్ ఇండియా తాత్కాలిక సీఎండీ రాజీవ్ బన్సల్, సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎయిర్‌ఇండియా ప్రైవేటీకరణపై ఇక వేగవంతంగా నిర్ణయాలు తీసుకోనున్నట్లు అరుణ్ జైట్లీ సంకేతాలిచ్చారు. ఎయిర్‌ఇండియాతోపాటు దాని ఐదు అనుబంధ విభాగాల్లో వాటా విక్రయానికి కేంద్ర క్యాబినెట్ జూన్‌లో ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సంస్థపై రూ.52 వేల కోట్ల మేర రుణభారం ఉంది. సంస్థను పునరుద్ధరించేందుకు 2012లో యూపీఏ-2 ప్రభుత్వం రూ.30 వేల కోట్ల ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది.

ఎయిర్‌ఇండియాపై బర్డ్ గ్రూపు ఆసక్తి

ఎయిర్ ఇండియాకు చెందిన గ్రౌండ్ హ్యాండ్లింగ్ అనుబంధ విభాగం ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్‌ను (ఏఐఏటీఎస్ఎల్) కొనుగోలు చేసేందుకు బర్డ్ గ్రూపు ఆసక్తి కనబర్చింది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించనున్నట్లు ప్రకటించిన మరుసటి రోజే ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ 'ఇండిగో' ఆసక్తి కనబర్చిన విషయం తెలిసిందే. తాజాగా విమానయాన సేవల సంస్థ బర్డ్ గ్రూపు కూడా ఏఐఏటీఎస్ఎల్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నట్లుగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. బుధవారం జైట్లీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విమాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు.

విప్రో బైబ్యాక్‌కు షేర్‌హోల్డర్ల ఆమోదం

రూ.11 వేల కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశంలో మూడో అతిపెద్ద ఐటీ సంస్థ విప్రో రూ.11,000 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) ప్రతిపాదనకు వాటాదారులు ఆమోదం తెలిపారు. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ గతనెలలో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. సెకండరీ మార్కెట్ నుంచి సంస్థకు చెందిన 34.375 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.320 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం మొత్తం పదకొండు వేల కోట్ల రూపాయలు వెచ్చించనున్నట్లు విప్రో వెల్లడించింది. బైబ్యాక్ తీర్మానంపై జరిగిన బ్యాలెట్, ఈ-ఓటింగ్‌లో పోలైన ఓట్లలో మెజారిటీ వాటాదారులు (99.68 శాతం) ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ సమాచారం అందించింది. సంస్థ వద్దనున్న నగదు నిల్వలను షేర్ల తిరిగి కొనుగోలు ద్వారా వాటాదారులకు పంచనుంది. తద్వారా ఈపీఎస్ (ఎర్నింగ్ పర్ షేర్) కూడా మెరుగుపడనున్నాయి. సాధారణంగా ఐటీ రంగం అనిశ్చితిలో కొనసాగుతున్న నేపథ్యంలో స్టాకుల ధరకు మద్దతు లభించనుంది. ఈ ఏడాది జూన్ 30 నాటికి విప్రో వద్దనున్న నగదు, నగదుతో సమానమైన నిల్వలు రూ.5,432 కోట్లుగా నమోదయ్యాయి. అలాగే సంస్థ రూ.31,772 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టింది. దేశంలో అతిపెద్ద ఐటీ సంస్థ టీసీఎస్ ఈమధ్యే రూ.16 వేల కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. నం.2 కంపెనీ ఇన్ఫోసిస్ సైతం రూ.13,000 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది.

ప్రమోటర్లకూ కావాలిగా డివిడెండ్: బాల

షేర్ల బైబ్యాక్‌లో తాము పాల్గొనాలని అనుకుంటున్నట్లు ప్రమోటర్ గ్రూపునకు చెందిన కొంతమంది సమాచారం ఇచ్చినట్లు సోమవారం ఇన్ఫోసిస్ తెలిపింది. ఈ విషయంపై కంపెనీ మాజీ సీఎఫ్‌వో వీ బాలకృష్ణన్ స్పందిస్తూ.. బైబ్యాక్‌లో ప్రమోటర్లు తమ వాటా షేర్లను విక్రయించడం మార్కెట్‌కు తప్పుడు సంకేతాలు ఇవ్వడమే అన్నారు. సాధారణ పరిస్థితుల్లో ప్రమోటర్లు వాటాను తగ్గించుకుంటే ఆందోళన చెందాల్సి ఉంటుందని బాల.. బైబ్యాక్ ప్రక్రియ షేర్‌హోల్డర్లకు డివిడెండ్ చెల్లించేందుకు అనుసరించే ప్రత్యామ్నాయ మార్గమని పేర్కొన్నారు. రూ.13వేల కోట్ల బైబ్యాక్ ప్రణాళికలో భాగంగా ఇన్ఫోసిస్ మొత్తం 11.3 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.1,150 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇన్ఫోసిస్‌లో సహ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణమూర్తితో పాటు ఇతర ప్రమోటర్లకు 12.75 శాతం వాటా ఉంది.

రద్దయిన నోట్లన్నీ వాపస్!

మొదటిపేజీ తరువాయి...

వాటిలో 676.9 కోట్ల నోట్లు వెనుకకు వచ్చాయి. కేవలం 1.3% నోట్లు మాత్రమే (8.9 కోట్ల నోట్లు) ఆగిపోయాయి. రూ.500 నోట్లు రద్దు అయ్యే సమయానికి 1716.5 కోట్ల నోట్లు చలామణిలో ఉండగా.. రూ.16,050 కోట్ల విలువైన కరెన్సీ నోట్లు బ్యాంకుల్లో తిరిగి జమ కాలేదు. రద్దు చేసిన నోట్ల స్థానంలో కొత్త కరెన్సీని ముద్రించడానికి రూ.7,965 కోట్లు ఖర్చయినట్లు ఆర్బీఐ తన నివేదికలో తెలిపింది. ఇదంతా కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందని విపక్షాలు మండిపడగా.. అవగాహన లేకే సర్కార్‌ను విమర్శిస్తున్నారని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఎదురుదాడికి దిగారు. నల్లధన నిరోధానికి రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తున్నట్లు గతడాది నవంబర్ 8న ప్రధాని మోదీ హఠాత్తుగా ప్రకటించారు. పాత నోట్లు 50 రోజుల్లోగా బ్యాంకుల్లో జమచేయాలని సూచించారు. 1,716.5 కోట్ల రూ.500 నోట్లు, 685.8 కోట్ల రూ.1000 నోట్లు చలామణిలో ఉన్నట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ గత డిసెంబర్‌లో పార్లమెంటుకు ఇచ్చిన సమాధానంలో చెప్పారు. ఆ మొత్తం విలువ రూ.15.44 లక్షల కోట్లు. అందులో 99 శాతం అంటే రూ.15.28 లక్షల కోట్లు వెనుకకు వచ్చాయి. బ్యాంకుల్లో పాత నోట్ల డిపాజిట్‌కు అనుమతించినా అసాధారణ స్థాయి జమలపై ఐటీ నిఘా వేశారు. పాత రూ.500 నోట్ల స్థానంలో కొత్తనోట్లతోపాటు రూ.2000 నోటును ప్రవేశపెట్టారు. చిల్లర కొరతతో ఇటీవల రూ.200 నోటును ప్రవేశపెట్టారు. నోట్ల ముద్రణ వ్యయం 2015-16లో రూ.3421 కోట్లు ఉండగా 2016-17లో అది రెట్టింపు అయ్యి రూ.7,965 కోట్లకు చేరుకుందని ఆర్బీఐ తన నివేదికలో తెలిపింది. కొత్త నోట్ల ముద్రణే దీనికి కారణమన్నది. 2017 మార్చిలోపు చలామణిలో ఉన్న నోట్ల విలువ 20.2% తగ్గిపోయి రూ.13.1 లక్షల కోట్లని తేలింది. చలామణిలో ఉన్న నోట్లలో రూ.2000 నోట్ల విలువ 50.2 శాతంగా ఉంది.

7.62 లక్షల నకిలీ నోట్లు

గతేడాది బ్యాంకింగ్ వ్యవస్థలో 7.62 లక్షల నకిలీ నోట్లు గుర్తించామని ఆర్బీఐ తెలిపింది. రూ.100 నోటు మినహా మిగతా అన్ని నోట్లలో బ్యాంకులకు చేరుతున్న నకిలీల్లో రూ.500, రూ.1000 నోట్లు అధికంగా వచ్చాయి. ప్రతి కోటి 500 నోట్లలో నకిలీవి 71 ఉన్నట్లు తేలింది. ప్రతి కోటి వెయ్యి నోట్లలో 191 నకిలీ నోట్లు దొరికాయి. 2015-16లో ఇవి పదిలక్షలకు 2.4 (రూ.500), 5.8 (రూ.1000) మాత్రమే ఉన్నాయి.

ఆర్బీఐకి సిగ్గు చేటు: చిదంబరం

పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకులకు చేరుకున్న నోట్లపై ఆర్బీఐ విడుదల చేసిన వివరాల ఆధారంగా విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్, సీపీఎం సర్కార్‌పై ధ్వజమెత్తాయి. కొండను తవ్వి ఎలుకను పట్టారని విమర్శించాయి. నోట్లరద్దుతో లాభం కన్నా నష్టమే ఎక్కువ అని కాంగ్రెస్ నేత పీ చిదంబరం ధ్వజమెత్తారు. నోట్లరద్దు అనే మహత్తర సలహా ఇచ్చినందుకు ఆర్బీఐకి ఆర్థిక నోబెల్ బహుమతి ఇవ్వాలని ఎద్దేవా చేశారు. కేవలం 1 శాతం నోట్లు మాత్రమే వెనుకకు రాలేదన్న ఆర్బీఐ ప్రకటనపై మండిపడ్డారు. ఆర్బీఐకి ఇది చాలా సిగ్గుచేటైన విషయమని అన్నారు. ఇంతకూ మోదీ సర్కారు ఉద్దేశమేమిటి? నల్లధనాన్ని తెలుపు చేయడమా? అని నిలదీశారు. '15.4 లక్షల కోట్ల పాతనోట్లలో కేవలం రూ.16 వేల కోట్లు (కేవలం 1 శాతం) వెనుకకు రాలేదు. ఇదే ఆర్బీఐకి దక్కిన లాభం. కానీ కొత్తనోట్ల ముద్రణ వల్ల రూ.21 వేల కోట్లు కోల్పోయింది. ఈ సలహా ఇచ్చిన ఆర్థికవేత్తలకు నోబెల్ బహుమతి ఇవ్వాలి' అని చిదంబరం వరుస ట్వీట్లలో అపహాస్యం చేశారు.

ఇంతకూ నల్లధనం ఏది?: ఏచూరి

నోట్లరద్దు తర్వాత 99% నోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయన్న ఆర్బీఐ ప్రకటనపై సీపీఎం నేత సీతారాం ఏచూరి సర్కారును నిలదీశారు. '99.9% రద్దయిన నోట్లు వెనుకకు వచ్చాయి. కానీ వందల మంది లైన్లలో నిల్చుని ప్రాణాలు విడిచారు. పేదలు ఎక్కువ కష్టాలు ఇబ్బందుల పాలయ్యారు' అని ఆయన ట్విట్టర్‌లో విమర్శించారు. 'ప్రాణాలు, జీవికలు నష్టమయ్యాయి.. ఆర్థిక వ్యవస్థ పాక్‌కు గురైంది. కార్మికులు ఉపాధి కోల్పోయారు. మోదీ ప్రభుత్వం జాతివ్యతిరేక చర్యను భారత్ ఎప్పుడూ క్షమించదు' అంటూ ఏచూరి విరుచుకుపడ్డారు.

అరకొర అవగాహనతోనే విమర్శలు: జైట్లీ

నల్లధనాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియనివారే నోట్లరద్దును వెనుకకు వచ్చిన కరెన్సీతో పోల్చి చూస్తున్నారని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ విపక్షాలపై ఎదురుదాడికి దిగారు. డబ్బును జప్తు చేయడం దాని ఉద్దేశం కాదని, చలామణిలో ఉన్న నగదు లెక్కలోకి రావడమే దాని లక్ష్యమని వ్యాఖ్యానించారు. నోట్లరద్దు లక్ష్యం నగదును వ్యవస్థలోకి తేవడం, డిజిటలైజేషన్ ప్రవేశపెట్టడం, పన్ను పరిధిని విస్తరించడం, నల్లధనాన్ని నిర్మూలించడం అని జైట్లీ చెప్పారు. పెద్ద నోట్ల రద్దు లక్ష్యం నూటికి నూరుశాతం విజయవంతమైందని చెప్పారు. నోట్లరద్దువల్ల నగదుకు కొరత ఏర్పడడం వల్లనే ఉగ్రవాద దాడులు తగ్గాయని ఆయన అన్నారు. నల్లధనం పై ఒక్క చర్య తీసుకోనివారికి నోట్లరద్దు లక్ష్యం అర్థం కాదని దుయ్యబట్టారు. బ్యాంకుల్లో జమ చేసినంత మాత్రాన నల్లధనం తెల్లధనంగా మారబోదని జైట్లీ గుర్తు చేశారు. డబ్బును స్వాధీనం చేసుకునేందుకు నోట్లరద్దును తేలేదని వివరణ ఇచ్చారు. రాజకీయ విరాళాల సేకరణను శుద్ధిపర్చడం తమ తదుపరి లక్ష్యమని ఆర్థికమంత్రి అన్నారు.

పాల్వంచ కేటీపీఎస్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

జెన్‌కోలో రెండో విడుతగా 778 మంది కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్‌లో టీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గులాల్ చల్లుకొని సంబురాలు చేసుకొన్నారు.

-పాల్వంచ



శివ శివా!

- కాళేశ్వరంలో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు నిర్వాకం
- గుడి తలుపులు తెరిపించి మరీ పూజలు

కాళేశ్వరం: కాళేశ్వర క్షేత్రంలో అపచారం జరిగిపోయింది. తన హోదాను చాటుకోవడం కోసం మూసి ఉన్న ఆలయ తలుపులు తెరిపించి మరీ పూజలు చేయించుకున్నారు ఓ మాజీ మంత్రి. శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి దేవస్థానానికి బుధవారం మధ్యాహ్నం మాజీ మంత్రి శ్రీధర్‌బాబు కార్యకర్తలతో వచ్చారు. సాధారణంగా ఆలయంలో ధూపదీప నైవేద్యం అనంతరం మధ్యాహ్నం 1.30లకు ఆలయ ద్వారాలు మూసివేస్తారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు తెరువడం ఆనవాయితీ. ఎప్పటిలాగే బుధవారం మధ్యాహ్నం ఆలయ ద్వారాలు మూసివేశారు. గణనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినందున దక్షిణ ద్వారం ఒక్కటి తెరిచి ఉంచారు. కానీ, సదరు మాజీ మంత్రి మాత్రం మధ్యాహ్నం 2 గంటలకు ఆలయానికి వచ్చారు. వెంటనే ఈవో శ్రీనివాస్‌కు ఫోన్ చేసి, అర్చకులను రప్పించుకుని ద్వారాలు తెరిపించుకున్నారు. గర్భగుడితోపాటు సరస్వతీ ఆలయ తలుపులు తెరిపించారు. వాస్తవానికి ఆ సమయంలో ఎలాంటి పూజలు చేయని అర్చకులచే వేద మంత్రాలు చదివించుకొని సన్మానం చేయించుకున్నారు. ఒకసారి ఆలయ తలుపులు మూసివేశాక తిరిగి సాయంత్రం వేళలో మాత్రమే తెరువాల్సి ఉంటుందని ఆలయ అర్చకులు చెబుతున్నారు.



గర్భ గుడిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీధర్‌బాబు

ఆహారోత్పత్తి పరిశ్రమలకు సత్వర అనుమతులు

రుద్రూర్: రాష్ట్రంలో ఆహారోత్పత్తి పరిశ్రమల ఏర్పాటుకు యువకులు ముందుకు వస్తే పక్షంరోజుల్లో అనుమతులు ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామ రుద్రూర్ వరి, చెరుకు పరిశోధన స్థానంలో రూ.16.50 కోట్లతో నిర్మించిన ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలను బుధవారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి మంత్రి పోచారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కళాశాల దేశంలో పదమూడోది కాగా, తెలంగాణలో మొదటిదన్నారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా 5 బీఎస్సీ అగ్రికల్చర్, 4 పాలిటెక్నిక్ కళాశాలలు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఆహార ఉత్పత్తి పరిశ్రమలు రూ.5 కోట్ల పెట్టుబడి పెడితే 15 రోజుల్లో, రూ.5 కోట్లలోపు పెట్టుబడి పెడితే 30 రోజుల్లో అనుమతి పత్రాలను ఇంటికి పంపిస్తామని తెలిపారు. ఈ ఏడాది మరో 526 ఏఈవో పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ప్రకటించారు. పంట భూముల రిజిస్ట్రేషన్‌ను మండలంలోని తహసీల్దార్లకే అప్పగిస్తామని మంత్రి తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



కడెం జలాశయ ప్రధాన గేటు నుంచి గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

గోదావరి గలగల

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి,మంజీరపై నిర్మించిన ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఎస్సారెస్పీ,కడెం,నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 38,864 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ఎగువ ప్రాంతాల నుంచి ఈ సీజనులో రిజర్వాయర్‌లోకి 25 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 90.313 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 1072.60 అడుగులు 34.401టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.600టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 698.60 అడుగులు (7.240టీఎంసీల) వద్ద ఉంది. బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి ఉదయం 4110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఏడో నంబర్ గేటు ద్వారా 5200 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేశారు. మధ్యాహ్నం 7,911 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరుగడంతో 10,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం ఇన్‌ఫ్లో 2525 క్యూసెక్కులకు తగ్గింది. అయినప్పటికీ అధికారులు 10,800 క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి 559 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1765 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు)కు గాను 1386.25 అడుగులు (2.719 టీఎంసీలు)ల వద్ద ఉంది.

ఎస్సారెస్పీలో విద్యుదుత్పత్తి ప్రారంభం

ఎస్సారెస్పీ వద్ద ఉన్న తెలంగాణ జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తిని ఎస్‌ఈ బి.చంద్రయ్య బుధవారం రెండు టర్బాయిన్ల ద్వారా ప్రారంభించారు. ఒక్కో టర్బాయిన్ నుంచి 6 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతున్నదని ఎస్‌ఈ తెలిపారు.

గడువునాటికి భగీరథ నీళ్లివ్వాలి

సీఎం కేసీఆర్ నిర్ణయించిన గడువు నాటికి మిషన్ భగీరథ పనులు పూర్తి చేసి తాగునీరందించాలని మంత్రులు ఉద్ఘాటించారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మంత్రులు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. వరంగల్‌లో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, నల్లగొండలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ జితేందర్‌రెడ్డి సమీక్షలు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



వరంగల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎంపీ దయాకర్

పనులపై నిర్లక్ష్యం వీడాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష లో డిప్యూటీ సీఎం కడియం

వరంగల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: మిషన్ భగీరథ పనులపై నిర్లక్ష్యం వీడాలని, సీఎం కేసీఆర్ విధించిన గడువులోగా పనులు పూర్తి చేసి ఎట్టి పరిస్థితిలోనూ వచ్చే ఏడాది జనవరి నాటికి తాగునీరందించాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. మిషన్ భగీరథ పనులు, రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, చేపపిల్లల పంపిణీపై ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఐదుగురు కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో హన్మకొండలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగీరథ పనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నా పనులు అనుకున్నంత వేగంగా జరుగడం లేదన్నారు. డిసెంబర్ 31 నాటికి పనులు పూర్తి చేసే విధంగా రివైజ్డ్ షెడ్యూల్ ఇచ్చారు. మిషన్ భగీరథ పనులు జాప్యం కావడానికి చెప్పిన కారణాలు తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకు కలెక్టర్లు చొరవ చూపాలన్నారు. 50శాతం నీరు నిండినా చెరువులన్నింటిలో వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు చేపపిల్లలను చెరువుల్లో వేయాలన్నారు. సమావేశంలో ఎంపీలు సీతారాం నాయక్, పసునూరి దయాకర్, విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, దాస్యం వినయభాస్కర్, కొండా సురేఖ, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేశ్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, శంకర్ నాయక్, వరంగల్ రూరల్, అర్బన్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

సాగు, తాగునీరు అందించడమే లక్ష్యం

- ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్ల సమీక్షలో మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పంటలకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభు త్వం పనిచేస్తున్నదని విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, రైతు సమన్వయ కమిటీల ఏర్పాటుపై నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు గౌరవ్ ఉప్పల్, కె.సురేంద్రమోహన్, అనితారామచంద్రన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కర్షకుల సమస్యల పరిష్కారానికి రైతు సమితులు ఎంతో కృషి చేస్తాయని తెలిపారు. మిషన్ భగీరథపై మంత్రి మాట్లాడుతూ నిర్దేశిత సమయంలోపు పనులు పూర్తయ్యేలా అధికారులు క్షేత్ర స్థాయి సందర్శనలు జరుపాలని సూచించారు. పది ఇండ్లు ఉన్న ఆవాసానికీ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో వ్యవసాయశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు

అక్టోబర్ 31 వరకు పనులు పూర్తి కావాలి

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఎట్టి పరిస్థితిలోనైనా అక్టోబర్31 నాటికి మిషన్ భగీరథ పనులు పూర్తి కావాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ జెడ్పీ కార్యాలయంలో మిషన్ భగీరథ పనులపై అధికారులతో మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తవ్వకాలు జరిపిన రోడ్డు పనులు పూర్తయిన తర్వాతనే ఏజెన్సీలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అదనంగా వాటర్ ట్యాంక్‌లు కావాల్సిన గ్రామాల వివరాలను త్వరితగతిన పంపించాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో నాగర్‌కర్నూల్, గద్వాల కలెక్టర్లు శ్రీధర్, రజత్‌కుమార్ సైనీ పాల్గొన్నారు.




మిషన్ భగీరథ పనులపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ లక్ష్మారెడ్డి

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	27885	31,000	1705	1704.23	128.72	125.47
నారాయణపూర్	18171	7613	1615	1612.86	37.646	34.69
జూరాల	10000	1560	1045	1040.32	9.66	6.900
తుంగభద్ర	25000	1047	1633	1621.95	100.86	63.67
శ్రీశైలం	4687	0	885	786.00	215.807	22.72
నాగార్జునసాగర్	907	907	590	500.00	312.045	115.31
పులిచింతల	3341	0	175	125.99	45.77	5.39
ప్రకాశం బ్యారేజీ	12230	12230	56.75	56.15	3.070	2.86



(జూన్1 నుంచి ఇప్పటివరకు 574.514 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	26354	494	1522	1516.28	102.732	80.57
కడెం	2525	10800	700	698.60	7.6	7.24
ఎస్సారెస్పీ	38,864	3000	1091	1072.60	90.313	34.401
సింగూరు	3135	265	1717.93	1712.35	29.91	21.35
నిజాంసాగర్	1765	74	1405	1386.25	17.803	2.719
ఎల్లంపల్లి	12724	310	485	480.02	20.175	15.66
లోయర్‌మానేరు	0	129	920	893.40	24.07	7.292
ధవళేశ్వరం	270832	270832	45	45	2.93	2.93



సంగారెడ్డి జిల్లా సింగూర్ ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే బాబూమోహన్ తదితరులు

ఈ యేడు 70 కోట్ల చేప పిల్లలు వేస్తాం

- మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సంగారెడ్డి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: మూడు నెలల్లో కొత్త జిల్లాల వారీగా మత్స్యసహకార సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్టు మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సొసైటీలను పటిష్టపరుచడమే లక్ష్యంగా ఎన్నికలు పెట్టే ఆలోచన కూడా ఉన్నదన్నారు. రెండో విడుత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లోని సిం గూరు ప్రాజెక్టులో లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. గత ఏడాది తెలంగాణలోని ప్రాజెక్టులు, చెరువుల్లో 22 కోట్ల చేపపిల్లలు వేయగా ఈ ఏడాది 70 కోట్లు వేయనున్నట్టు తెలిపారు. గత ఏడాది చేపలు అమ్ముకోవడం ద్వారా మత్స్యకారులు దాదాపు రూ.600 కోట్ల మేర ఆదాయాన్ని ఆర్జించినట్టు తెలిపారు.

ఇండ్ల నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయాలి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బెల్లంపల్లి, నమస్తే తెలంగాణ: డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం కన్నాల శివారులో కొనసాగుతున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.



నిరంతర విద్యుత్ అందించాలి



గోపాల్‌రావు

ఖమ్మం కమాన్‌బజార్: నిరంతర విద్యుత్ సరఫరాకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. బుధవారం ఖమ్మం ఎన్‌పీడీసీఎల్ గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్‌పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమలను నెలకొల్పే అవకాశం ఉన్నదని, ఆ పథకం ద్వారా ఎవరైనా విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయాలన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ/ కలెక్టరేట్: పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక ప్రారంభం, రైతుబజార్, మోడల్ చెరువు మినీట్యాంక్ బండ్, సమగ్ర సాగునీటి సరఫరా పథకాలకు బుధవారం ఆయన ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. పదవులు, హోదా ప్రజలు ఓట్లేస్తే వచ్చిన భిక్షేనన్నారు. ఆరు నెలల్లో హుజూరాబాద్‌లో ఇంటింటికీ తాగునీరందిస్తామని చెప్పారు. అనంతరం కరీంనగర్‌లోని ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నవభారత సంకల్పం-2022 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రుణమాఫీ, వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఉపయోగించుకుని ముందుకు సాగాలని ఎంపీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు.



హుజూరాబాద్‌లో రైతుబజార్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు



మంథనిలో మాట్లాడుతున్న ఎంపీ బాల్క సుమన్, చిత్రంలో ఎమ్మెల్యే పుట్ట మధు

ఆధునిక సాగుతోనే ఆర్థికాభివృద్ధి

రామగిరి: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగిరిఖిల్లా ఏరియా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంథని జేఎన్టీయూ ఆడిటోరియంలో బుధవారం 'సంకల్పంతో సిద్ధి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ.. వ్యయసాయ రంగంలో ఆధునిక పద్ధతులు అనుసరించి, అధిక దిగుబడులతో రైతులకు అధిక ఆదాయం వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: పేదలు, రైతులు, వివిధ వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, వారికి పూర్తిస్థాయిలో లబ్ధిచేకూరేలా టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సెప్టెంబరు 15 నుంచి చేపట్టనున్న భూసర్వేలో గ్రామస్థాయిలో రికార్డులను ప్రక్షాళన చేయనున్నారని మంత్రి తెలిపారు.

రైతులు సంఘటితశక్తిగా మారాలి

ఖమ్మం రూరల్: పోరాట ఫలితంగా వచ్చిన తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినాప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆపలేరన్నారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గ రైతు సమితి సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న మేడిగడ్డ, కాళేశ్వరం, సీతారామ తదితర ప్రాజెక్టుల మోటార్లకు మరో రూ. 25వేల కోట్లు ప్రభుత్వం కేటాయించినట్టు తెలిపారు. జిల్లాలోని దుమ్ముగూడెం వద్ద రూ.8వేల కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టు నిర్మించి ఆయకట్టును సస్యశ్యామలం చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, ఐడీసీ చైర్మన్ బేగ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిట్‌లో డ్రగ్స్ కలకలం: ఇద్దరి అరెస్టు

వరంగల్ సుబేదారి : వరంగల్ నిట్‌లో డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపుతున్నది. రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం నిట్‌లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఇద్దరు పూర్వవిద్యార్థుల(నాన్ బోర్డర్స్) నుంచి ఐదు ఎల్‌సీడీ(లైసర్జిక్ యాసిక్‌డైలమైడ్ చిప్స్ ప్యాకెట్స్), ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాజీపేటలోని వరంగల్ డీసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సురేశ్‌రాథోడ్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నిట్‌లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోదాలు చేశారన్నారు. వన్‌కే మెగా హాస్టల్‌లో 2012 బ్యాచ్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు గుర్రం ద్వీజ్(మెకానికల్ ఇంజినీర్), ఎడ్లపల్లి రమేశ్ వద్ద నుంచి ఎల్‌సీడీ డ్రగ్స్ చిప్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వీరు డార్క్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసి కొరియర్ ద్వారా హైదరాబాద్‌కు తెప్పించుకొని అక్కడి నుంచి నిట్‌లో తెలిసినవారికి ఒక్కో చిప్‌ప్యాకెట్‌ను రూ.2500కు విక్రయిస్తున్నట్టు, ఈ ప్యాకెట్లను నోట్లో వేసుకున్న తర్వాత దాదాపు పది గంటలపాటు మత్తు ఉంటుందని డీసీ తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు మేం సిద్ధం

- కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డికి ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రతిసవాల్



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నమస్తే తెలంగాణ: సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు రావాలని.. పదేపదే సవాళ్లు విసురుతూ.. అవగాహన లేమితో ఆరోపణలు చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి మానసిక స్థితిపై తనకు అనుమానం వస్తుందని ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతుండడంతో ఏం చేయాలో తోచక ఆరోపణలు చేస్తున్నారన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులోని కల్వకుర్తి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కశిరెడ్డి మాట్లాడారు. కేఎల్‌ఐ ద్వారా కల్వకుర్తి ప్రాంతానికి అన్యాయం చేసింది ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీనేనని ఆయన దుయ్యబట్టారు. తనతో చర్చకు రావాలని పదే పదే సవాల్ విసురుతున్న ఎమ్మెల్యే వంశీకి.. చర్చలకు తాము సిద్ధమంటూ కశిరెడ్డి ప్రతిసవాల్ విసిరారు.

వచ్చే ఏడాది నాకు మరింత కీలకం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రముఖ టైర్ల ఉత్పత్తిదారు బ్రిడ్జ్‌స్టోన్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైంది. ఈమేరకు బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుతొషి ఒయామా సింధు నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సింధు మాట్లాడుతూ.. 'ఆటపరంగా నాకు వచ్చే ఏడాది మరింత కీలకం కానుంది. కామన్వెల్త్, ఆసియా క్రీడలు ఉన్న నేపథ్యంలో ఆ టోర్నీలో రాణించడంపై దృష్టి పెడుతాను' అని తెలిపింది.

విదేశాల్లో శిక్షణకు సాయం చేస్తాం

జాతీయ జిమ్నాస్టిక్స్ క్రీడాకారిణికి మంత్రి కేటీఆర్ హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మన రాష్ర్టానికి చెందిన జిమ్నాస్టిక్స్ క్రీడాకారిణి మేఘనా రెడ్డికి విదేశాల్లో శిక్షణ తీసుకునేందుకు ప్రభుత్వం తరపున తోడ్పాటునందిస్తామని మంత్రి కల్వకుంట్ల తారకరామారావు హామీ ఇచ్చారు. జాతీయ రిథమిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో మేఘన స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం తనను కలిసిన మేఘనను మంత్రి కేటీఆర్ అభినందించారు. తన తదుపరి లక్ష్యం వచ్చే ఏడాది జరిగే కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించడమేనని మేఘన తెలిపింది. ఇందు కోసం విదేశాల్లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవాలనుకుంటున్నానని మంత్రి కేటీఆర్‌కు మేఘన వివరించింది. అయితే, అక్కడ శిక్షణ చాలా ఖరీదుతో కూడుకున్నందున, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మేఘన కోరడంతో.. మంత్రి వెంటనే స్పందించి కచ్చితంగా సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మేఘన కెరీర్‌లో అండదండగా నిలుస్తున్న ఆమె తల్లిదండ్రులను మంత్రి కేటీఆర్ అభినందించారు.



మేఘనా రెడ్డిని అభినందిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మేఘన తల్లిదండ్రులు ఉన్నారు.

మహేంద్రుడు @ 300



కెరీర్‌లో మరో ఘనతకు ధోనీ

నేడు భారత్, శ్రీలంక నాలుగో వన్డే

మూడు ప్రపంచ కప్‌ల ముచ్చటైన వీరుడు..
టీమిండియా సారథ్య రికార్డులను తిరుగరాసిన ధీరుడు...
నాలుగు దశాబ్దాల వన్డే చరిత్రకు కొత్త రంగు పులిమిన నాయకుడు..
చిరునవ్వుతో ఒత్తిడికి సమాధానం చెప్పిన యోధుడు..
ప్రపంచ క్రికెట్‌ను తన దరికి చేర్చుకున్న మేరునగధీరుడు..
ఎక్కడో మారుమూల ప్రాంతంలో పుట్టి.. జులపాల జట్టుతో ఆట మొదలెట్టి..
మూస ధోరణి క్రికెట్‌ను కట్టిపెట్టి.. ధైర్యానికి ప్రతీకగా, నైపుణ్యానికి అండగా నిలిచాడు..
సీనియర్లతో కలుపుగోలుగా మెదిలాడు.. ఓవరాల్‌గా భారత క్రికెట్ ఐకాన్‌గా ఎదిగి ఒదుగుతున్నాడు..
అతని వ్యూహం పదునైన అస్త్రం.. అతని సాహసం అనితరసాధ్యం.. అతని పోరాటం అసాధ్యమైన గమ్యం.. అతను ఎంచుకున్న మార్గం.. నమ్మిన సిద్ధాంతం..
భారత యువతకు సరైన మార్గదర్శనం.. క్రికెట్ దేవుడిని మించిన మహేంద్రజాలం అతనిది..
అతనికి అతనే సాటి.. భారత క్రికెట్‌లో మరొకరు లేరు అతనికి పోటీ..!
నేడు లంకతో జరిగే నాలుగో వన్డేతో టీమిండియా మాజీ సారథి ఎంఎస్ ధోనీ..
కెరీర్‌లో మరో అరుదైన రికార్డును అందుకోనున్నాడు.
ఐదుగురికి మాత్రమే సాధ్యమైన 'ఎలైట్-300' క్లబ్‌లో చోటు సంపాదించనున్నాడు.

మ. 2.30 గం. నుంచి సోనీ సిక్స్, టెన్-3, డీడీలో

6
భారత్ తరఫున 300వ వన్డే ఆడుతున్న ఆరో క్రికెటర్ ధోనీ. ఓవరాల్‌గా ఈ జాబితాలో ధోనీ 20వ స్థానంలో ఉన్నాడు.

100
మరో స్టంపింగ్ చేస్తే క్రికెట్‌లో వంద స్టంప్‌లు చేసిన తొలి వికెట్ కీపర్‌గా ధోనీ చరిత్రకెక్కుతాడు.

పిచ్, వాతావరణం
వికెట్‌పై కాస్త పచ్చిక ఉంది. పేస్‌కు అనుకూలించే అవకాశం. చిరుజల్లులతో మ్యాచ్‌కు అంతరాయం కలుగొచ్చు.

కొలంబో:

టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్... వన్డే సిరీస్ కైవసం.. లంక గడ్డపై భారత్ తిరుగులేని ప్రదర్శన.. ఆటగాళ్ల సూపర్ ఫామ్.. ఇలాంటి అంశాలను కాసేపు పక్కనబెడితే.. గురువారం శ్రీలంకతో జరిగే నాలుగో వన్డేకు.. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఓ స్పష్టమైన గుర్తింపు రాబోతున్నది. అదేంటంటే.. సుదీర్ఘమైన భారత క్రికెట్ చరిత్ర స్థితి గతులను మార్చిన మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ.. తన వన్డే కెరీర్‌లో ఓ అరుదైన రికార్డును అందుకోబోతున్నాడు. ఇప్పటి వరకు టీమ్‌ఇండియా తరఫున ఐదుగురికి మాత్రమే సాధ్యమైన 'ఎలైట్-300' క్లబ్‌లో మన మహీకి చోటు దక్కనుంది. ప్రేమదాస స్టేడియంలో లంకతో జరిగే నాలుగో వన్డే ఈ జార్ఖండ్ డైనమెట్‌కు 300ల మ్యాచ్. గతంలో సచిన్ (463), ద్రవిడ్ (344), అజారుద్దీన్ (334), గంగూలీ (311), యువరాజ్ (304) మాత్రమే ఈ అరుదైన ఘనతను అందుకున్నారు. భారత క్రికెట్ ముద్దుగా పిలుచుకునే ఈ 'మిస్టర్ కూల్' కూడా ఈ మ్యాచ్ కోసం ఆతృతగా వేచి చూస్తున్నాడు. చివరి రెండు వన్డేల్లో తన సూపర్ ఫినిషింగ్‌తో టీమ్‌ఇండియాను గట్టెక్కించిన ధోనీ.. అలాంటి ప్రదర్శనతోనే ఈ మ్యాచ్‌నూ చిరస్మరణీయం చేసుకోవాలని భావిస్తున్నాడు. స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్‌తో కలిసి ఆడినా.. లోయర్ ఆర్డర్ భువీని ముందుకు నడిపించినా తన దృక్పథంలో ఎలాంటి మార్పు ఉండదంటూ తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు. కుర్ర స్పిన్నర్ ధనంజయ రంకెలు వేసినా.. మహేంద్రుడి ముందు మాత్రం మౌనంగా వెనుకడుగు వేయడమే ఇందుకు నిదర్శనం. ఓవరాల్‌గా అటు ప్రపంచ క్రికెట్, ఇటు భారత అభిమానులు ఈ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'రిజర్వ్'కు అవకాశం!

ఇప్పటికే సిరీస్‌ను చేజిక్కించుకోవడంతో చివరి రెండు మ్యాచ్‌ల్లో ప్రయోగాలు చేయాలని కోహ్లీ భావిస్తున్నాడు. దీంతో రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన కుల్దీప్, మనీష్, రహానే, శార్దూల్ ఠాకూర్‌లలో కనీసం ఇద్దరికి అవకాశం దక్కొచ్చు. దీనికి తోడు నాలుగో నంబర్‌లో రాహుల్ విఫలంకావడంతో అతని స్థానాన్ని మార్చాలని కెప్టెన్ యోచిస్తున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లో తన వైఫల్యానికీ మార్గం కనుగొనాలని చూస్తున్నాడు. ఇక అందరికంటే ఎక్కువగా కేదార్ జాదవ్‌పై ఒత్తిడి ఉంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ధనంజయ బౌలింగ్‌ను అంచనా వేయలేక అతను వికెట్ సమర్పించుకున్నాడు. కాబట్టి ఈ మ్యాచ్‌లో జాదవ్ స్థానంలో మనీష్‌కు చోటు ఇచ్చేందుకు మేనేజ్‌మెంట్ సిద్ధమవుతున్నది. పేసర్ ఠాకూర్‌ను ఎక్కడ సర్దుబాటు చేస్తారన్నది కూడా ఆసక్తికరం. ఎందుకంటే భువనేశ్వర్, బుమ్రా విశ్రాంతి తీసుకోవడానికి సుముఖంగా లేరు. కానీ ఆటగాళ్లను రొటేషన్ చేస్తామని ఇప్పటికే కోహ్లీ ప్రకటించాడు కాబట్టి అక్షర్, చాహల్‌లలో ఒకర్ని తప్పించి కుల్దీప్‌కు అవకాశం ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి తుది జట్టులో ఎవరు ఉంటారన్నది మాత్రం మ్యాచ్‌కు ముందే తేలనుంది.

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, రాహుల్, మనీష్ పాండే, ధోనీ, హార్దిక్, అక్షర్, కుల్దీప్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా.
శ్రీలంక: మలింగ (కెప్టెన్), డిక్‌వెల్లా, గుణతిలక / దిల్షాన్ మునవీర, మెండిస్, తిరిమన్నే, మాథ్యూస్, సిరివర్ధన, పెరీరా, ధనంజయ, చమీరా, ఫెర్నాండో.

నాలుగో వన్డేకు మూడో కెప్టెన్..



మలింగ

గాయాల బెడదతో ఇబ్బందిపడుతున్న లంకకు ఇప్పుడు సెలెక్టర్ల రాజీనామా కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టింది. గత ఏడాది కాలంలో వన్డేల కోసం ఈ కమిటీ ఎంపిక చేసిన 40 మందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా గట్టిగా ఆడలేకపోయారు. దీంతో తుది జట్టు కూర్పుపై స్పష్టత కరువైంది. కుడి బొటన వేలి పగులు కారణంగా చండిమల్, వెన్ను నొప్పితో తాత్కాలిక కెప్టెన్ కపుగెడెర ఈ మ్యాచ్‌కు దూరమయ్యారు. దీంతో పేసర్ మలింగకు సారథ్య బాధ్యతలు అప్పగించారు. అంటే నాలుగో వన్డేకు మూడో కెప్టెన్ అన్నమాట. చండిమల్, కపుగెడెర స్థానంలో డిసిల్వా, దిల్షాన్ మునవీరాలను జట్టులోకి తీసుకున్నారు. ఇప్పటికే టెస్టు, వన్డే సిరీస్‌ను కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో ఉన్న కుర్రాళ్లు ఈ మ్యాచ్‌లో గెలువడం కత్తి మీద సామే. అలాగే 2019 వన్డే వరల్డ్‌కప్ బెర్త్‌ను సాధించడం కూడా వీళ్ల ముందున్న పెద్ద లక్ష్యం. దీన్ని సాధించాలంటే చివరి రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలిచి తీరాలి. ఈ సమీకరణమే లంకపై అధిక ఒత్తిడిని కలుగజేస్తున్నది. టాప్ ఆర్డర్ రాణించి మంచి స్కోర్లు చేస్తున్నా.. బౌలర్లు సమయానుకూలంగా స్పందించడం లేదు. స్పిన్నర్ ధనంజయను ఎక్కువగా నమ్ముకున్నా.. మలింగలాంటి సీనియర్లు వికెట్లు తీయడంలో విఫలంకావడం లంకకు చేటు తెస్తున్నది. కాబట్టి అందరు కలిసికట్టుగా ఆడితే తప్ప ఈ మ్యాచ్‌లో గెలువడం ఆతిథ్య జట్టుకు శక్తికి మించిన పనే.

1
వన్డేల్లో 300 వికెట్ల ఘనతకు మలింగ మరో వికెట్ దూరంలో ఉన్నాడు. లంక తరఫున ఈ ఘనత సాధించనున్న నాలుగో బౌలర్ కాగా, ఓవరాల్‌గా 13వ బౌలర్.

8
విరాట్ సారథ్యంలో లంకతో ఆడిన 8 ద్వైపాక్షిక వన్డే మ్యాచ్‌ల్లోనూ భారత్‌దే విజయం. తటస్థ వేదికల్లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో మాత్రం ఓటమిపాలైంది. ఆసియా కప్, విండీస్‌లో ముక్కోణపు సిరీస్, చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ ఇందులో ఉన్నాయి.

వారెవ్వా బంగ్లా

షకీబల్ స్పిన్ తడాఖా ■ ఆస్ట్రేలియాపై అద్భుత విజయం

టెస్ట్ సిరీస్‌లో 1-0తో ఆధిక్యం



షకీబల్

ఢాకా: టెస్ట్ క్రికెట్ మజా ఏంటో మరోసారి అభిమానులు ఆస్వాదించారు. రెండు రోజుల వ్యవధిలో రెండు సంచలన విజయాలు నమోదయ్యాయి. నిన్న ఇంగ్లండ్‌ను వారి సొంతగడ్డపైనే వెస్టిండీస్ మట్టికరిపిస్తే.. ఇప్పుడు మాజీ ప్రపంచ నంబర్‌వన్ ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ చిరస్మరణీయ విజయం సాధించింది. నాలుగురోజుల్లోనే ముగిసిన ఢాకా టెస్ట్‌లో బంగ్లా 20 పరుగుల తేడాతో ఆసీస్‌పై అద్భుత విజయం అందుకుంది. దీంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో బంగ్లా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సొంతగడ్డపై తామెంత ప్రమాదకారులమో బంగ్లా మరోమారు ప్రత్యర్థులకు ఘనంగా చాటిచెప్పింది. సరిగ్గా దశాబ్దకాలం తర్వాత తమ గడ్డపై తొలిసారి అడుగుపెట్టిన కంగారూలకు కలకాలం గుర్తుండిపోయే ఓటమిని కట్టబెట్టింది. 265 పరుగుల లక్ష్యం కోసం 109/2 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగోరోజు బుధవారం ఆటను కొనసాగించిన ఆసీస్.. 244 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ వార్నర్ (112), కెప్టెన్ స్మిత్ (37) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షకీబల్ హసన్ (5/85), తైజుల్ ఇస్లాం (3/60) ధాటికి ఆసీస్ ఓ దశలో 12 పరుగుల తేడాతో 4 వికెట్లు కోల్పోయి ఓటమిని కొనితెచ్చుకుంది. 101 టెస్ట్‌ల్లో బంగ్లాకు ఇది పదో విజయం కావడం విశేషం. షకీబల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు:
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 260 ఆలౌట్, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 217 ఆలౌట్, **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** 221 ఆలౌట్, **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 244 ఆలౌట్.

షర్జీల్‌పై ఐదేండ్ల నిషేధం



కరాచీ: స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన పాకిస్థాన్ టెస్టు క్రికెటర్ షర్జీల్ ఖాన్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఐదేండ్ల నిషేధం విధించింది. ఈ ఏడాది నిర్వహించిన పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్(పీసీఎల్)లో షర్జీల్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆ దేశ అవినీతి నిరోధక ట్రిబ్యునల్ నిర్ధారించింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి ఐదేండ్లపాటు అతనిపై నిషేధం విధిస్తున్నట్లు ట్రిబ్యునల్ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై షర్జీల్ 14 రోజుల వ్యవధిలో బోర్డు నియమించిన స్వతంత్ర్య న్యాయనిర్ణేత వద్ద కానీ స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో కానీ అప్పీలు చేసుకోవచ్చని సూచించింది.

కౌంటీల్లో అశ్విన్ అదుర్స్

వోర్సెస్టర్: భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్..ఇంగ్లండ్ కౌంటీల్లో అరంగేట్రంలోనే అదరగొట్టాడు. వోర్సెస్టర్‌షైర్ తరఫున బరిలోకి దిగిన అశ్విన్..గ్లౌసెస్టర్‌షైర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అశ్విన్ మూడు వికెట్లు పడగొట్టడంతో పాటు 36 పరుగులు చేశాడు. అయితే వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో సిరీస్ ఉన్న నేపథ్యంలో మిగిలిన కౌంటీ మ్యాచ్‌లకు అశ్విన్ అందుబాటులో ఉంటాడా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. శ్రీలంకతో సిరీస్ ముగిసిన వెంటనే దీనిపై స్పష్టత రానుంది.

పల్లికల్‌ను ఓడించి మెయిన్ డ్రాకు



జోష్న

షాంఘై: భారత స్క్వాష్ స్టార్ జోష్న చినప్ప చైనా ఓపెన్‌లో మెయిన్‌డ్రాలోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తుది అర్హత రౌండ్‌లో భారత్‌కే చెందిన దీపికా పల్లికల్‌పై 7-11, 11-5, 11-6, 7-11, 11-8 తేడాతో విజయం సాధించి మెయిన్‌డ్రాకు అర్హత సాధించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో సౌరవ్ ఘోశల్ 11-9, 6-11, 11-9, 11-1తో ఒమర్ అబ్దెల్(ఈజిప్టు)పై గెలుపుతో మెయిన్ డ్రాలో నిలిచాడు.

ఓఝాను విడువని బెంగాల్

కోల్‌కతా: లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓఝా..హైదరాబాద్ రంజీ జట్టులో ప్రాతినిధ్యంపై ఒకింత సందిగ్ధత ఏర్పడింది. రానున్న దేశవాళీ సీజన్‌లో తమ జట్టు నుంచి అతన్ని వదులుకునే ప్రసక్తి లేదని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్(క్యాబ్) చీఫ్ సౌరవ్ గంగూలీ బుధవారం స్పష్టం చేశాడు. 'అతను(ఓఝా) బెంగాల్ నుంచి విడుదల చేయాలని కోరుతున్నాడు, కానీ అతన్ని వదులుకోం. హైదరాబాద్ జట్టు ప్లేట్ డివిజన్‌కు పడిపోయినప్పుడు బెంగాల్ జట్టులో ఓఝా చేరాడు. అతని సేవలు మాకు అవసరమున్నందున ఎలా విడిచిపెట్టుకుంటాం' అని గంగూలీ అన్నాడు. దీనిపై గురువారం క్యాబ్ క్యాబ్ కార్యదర్శి అభిషేక్..హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)తో మాట్లాడుతాడు. 'ఓఝాను బెంగాల్ వదులుకోకపోతే ఏం చేయలేం. క్రికెట్ ప్రయోజనాల దృష్ట్యా క్యాబ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం' అని హెచ్‌సీఏ కార్యదర్శి శేష్‌నారాయణ అన్నాడు.

యు ముంబా ఘన విజయం



ముంబై: ప్రొ కబడ్డీలో యు ముంబా జట్టు విజయభేరి మోగించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 38-32 పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్ జట్టును ఓడించింది. రైడింగ్‌లో రెండు జట్లూ 21 పాయింట్లతో సమవుజ్జీలుగా నిలిచినా ట్యాకిలింగ్‌లో యు ముంబా 14 పాయింట్లు నెగ్గి విజయాన్ని సొంతం చేసుకుంది. యు ముంబా జట్టులో అనూప్‌కుమార్ 8, శ్రీకాంత్ జాదవ్ 6 పాయింట్లు సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఫెదరర్ కష్టంగా..

తొలిరౌండ్లో చెమటోడ్చిన స్విస్ మాస్టర్ ■ రెండోరౌండ్‌కు నాదల్, స్వితోలినా



న్యూయార్క్: ఈ సీజన్‌లో భీకరఫామ్‌తో అదరగొడుతున్న స్విస్ టెన్నిస్ మాస్టర్ రోజర్ ఫెదరర్ యూఎస్ ఓపెన్‌ను మాత్రం తడబడుతూ ప్రారంభించాడు. గత గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌లో విజేతగా నిలిచిన ఫెదరర్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్‌లో ఆరంభంలోనే ఓటమి అంచులదాకా వెళ్లి వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ తొలిమ్యాచ్‌లో అమెరికాకు చెందిన 19ఏండ్ల టీనేజర్ ఫ్రాన్సెస్ తియాఫో.. 19గ్రాండ్‌స్లామ్‌ల వీరుణ్ని దాదాపు ఓడించినంత పనిచేశాడు. ఐదుసెట్ల హోరాహోరీపోరులో రెండుసెట్లు గెలుచుకొని విజయం దిశగా దూసుకెళ్లిన ఫ్రాన్సెస్ ఆఖర్లో ఫెదరర్ అనుభవానికి తలొగ్గి 6-4, 2-6, 1-6, 6-1, 4-6తో ఓటమిపాలయ్యాడు. ఈ వేదికపై ఆరోటైటిల్‌పై గురిపెట్టిన ఫెదరర్ రెండోరౌండ్లో మైకేల్ యోజ్నీ, బ్లాజ్ కావ్‌సిచ్ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ 7-6(8-6), 6-2, 6-2తో డుసాన్ లాజోవిచ్ (సెర్బియా)పై గెలుపొంది టోర్నీలో శుభారంభం చేశాడు. ఆస్ట్రియా స్టార్ ఆటగాడు డొమినిక్ తీమ్ 6-4, 6-1, 6-1తో అలెక్స్ డి మినార్‌ను సులువుగా ఓడించి రెండోరౌండ్ చేరాడు. లియోనార్డ్ మేయర్ (అర్జెంటీనా) 3-6, 6-2, 6-4, 6-2తో 26వ సీడ్ రిచర్డ్ గాస్కెట్‌ను తొలిరౌండ్లోనే ఇంటికి పంపాడు.


కెర్బర్‌కు షాక్ :



స్వితోలినా

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఏంజెలికా కెర్బర్‌కు తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. జపాన్‌కు 19ఏండ్ల నయోమి ఒసాకా 6-3, 6-1తో మాజీ నంబర్‌వన్ కెర్బర్‌కు షాకిచ్చి సంచలన విజయాన్ని నమోదుచేసింది. మ్యాచ్ ఆరంభం నుంచే కెర్బర్‌పై విరుచుకుపడ్డ ఒసాకా ఏకంగా 22 విన్నర్లను సంధించింది. 4వ సీడ్ ఎలినా స్వితోలినా (ఉక్రెయిన్) 6-0, 6-7(5), 6-3తో కాటరీనా సినియాకోవా (చెక్)పై గెలిచి రెండోరౌండ్ చేరింది. మరో తొలిరౌండ్ మ్యాచ్‌లో ఎగెనియా రొడినా (రష్యా) 7-6(2), 6-1తో కెనడా బ్యూటీ ఎగానీ బౌచార్డ్‌ను చిత్తుచేసింది.


MAKE IN INDIA
CELKON
CELEBRATING
43
YEARS OF
PASSION
AND
INSPIRATION
25
YEARS OF
RETAIL
EXPERIENCE
మార్గాన్ని దాటేవాడు సమర్థుడు, మార్గం చూపేవాడు నాయకుడు
ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, సవాళ్ళను సంకల్పంగా మార్చుకొని
చిరు వాదీల వ్యాపారంతో మొదలెట్టి, మొబైల్ రీటైలింగ్ సామ్రాజ్యాన్ని సృష్టించి
ప్రముఖ దేశీయ బ్రాండ్ సెల్‌కాన్ మొబైల్స్‌ని నెలకొల్పి,
దక్షిణ భారతదేశంలో తొలి మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లను స్థాపించి, వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించి
ఈ తరానికి స్ఫూర్తిగా నిలిచిన నవతరం పారిశ్రామికవేత్త
వై. గురుస్వామి నాయుడు గారికి
Chairman & MD
Director
CELKON
Big C
జన్మదిన శుభాకాంక్షలు
Soma Nagaraju Hyderabad
Sridhar Karimnagar
Srinivas Mancherial
Satish Khammam
Dinesh Hyderabad
Srinivas Hyderabad
Salam Hyderabad
Santosh Warangal


స్వాగతం - సుస్వాగతం
రెండు పడక గదుల ఇళ్ళు - నిరుపేదల ఆశల హరివిల్లు
కేసీఆర్ వరం
ఇట్లు
దమ్మపేట మండల తెరాస పార్టీ
అంకంపాలెం, భద్రాద్రి జిల్లా
(ప్రారంభోత్సవం : 31-08-2017)